

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'
పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 సంచిక: 127
SUNDAY Special
ఆదివారం 22-1-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మన బౌలింగ్ భళా..
భారత బౌలర్ల దెబ్బకు రెండో వన్డేలో న్యూజిలాండ్ 108కి ఆలౌట్. ఎనిమిది వికెట్లతో నెగ్గిన టీమిండియా. సిరీస్ 2-0తో సొంతం. మంగళవారం ఇండోర్‌లో చివరి వన్డే.
- వివరాలు 12లో



న్యూజిలాండ్ ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్
న్యూజిలాండ్ నూతన ప్రధానిగా 44 ఏళ్ల క్రిస్ హిప్కిన్స్ నియమితులు కానున్నారు. నేడు జరిగే ప్రతినిధుల సభలో హిప్కిన్స్ అభ్యర్థిత్వాన్ని లేబర్ పార్టీ అధికారికంగా ప్రకటించనుంది.
- వివరాలు 6లో



బీబీసీ కథనంపై కేంద్రం కన్నెర్ర
గుజరాత్ అల్లర్లకు నాటి సీఎం మోదీనే కారణమంటూ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీపై భారత సర్కార్ ఆంక్షలు విధించింది.
వివరాలు 6లో ▸



జమ్మూలో జంట పేలుళ్లు
కాంగ్రెస్ జోడో యాత్ర మరో రెండ్రోజుల్లో జమ్మూ చేరుకోనుండగా జంట పేలుళ్లు చోటుచేసుకున్నాయి. 9 మంది గాయపడ్డారు.
వివరాలు 6లో ▸



స్వాతిపై ఎల్‌జీకి బీజేపీ ఫిర్యాదు
ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్‌ను ఓ వ్యక్తి వేధించిన ఘటన బీజేపీ జోక్యంతో రాజకీయ రంగు పులుముకుంటోంది.
వివరాలు 6లో ▸



నేతాజీ, ఆరెస్సెస్ భిన్నధ్రువాలు
భావజాలపరంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆరెస్సెస్ భిన్న ధ్రువాలని నేతాజీ కుమార్తె అనితా బోస్ పిఫాఫ్ అన్నారు.
వివరాలు 6లో ▸



'పుడమి సాక్షి'గా..
పేపర్‌లో అక్షరం - టీవీలో వీక్షణం
పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతు బాధ్యతగా సాక్షి మీడియా గ్రూప్ మూడేళ్లుగా 'పుడమి సాక్షిగా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ముంచుకొస్తోన్న ముప్పుపై సమాజాన్ని హెచ్చరిస్తూ, ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ వ్యవస్థను చైతన్యపరిచేలా ఉద్యమిస్తోన్న 'సాక్షి'.. ఎంచుకున్న థీమ్‌పై ప్రతీ ఏటా అన్ని అంశాలను స్పృశిస్తూ మార్పు కోసం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది 'రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్' నినాదంతో వ్యర్థాల నుంచి, కాలుష్యాల నుంచి ప్రకృతిని కాపాడుకోవలసిన బాధ్యతను గుర్తుచేస్తోంది. దీనికి సంబంధించి ప్రజలను చైతన్యపరిచే ప్రత్యేక కథనాలను నేటి 'ఫన్‌డే' బుక్‌తో మీకు అందిస్తున్నాం. 'పుడమి సాక్షిగా' మెగా టాకథాన్ కార్యక్రమం సాక్షి టీవీలో ఈ నెల 26న గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రసారం కానుంది.

14,000+ పోస్టులు
గ్రామ, వార్డు సచివాలయాల్లో భర్తీకి ఈసారి ఆన్‌లైన్ పరీక్షలు

- ఒకటి, రెండు విడతల్లో 14 పరీక్షలు.. ఈసారి 19 కేటగిరీ ఉద్యోగాలకు 19 రకాల రాత పరీక్షలు
- అప్పట్లో వీఆర్వో, సర్వేయర్ కలిపి ఒకటి.. మరో నాలుగు రకాల ఉద్యోగాలకు మరొకటి
- ఇప్పుడు అన్నింటికీ వేర్వేరుగా పరీక్షలు.. విడతకు 40 వేల మంది చొప్పున అవసరమైతే 20 రోజులకు పైగా నిర్వహణ
- పలు మార్పులతో ఫిబ్రవరిలో మూడో విడత నోటిఫికేషన్‌కు కసరత్తు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న దాదాపు 14 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి మరో విడత నోటిఫికేషన్ జారీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈసారి ఉద్యోగ నియామక రాత పరీక్షలను పూర్తి స్థాయి ఆన్‌లైన్ విధానంలో చేపట్టాలని యోచిస్తోంది. దీనిపై వచ్చే వారం రోజుల్లో తుది నిర్ణయం తీసుకోనుందని అధికార వర్గాలు వెల్లడించాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 1.34 లక్షల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలను ఒకేసారి మంజూరు చేయడంతో పాటు కేవలం నాలుగు నెలల వ్యవధిలో వాటిని భర్తీ చేసిన విషయం తెలిసిందే. 2019 జులై - అక్టోబర్ మధ్య మొదటి విడతగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం భారీగా నియామక ప్రక్రియ నిర్వహించింది. అప్పట్లో మిగిలిపోయిన ఉద్యోగాలకు 2020 జనవరిలోనే రెండో విడత నోటిఫికేషన్ జారీ చేసి, కరోనా సమయంలో కూడా ఆ ఏడాది సెప్టెంబర్‌లో రాత పరీక్షలు నిర్వహించి నియామకాలు పూర్తి చేసింది. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న, ఇంకా మిగిలిపోయిన ఉద్యోగాల భర్తీకి ఇప్పుడు మరో విడత.. మూడో నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు చేస్తోంది. గత రెండు విడతల మాదిరే.. ఈ సారి కూడా ఉద్యోగ నియామక పరీక్షల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. అయితే, గత రెండు విడతల్లో ఉద్యోగ నియామక రాత పరీక్షలను

మిగతా 3వ పేజీలో ▶

ఫిబ్రవరిలో నోటిఫికేషన్..
గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీతో పాటు వీలైనంత త్వరగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖలు ఇందుకు సంబంధించిన కసరత్తును వేగవంతం చేశాయి. కేటగిరీల వారీగా ఉద్యోగాలకు సంబంధించి ఆయా శాఖలు రోస్టర్‌- రిజర్వేషన్ల వారీగా ఖాళీల వివరాలకు తుది రూపు ఇస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియ ముగియగానే, ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీకి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు.

జీతాలపై ఎందుకీ దుర్మార్గపు రాతలు?
గత ప్రభుత్వాలు ఏవైనా 1వ తేదీనే అందరికీ జీతాలిచ్చాయా?

- పోనీ... ఇతర రాష్ట్ర ప్రభుత్వాలేమైనా ఇప్పుడు ఇస్తున్నాయా?
- వివిధ విభాగాల బిల్లులు అప్‌లోడ్, ప్రాసెస్‌కు సమయం పట్టదా?
- చంద్రబాబు హయాంలో కూడా 1 నుంచి 23 మధ్యనేగా జీతాలిచ్చింది?
- అప్పట్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, మరికొందరికి నెలల తరబడి పెండింగే
- ఆరేడు నెలల పాటు జీతాలివ్వకున్నా 'ఈనాడు' అక్షరం కూడా రాయలేదు
- ఇప్పుడు అలాంటి వారందరికీ రెగ్యులర్ ఉద్యోగులతో పాటే జీతాలు
- వారికి కూడా అదే నెలలో 1 నుంచి 20 మధ్యే ఠంచనుగా చెల్లింపులు
- ఉద్యోగుల సంక్షేమంలో ఇదో కొత్త చరిత్ర... విప్లవాత్మకమైన మార్పు



- ఇన్ని చర్యలు తీసుకున్నా 'ఈనాడు' సహా కొన్ని పత్రికల తప్పుడు కథనాలు
- వీటిపై చట్టపరమైన చర్యలతో పాటు... పరువు నష్టం దావా
- ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ వెల్లడి
- రాష్ట్ర విభజన సమస్యలు, కోవిడ్ సంక్షోభం ఉన్నా జీతాలు, పెన్షన్లు ఆపలేదు
- అవాస్తవ ప్రచారాలను, ఆరోపణలను నమ్మాల్సిన పనిలేదని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులందరికీ 1వ తేదీనే జీతాలిస్తున్న రాష్ట్రమేదైనా ఉందా? పోనీ మన రాష్ట్రంలో గత ప్రభుత్వాలన్నీ ఇలా 1వ తేదీనే ఇచ్చాయా? ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఎప్పుడూ అందరికీ 1వ తేదీనే ఇచ్చిన దాఖలాలు లేవు కదా? ప్రభుత్వంలో లక్షల మంది ఉద్యోగులు, వివిధ రకాల విభాగాలు ఉన్నపుడు... వారి బిల్లులన్నీ అప్‌లోడ్ చేయటం, వాటిని ఆమోదించటం అన్నీ పూర్తయి... అందరికీ 1వ తేదీనే ఇవ్వటం సాధ్యమా? గతంలో కూడా ఇలా ఇవ్వలేనపుడు... ఇప్పుడు మాత్రమే 'ఈనాడు' ఎందుకీ వ్యతిరేక కథనాలను వరసగా ప్రచురిస్తోంది? ఎప్పుడో 1977లోనే జీవో

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్


పట్టణాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళిక


రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, మురుగు శుద్ధితో పాటు స్థానిక చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి విడతగా రూ.3,151.48 కోట్లు ఖర్చు చేయనున్నాయి.
- వివరాలు 3లో

నాగలి పడుతున్న నారీమణులు
దేశవ్యాప్తంగా వ్యవసాయంలో మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వారికి అనువైన వ్యవసాయ యంత్రాలను తయారు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నాబార్డు సూచించింది.
- వివరాలు 2లో


ఇంజనీరింగ్‌లో సగం సీట్లు ఖాళీ

- దేశవ్యాప్తంగా ఏటా భారీగా మిగిలిపోతున్న సీట్లు
- కాలేజీల్లో మౌలిక సదుపాయాల లేమితో తగ్గుతున్న చేరికలు
- ప్లేస్‌మెంట్లు లేని కాలేజీల వైపు అసలు చూడని విద్యార్థులు
- కోర్ గ్రూప్ కోర్సుల్లోనూ ప్రవేశాలకు ఏఐసీటీఈ మైనర్ కోర్సుల విధానం
- ఏపీలో ఇందుకు భిన్నమైన పరిస్థితి
- గత మూడేళ్లుగా 80 శాతానికి పైగా సీట్ల భర్తీ
- ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు



- దాంతో పాటు వసతి దీవెన కింద ప్రతి విద్యార్థికి రూ.20 వేలు
- కాలేజీలలో ప్రమాణాలు లేకుంటే కౌన్సెలింగ్‌కు అనుమతి రద్దు

- వివరాలు 3లో



కొల్లేరు..
జీవవైవిధ్య జలతారు
నింగిలో రెక్కలు విప్పి వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే పక్షుల సమూహాలు.. నీటిలో విహరించే అరుదైన చేప జాతులు.. ఆ చెంతనే నేలపై విస్తరించిన గ్రామాల్లో బతుకు సాగించే జనాలు.. అదే జీవవైవిధ్య కొల్లేరు. ప్రకృతి ప్రసాదించిన ఈ సరస్సు దక్షిణ కాశ్మీరంగా పేరొందింది.
- వివరాలు 3లో

బీసీ కార్పొరేషన్‌ల పదవీకాలం పొడిగింపు

- కొనసాగనున్న పాత చైర్మన్లు, డైరెక్టర్లు
- బీసీ వర్గాల్లో హర్షాతిరేకాలు

సాక్షి, అమరావతి/తణుకు అర్బన్/గణపవరం/నరసన్నపేట: రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్‌ల పదవీకాలాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 139 వెనుకబడిన కులాలకు 56 సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆ కార్పొరేషన్‌ల పదవీకాలం ముగిసింది. దీంతో వాటిలో 55 బీసీ కార్పొరేషన్‌లను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆయా కార్పొరేషన్‌లకు చెందిన చైర్మన్‌లు, డైరెక్టర్లు పదవిలో కొనసాగుతారని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, పాల ఏకరి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ టి.మురళీధర్ ఆ తర్వాత జెడ్పీటీసీ సభ్యుడిగా ఎంపికవడంతో ప్రస్తుతానికి ఆ కార్పొరేషన్ పదవీకాలాన్ని కొనసాగించలేదు.

సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలాన్ని పొడిగించిన నేపథ్యంలో బీసీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న ఆధ్వర్యంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.


తణుకులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పెండ్ర వీరన్న, చిత్రంలో మంత్రి కారుమూరి

బీసీలకు పెద్దపీట: ఏపీ బీసీ సంఘం
సీఎం వైఎస్ జగన్ బీసీలకు అన్నింటా పెద్ద పీట వేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్ అన్నారు. బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వాటిని, వాటి పదవీ కాలాన్నీ తిరిగి యథాతథంగా కొనసాగిస్తూ శనివారం ప్రభుత్వం జీవో జారీ చేయడంపై యావత్తు బీసీ లోకం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు.

ఏలూరు జిల్లా గణపవరంలో రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీశయన, పొందర-కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్లు చీపురు రాణి, రాజాపు హైమావతి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

అన్ని భారతీయ భాషల్లోకి తీర్పుల కాపీలు


- కోర్టు తీర్పులను అన్ని భారతీయ భాషల్లోకి అందుబాటులోకి తెచ్చేందుకు కృత్రిమ మేధ(ఏఐ)ను వినియోగించుకుంటామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. సమాచార అంతరాలను తొలగించడంలో సాంకేతికత చాలా కీలకమైందని ఆయన అన్నారు.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి

నూతనంగా ఉండేది భవనమే.. బడ్జెట్ కాదు!!

డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా ఏపీ

- బీపీఎంలకు రాష్ట్ర ప్రభుత్వ మద్దతు అద్భుతం
- ఇన్ఫినిటీ వైజాగ్-2023 ముగింపు సదస్సులో ఐటీ ప్రతినిధులు
- బీచ్ ఐటీ డెస్టినేషన్‌గా వైజాగ్ అభివృద్ధి

2లో



ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్-2023 ముగింపు కార్యక్రమంలో ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు, ఎస్‌టీపీఐ, ఎపిటా ప్రతినిధుల సంఘీభావం

- ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు స్వర్గధామంగా ఉన్న విశాఖపట్నంలో పెట్టుబడుల కోసం వివిధ సంస్థల్ని ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్-2023 విజయవంతంగా ముగిసింది. భవిష్యత్ ఐటీ రంగం మొత్తం విశాఖదేనని ప్రముఖ ఐటీ రంగ నిపుణులు స్పష్టంచేశారు.

ఎగువన గరళం.. దిగువన స్వచ్ఛం


సంగమేశ్వరం నుంచి హంసలదీవి వరకు స్వచ్ఛంగా కృష్ణా నదీ జలాలు

- 2019 నుంచి ఏపీ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్లే స్వచ్ఛంగా మారుతున్న నదీ జలం
- మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని వాడపల్లి వరకు కాలుష్య కాసారంగా కృష్ణా
- ఆ రాష్ట్రాల పరిధిలో మనుషులు తాగడానికి పనికిరావు
- కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అధ్యయనంలో వెల్లడి
- 2018 వరకు ఏపీలోనూ అదే దుస్థితి
- కృష్ణా నదిని పరిరక్షించాలని 2018లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్జీటీ ఆదేశం
- రాష్ట్ర పరిధిలో నది పరిరక్షణకు చర్యలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్
- నది పరిసర నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఎస్టీపీల నిర్మాణం
- మురుగునీటిని శుద్ధి చేసి.. పునర్వినియోగించేలా చర్యలు
- పారిశ్రామిక, గనుల వ్యర్థాలకు అడ్డుకట్ట.. శాస్త్రీయ పద్ధతిలో చెత్త నిర్మూలన

సాక్షి, అమరావతి: కృష్ణా నది పురుడుపోసుకునే మహారాష్ట్ర నుంచి కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల వరకు కృష్ణా నది జలాలు తాగడానికి పనికిరానంతగా కలుషితమవుతున్నాయి. మహారాష్ట్రతోపాటు మలప్రభ, ఘటప్రభ, తుంగభద్ర తదితర ఉపనదులను కలుపుకొని ప్రవహించే కర్ణాటకలో కృష్ణా జలాలు విషతుల్యమే. తెలంగాణలో కృష్ణా జలాలు నేరుగా తాగడానికి పనికిరావు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే స్వచ్ఛంగా, నేరుగా తాగే విధంగా ఉన్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ), రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించిన వాస్తవాలివి. సీపీసీబీ..

మిగతా 13వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఏపీఎస్పీకి నాలుగు స్కోచ్ అవార్డులు

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగం(ఏపీఎస్పీ) నాలుగు స్కోచ్ అవార్డులను గెలుచుకుంది. నో డిజర్షన్ (గైర్హాజరు వద్దు) ప్రాజెక్టుకు రెండు, క్రమశిక్షణ ప్రాజెక్టుకు ఒకటి, ఫైటింగ్ ఫిట్ ప్రాజెక్టుకు ఒకటి చొప్పున అవార్డులను స్కోచ్ సంస్థ ప్రకటించింది. ఏపీఎస్పీ తరఫున అదనపు డీజీ(ఏపీఎస్పీ) శంఖబ్రత బాగ్చీకి ఈ అవార్డులను శనివారం ప్రదానం చేశారు. ఏపీఎస్పీ బలగాలలో గైర్హాజరును తగ్గించేందుకు నో డిజర్షన్ కంట్రోల్ ప్రాజెక్టును 2020, అక్టోబర్ 23న ప్రారంభించి సమర్థంగా అమలు చేస్తున్నారు. గైర్హాజరుకు కారణాలను తెలుసుకుని అందుబాటులో ఉన్న సెలవులను మంజూరు చేస్తున్నారు. అంతకుముందు ఏడాదికి 176 మంది డిజర్షన్ అయ్యేవారు. ఈ ప్రాజెక్టు చేపట్టిన తర్వాత డిజర్షన్ అయినవారి సంఖ్య 2021లో 125, 2022లో 73కు తగ్గింది. ఇక క్రమశిక్షణ ప్రాజెక్టు కింద ఉద్యోగులపై పెండింగులో ఉన్న విచారణలను త్వరగా పూర్తి చేస్తున్నారు. ఇక ఫైటింగ్ ఫిట్ ప్రాజెక్టును 2022 మార్చి 23 నుంచి అమలు చేస్తున్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగుల్లో క్రమశిక్షణను పెంపొందించడానికి రూపొందించిన ప్రాజెక్టులు ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డులను గెలుచుకోవడం ఆనందంగా ఉందని అదనపు డీజీ శంఖబ్రత బాగ్చీ చెప్పారు.

కోలుకుంటున్న గుండె మార్పిడి బాలుడు

వెంటిలేటర్ నుంచి ఐసీయూకి మార్పు

తిరుపతి తుడా: తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు శుక్రవారం గుండె మార్పిడి చేసిన బాలుడు కోలుకుంటున్నాడు. విశాఖపట్నం నుంచి వచ్చిన సన్యాసమ్మ అవయవాలలో గుండెను అన్నమయ్య జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలుడికి అమర్చిన విషయం తెలిసిందే. గుండె మార్పిడి అనంతరం వెంటిలేటర్‌పై ఉన్న ఆ బాలుడిని శనివారం ఉదయం ఐసీయూకి మార్చినట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి తెలిపారు. గుండె పనితీరు సాధారణ స్థితిలో ఉందని, మధ్యాహ్నం 12 గంటల తర్వాత బాలుడితో మాట్లాడినట్లు ఆయన చెప్పారు. ఆ బాలుడి ఆరోగ్యం మెరుగుపడుతోందన్నారు. ఆస్పత్రిలో నిత్యం వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. టీటీడీ సహకారంతో బాలుడి చికిత్సకు అవసరమైన వైద్య సదుపాయాలు, మందులను సమకూర్చినట్లు వివరించారు.

తెలంగాణ

13న తెలంగాణకు మోదీ!



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 13న తెలంగాణకు రానున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులతోపాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతోపాటు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) నుంచి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి కార్యాలయానికి సమాచారం అందినట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్ విస్తరణపై కేసీఆర్ బిజీ



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌ని తెలంగాణ ముఖ్యమంత్రి, ఆ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావు జాతీయస్థాయిలో విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. వివిధ రాష్ట్రాల నేతలతో ప్రగతిభవన్ వేదికగా మంతనాలు జరుపుతున్నారు. పార్టీ విధివిధానాల కోసం 150 మంది నిపుణుల బృందం కసరత్తు చేస్తుండగా, వారితో జరుగుతున్న చర్చల్లో కేసీఆర్ బిజీగా ఉంటున్నారు. ఇప్పటికే పార్టీ అనుబంధ రైతు విభాగం అధ్యక్షుడిగా పంజాబ్‌కు చెందిన గుర్నామ్‌సింగ్, బీఆర్‌ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడిగా మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్‌ను నియమించారు. బీఆర్‌ఎస్‌తో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపుతున్న తమిళనాడు వీసీకే అధ్యక్షుడు, ఎంపీ తిరుమావలవన్ ఇప్పటికే కేసీఆర్‌తో భేటీ అయ్యారు.

ప్రశ్నించే పరిస్థితి లేదు

ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయి



హనుమకొండ: ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన రామప్ప ఆలయ సన్నిధిలో రామప్ప ఉత్సవాల నిర్వహణకు కేంద్రం అనుమతివ్వకపోవడం బాధాకరమని ప్రముఖ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయి అన్నారు. శనివారం హనుమకొండలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు బీవీ పాపారావుతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. శివుడికి ప్రీతిపాత్రమైన అభినయాన్ని శక్తి స్థలమైన రామప్పలో చేయాలని నిర్ణయించుకున్నానని, కానీ దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భావ వైరుధ్యాలను కళలకు ఆపాదించడం సమంజసం కాదన్నారు. రాజకీయంగా అభద్రత ఉన్న వారి కారణంగా దేశంలో ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.

నాగలి పడుతున్న నారీమణులు

దేశంలో పెరుగుతున్న మహిళా రైతులు

వారికి అనువైన వ్యవసాయ యంత్రాలను తయారు చేయాలి



- చిన్న భూకమతాలకు అనువైన యంత్రాలను ప్రోత్సహించాలి
- ప్రస్తుతం పెద్ద భూకమతాలకు అనువైన యంత్రాలే ఉన్నాయి
- దేశంలో గత 15 ఏళ్లలో 14.6 కోట్ల రైతుల్లో ట్రాక్టర్లు కొన్న వారు 90 లక్షలే
- రాష్ట్రంలో 2019–20లో 18,335 ట్రాక్టర్లు కొనుగోలు
- 2021–22లో రాష్ట్రంలో 33,876 ట్రాక్టర్లు కొనుగోలు
- వ్యవసాయ యాంత్రీకరణపై నాబార్డు అధ్యయన నివేదిక

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వ్యవసాయంలో మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) వెల్లడించింది. మహిళా రైతుల సంఖ్య పెరుగుతున్నందున వారికి అనువైన వ్యవసాయ యంత్రాలను తయారు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. 2010–11 గణాంకాల ప్రకారం వ్యవసాయం చేసే మహిళలు దేశంలో 12.79 శాతం ఉండగా 2015–16లో 13.87 శాతానికి పెరిగినట్లు తెలిపింది. ఇదే సమయంలో మహిళా రైతులు వ్యవసాయ చేసే విస్తీర్ణం కూడా 10.36 శాతం నుంచి 11.57 శాతానికి పెరిగింది. అందువల్లమహిళలకు అనుకూలమైన యంత్ర పరికరాలు అందుబాటులోకి రావాల్సి ఉందని దేశంలో వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ యాంత్రీకరణపై నాబార్డు అధ్యయన నివేదికలో తెలిపింది. వ్యవసాయ రంగం అభివృద్ధికి పలు సూచనలు చేసింది.

యాంత్రీకరణను మరింతగా ప్రోత్సహించాలి

ప్రస్తుతం దేశంలో వ్యవసాయ యాంత్రీకరణ ప్రారంభ దశలోనే ఉందని, యాంత్రీకరణను మరింతగా ప్రోత్సహించాల్సి ఉందని స్పష్టంచేసింది. దేశంలో మొత్తం వ్యవసాయ భూకమతాల్లో 85 శాతం చిన్నవేనని, వీటిలో యంత్రాల వాడకం ప్రధాన సవాలుగా ఉందని నివేదిక తెలిపింది. కిరాయి, అద్దె మార్కెట్లు ఉన్నప్పటికీ చిన్న కమతాలకు పరిమితులు, సంక్లిష్టతలున్నాయని తెలిపింది. 2014–15లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ఉపమిషన్ ప్రారంభించినప్పటికీ, చిన్న కమతాలకు ఉపయోగకరంగా లేదని తెలిపింది. వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు పెద్ద కమతాలకు అనువైనవే ఉన్నాయని తెలిపింది. చిన్న భూకమతాలకు అనువైన యంత్రాలను, పనిముట్లను ప్రోత్సహించాలని పేర్కొంది.

యాంత్రీకరణతో రైతులకు లాభం


యాంత్రీకరణతో రైతులకు లాభమని నాబార్డు పేర్కొంది. ట్రాక్టర్లు, సీడ్ డ్రిల్స్, హార్వెస్టర్లు, కంబైన్‌లు వంటి యంత్రాలు కార్మికులకయ్యే ఖర్చును ఆదా చేస్తాయని నివేదిక తెలిపింది. యంత్రాలు, సాంకేతికతతో వ్యవసాయ ఉత్పాదకత సామర్థ్యాన్ని 30 శాతం వరకు పెంచడంతోపాటు సాగు ఖర్చును 20 శాతం మేర తగ్గిస్తుందని, తద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని అధ్యయనంలో వెల్లడైనట్లు స్పష్టం చేసింది. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగంతో కార్మికులు వ్యవసాయేతర రంగాల్లో పనిచేసేందుకు అందుబాటులో ఉంటారని తెలిపింది. కార్మికులకు వ్యవసాయంలోకంటే వ్యవసాయేతర రంగాల్లో ఎక్కువ వేతనాలు లభిస్తాయని వెల్లడించింది.

ట్రాక్టర్ల కొనుగోలులోనూ వెనుకబాటు

దేశంలో 14.6 కోట్ల మంది రైతుల్లో గత 15 సంవత్సరాల్లో ట్రాక్టర్లు కొనగలిగిన వారు అతి తక్కువని పేర్కొంది. 2004–05 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా రైతులు 2.48 లక్షల ట్రాక్టర్లు కొనగా, 2019–20లో 8.80 లక్షల ట్రాక్టర్లు కొన్నట్లు తెలిపింది. ట్రాక్టర్ల కొనుగోలులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలున్నాయని చెప్పింది. 2019–20లో ఆంధ్రప్రదేశ్‌లో 18,335 ట్రాక్టర్ల కొనుగోళ్లు జరగ్గా 2021–22లో 33,876 ట్రాక్టర్లు కొన్నట్లు తెలిపింది. 2021–22లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 1,17,563, మహారాష్ట్ర 1,04,301, మధ్యప్రదేశ్‌లో 1,00,551 ట్రాక్టర్లు కొన్నట్లు పేర్కొంది.

నాబార్డు సిఫార్సులు మరికొన్ని..

- రైతుల సముదాయంతో రైతుల ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసి వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను ఉపయోగించుకొనేలా చేయాలి
- చిన్న, సన్నకారు రైతులకు రుణ పరిమితులను సడలించాలి
- అందుబాటులో ఉన్న వ్యవ వినియోగంలో కొండ ప్రాంతాలు చాలా వెనుకబడి ఉన్నాయి. కొండ ప్రాంతాల్లో ఉన్న భూభాగం, స్థలాకృతికి సరిపోవు. కొండ ప్రాంతాలలో వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి ప్రత్యేక పనిముట్లు అవసరం. ఆ భూభాగం, పంట వ్యవస్థలకు సరిపోయే విధంగా పనిముట్లు రూపొందించాలి.
- ప్రస్తుతం ఉన్న యంత్రాలు, పనిముట్లు స్త్రీలకు అనుకూలమైనవి కావు. వ్యవసాయంలో మహిళల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో స్త్రీలకు అనుకూలమైన కొత్త యంత్రాలు, పనిముట్లను అందుబాటులోకి తేవాలి.



డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా ఏపీ

బీపీఎంలకు రాష్ట్ర ప్రభుత్వ మద్దతు అద్భుతం

- ఇన్ఫినిటీ వైజాగ్–2023 ముగింపు సదస్సులో ఐటీ ప్రతినిధులు
- బీచ్ ఐటీ డెస్టినేషన్‌గా వైజాగ్ అభివృద్ధి
- త్వరలో విప్రో, ఐబీఎం కూడా రాబోతున్నాయి
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం : ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు స్వర్గధామంగా ఉన్న విశాఖపట్నంలో పెట్టుబడుల కోసం వివిధ సంస్థల్ని ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్–2023 విజయవంతంగా ముగిసింది. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో భవిష్యత్ ఐటీ రంగం మొత్తం ద్వితీయ శ్రేణి నగరాల జాబితాలో మొదటి వరుసలో ఉన్న విశాఖపట్నానిదేనని ప్రముఖ ఐటీ రంగ నిపుణులు స్పష్టం చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భవిష్యత్ డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా రూపాంతరం చెందనుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 9వ ధనిక నగరంగా ఉన్న వైజాగ్.. రాబోయే రెండునెలల్లో క్యాపిటల్ సిటీగా మారబోతోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. ఈ సదస్సుకు 40 ఐటీ సంస్థలకు చెందిన సీఈఓలు, 500కి పైగా ఐటీ నిపుణులు హాజరయ్యారని ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు వెల్లడించారు. నిపుణుల సూచనలతో భవిష్యత్‌లో ఐటీ అభివృద్ధికి కావల్సిన రోడ్‌మ్యాప్‌ని సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని శ్రీధర్ తెలిపారు. సదస్సులో ఎవరెవరు ఏమన్నారంటే..



రెండో రోజు సదస్సును ప్రారంభిస్తున్న ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

బీపీఎంలకు ఏపీ ప్రభుత్వ మద్దతు అద్భుతం



బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సంస్థలకు అంతర్జాతీయ చిరునామాగా దేశం వ్యవహరిస్తుంటే.. ఏపీ కూడా అదే బాటలో పయనిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్.. ఇలా విభిన్న రంగాల్లో ముందుకెళ్తున్నాం. వైజాగ్‌లో క్లౌడ్, డేటా ఎనలటిక్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ మొదలైన రంగాల మానవ వనరులకు కొదవలేదు. ఐటీ, బీపీఎంలకు ఏపీ ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తుండటంతో.. వీటికి డెస్టినేషన్‌గా విశాఖ మారుతోంది.

– కేశవ్ ఆర్ మురుగేశ్, డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ గ్రూప్ సీఈఓ

ఐటీ, ప్రభుత్వానికి అనుసంధానంగా ఎపిటా



ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు కావల్సిన పూర్తి సౌకర్యాలు, వసతులు, ఎకో ఫ్రెండ్లీ వాతావరణం విశాఖలో ఉన్నాయి. విశాఖ, తిరుపతి, అనంతపురంలో ఐటీ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన సంస్థలు ఎపిటాలో రిజిస్టర్ చేసుకుంటే అవసరమైనవన్నీ సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ మూడు నగరాల్లో కాన్సెప్ట్ సిటీలను సిద్ధంచేస్తున్నాం.

– కిరణ్‌రెడ్డి, ఎపిటా గ్రూప్ సీఈవో

ఔత్సాహికులు ముందుకు రావాలి



ఇప్పటికే పలు కీలక సంస్థలు విశాఖలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. స్టార్టప్‌లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విదేశాల్లో ఐటీ సంస్థలు నడుపుతున్న నిపుణులు రాష్ట్రాభివృద్ధికి ముందుకు రావాలి. కోవిడ్ కారణంగా విదేశీ పెట్టుబడులు రావడంలో కాస్త జాప్యం జరిగింది. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయి. ప్రపంచంలో మాంద్యం తలెత్తుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు ఏపీ, భారత్ వైపు చూస్తున్నారు.

– వెంకట్ మేడపాటి, రాష్ట్ర ఎన్ఆర్‌టీ ఎఫైర్స్ సలహాదారు

ఏఐకు అపార అవకాశాలు



కృత్రిమ మేధ భవిష్యత్తుని శాసించనుంది. జీవితంలో ఏఐ ఒక భాగంగా మారనుంది. సాంకేతిక వ్యవస్థలఅభివృద్ధికి, మెరుగుపర్చడానికి ఏఐని రూపొందించగల నిపుణులు ఎంతో అవసరం. ఏఐ ప్రాజెక్టుల పరంగా భారత్ నంబర్‌వన్‌గా అవతరించబోతోంది.

– సంధ్య గుండిరెడ్డి, మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపల్ గ్రూప్ ప్రోగ్రామ్ మేనేజర్

మార్చి మొదటి వారంలో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

ప్రపంచానికి బీచ్ ఐటీ డెస్టినేషన్‌గా సీఎం జగన్ విశాఖను ప్రమోట్ చేస్తున్నారు. ఇన్ఫోసిస్, రాన్‌స్టాడ్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. విప్రో, ఐబీఎం కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. మార్చి మొదటి వారంలో విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. విశాఖలో పెట్టుబడులకు ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్ ఉపయోగపడింది. వైజాగ్ ఆసియాలోనే డిజిటల్ ఇన్స్పిరేషన్ సెంటర్ అవుతుంది.

– రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

జీతాలపై ఎందుకీ దుర్మార్గపు రాతలు?

▶ మొదటి పేజీ తరువాయి

అమల్లోకి వచ్చిందని... 1990 నుంచీ చిన్న మార్పు జరిగిందని... కథలు కథలుగా వండి వారిస్తున్న రామోజీరావు... 2014 నుంచీ 2019 మధ్య చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఇలా ఠంచన్‌గా 1వ తేదీన ఇవ్వలేదనే సంగతి ఎందుకు ప్రస్తావించరు? ఈనాడే కాదు... బాబు అధికారంలో ఉండగా ఏనాడూ ప్రశ్నించలేదెందుకు? మరీ ఇంత దుర్మార్గపు రాతలా? గతంలోనూ 1– 20వ తేదీ మధ్యనే కదా.. రెగ్యులర్ ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లింపులు జరిగాయి. ఆ విషయాన్నెందుకు ప్రస్తావించరు రామోజీ?

మరో ప్రధానాంశమేంటంటే చంద్రబాబు నాయుడి హయాంలో కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, రిసోర్స్ పర్సన్లు, ఆశా వర్కర్లకు, మధ్యాహ్న భోజన పథకం ఆయాలకు నెలల తరబడి జీతాలు అందేవి కావు. ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి. 104, 108 వాహనాల ఉద్యోగులదీ అదే పరిస్థితి. ఆరేడు నెలల పాటు వేతనాలు చెల్లించకపోయినా రామోజీరావు ఒక్క అక్షరం ముక్క కూడా రాయలేదు. వారికి మద్దతు పలకనే లేదు. కానీ ఇప్పుడు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, హోంగార్డులు, ఆర్పీలు... ఇలా అందరికీ రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఏ నెల వేతనాలు ఆ నెలలోనే చెల్లిస్తున్నారు. అలా చెల్లించడానికి ఒక పెద్ద వ్యవస్థ ఏర్పడింది. ఇదో విప్లవాత్మక మార్పు. కానీ ఈ స్థాయి సానుకూల సంస్కరణను 'ఈనాడు' ఒక్కనాడు కూడా ప్రస్తావించలేదు. బాబు హయాంలో దారుణ పరిస్థితుల్ని... ఈ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న మంచిని... రెండింటినీ ప్రజలకు చెప్పకపోవటమే రామోజీరావు పాలసీ. దానికి తగ్గట్టుగానే ప్రభుత్వ ఉద్యోగులందరికీ 1వ తేదీనే జీతాలు రావటం లేదని రోజూ దారుణమైన అవాస్తవ కథనాలను వండి వారుస్తున్నారు.

మెజారిటీ ఉద్యోగులకు నెల తొలినాళ్లలోనే జీతాలు పడుతున్నా... బిల్లుల సమర్పణలో జాప్యం, ఇతరత్రా కారణాల వల్ల కొద్ది మందికి మాత్రం 20వ తేదీ వరకు సమయం పడుతోంది. 'ఈనాడు' మాత్రం ఈ వాస్తవాలకు మసిపూసి... ఉద్యోగ సంఘాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. చంద్రబాబు హయాంలో ఉద్యోగులకు ఏకంగా 5 డీఏలు బకాయిలు పెట్టినా పట్టించుకోని రామోజీరావు... ఇతర ఎల్లో మీడియా ప్రచురిస్తున్న కథనాలను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ తీవ్రంగా తప్పు పట్టారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం గురించి రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ 'ఈనాడు'తో పాటు కొన్ని పత్రికలు పనికట్టుకొని తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని, వాటిపై పరువు నష్టం దావా వేస్తామని ఆయన హెచ్చరించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించకుండా వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదంటూ రాస్తున్న కథనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులు, ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామంటూ... శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తప్పుడు కథనాలను నమ్మొద్దని, ఉద్యోగుల సంక్షేమమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రకటన ముఖ్యాంశాలివీ...

శాఖ	ఉద్యోగి	గత జీతం	పెరిగిన జీతం	జీవో	ఉద్యోగుల సంఖ్య
మహిళా శిశు సంక్షేమం	అంగన్‌వాడీ వర్కర్స్	10,500	11,500	జీవో ఎంఎస్ నం.13	47,476
	మిని అంగన్‌వాడీ సెంటర్	6,000	7,000	తేదీ 26-06-2019	6,526
	అంగన్‌వాడీ హెల్పర్స్	6,000	7,000		45,175
పంచాయతీరాజ్	విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్/ సంఘమిత్రలు/యానిమేటర్స్	2,000	10,000	జీవో ఆర్‌టీ నం.699 తేదీ 11-11-2019	28,152
పట్టణాభివృద్ధి	శానిటరీ వర్కర్స్(15/08/20202)	8,000	18,000	జీవో ఎంఎస్ నం. 233	
	సూపర్‌వైజర్స్	12,000	18,000	తేదీ 26-08-2019	29,800
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం	ఆశా వర్కర్స్	4,000-	10,000	జీవో ఎంఎస్‌నెం87 (తేదీ 17-08-2019)	41,416
కార్మిక, ఉపాధి కల్పన	ఎంఎన్‌వో	6,700	17,746	జీవో ఎంఎస్ నం. 6	2
	ఏఎన్ఎం	10,200	28,000	తేదీ 26-04-2021	1
	దోభీ	6,700	13,000		2
	క్షురకుడు	6,700	13,000		2
గిరిజన సంక్షేమం	కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్	400	4,000	జీవో ఎంఎస్ నం. 117 తేదీ 03-12-2019	2,652
హోం	హోంగార్డ్స్ డైలీ డ్యూటీ అలవెన్స్	600	710	జీవో ఎంఎస్‌నం. 876 తేదీ 12-10-2019	14,984
పాఠశాల విద్య	వంటవాళ్లు, సహాయకులు	1,000	3,000	జీవో ఎంఎస్‌నం. 61 తేదీ 15-09-2019	84,833
మొత్తం చిరుద్యోగులు					3,01,021

ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా 2019 జూలై 6న జీవో 60 జారీ ద్వారా 27 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసింది. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు గ్రాంట్ ఇన్ ఎయిడెడ్ సంస్థలు, వర్క్ చార్జ్ ఉద్యోగులు, 2015లో సవరించిన వేతనాలు పొందుతున్న పూర్తి స్థాయి కంటింజెంట్ ఉద్యోగులకు మధ్యంతర భృతి వర్తింప చేసింది. పెన్షనర్లకు కూడా జీవో 61 ద్వారా 27 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసింది. మధ్యంతర భృతి ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు 2019 జూలై 1 నుంచి 2021 డిసెంబర్ 31 వరకు రూ.17,918 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఇందులో ఉద్యోగులకు రూ.11,984 కోట్లు కాగా, పెన్షనర్లకు రూ.5,933 కోట్లు.
- ఉద్యోగులకు 11వ వేతన సవరణ సిఫార్సులు అమలు చేయడం ద్వారా ఏడాదికి అదనంగా 11,707 కోట్లు వ్యయం అవుతోంది. ఈ మేరకు ఉద్యోగులు ప్రయోజనం పొందారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగించటంతో ప్రస్తుత ఉద్యోగులందరితో పాటు ప్రభుత్వంలో చేరుతున్న ఉద్యోగులకూ ప్రయోజనం కలుగుతోంది. వయోపరిమితి పెంపుతో 26,878 మంది ఉద్యోగులకు తక్షణ లబ్ధి కలిగింది.
- కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి కనీస వేతన స్కేళ్లను వర్తింప చేస్తూ 2021 జూన్ 18న జీవో 40 జారీ చేసింది. 2015లో సవరించిన పే స్కేళ్ల ప్రకారం మినిమమ్ టైమ్ స్కేలును ప్రభుత్వంలోని కాంట్రాక్టు ఉద్యోగులకు, యూనివర్సిటీలు, సొసైటీలు, కెజీవీబీ మోడల్ స్కూల్స్‌లో పనిచేసే వారికి వర్తింప చేశారు. ప్రభుత్వ శాఖలు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు, కెజీవీబీ, మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వివాహిత మహిళా ఉద్యోగులకు మొదటి రెండు శిశు జననాలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించింది.
- కాంట్రాక్టు ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.ఐదు లక్షలు, సర్వీసులో ఉండగా సహజ మరణం అయితే రూ. రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ చర్యల వల్ల కాంట్రాక్టు ఉద్యోగులు ఏడాదికి రూ.360 కోట్లు అదనపు ప్రయోజనం పొందుతున్నారు. సవరించిన వేతన స్కేళ్ల ప్రకారం 2022 జనవరి 1 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులందరికీ మినిమమ్ టైమ్ స్కేళ్లను వర్తింప చేశారు.
- ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న మంజూరైన పోస్టుల రిక్రూట్‌మెంట్ ప్రక్రియను సమీక్షించడంతో పాటు నోటిఫికేషన్ జారీ చేయడానికి కచ్చితమైన సమయ పాలనను పాటించేలా దశల వారీగా ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంది. అందుకనుగుణంగా 2021–22 లో 10,143 పోస్టుల భర్తీకి వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసింది. 292 గ్రూప్–1, గ్రూప్–2 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ 2022 మార్చి 31నన జీవో 78 జారీ చేసింది. అలాగే వైద్య ఆరోగ్య శాఖలో 47 వేల పోస్టులకు పైగా భర్తీ చేసింది. ఇతర శాఖల్లో 1,958 పోస్టుల భర్తీతో కలిపి మొత్తం 23,485 పోస్టుల భర్తీకి అనుమతించింది.
- ఆర్టీసీకి చెందిన 53,500 మంది ఉద్యోగులను 2020 జనవరి 1న ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసులోకి తీసుకుంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు శాఖలో చేరిన ఆర్టీసీ ఉద్యోగులందరికీ 2020 జనవరి నుంచి ప్రభుత్వమే వేతనాలను చెల్లిస్తోంది. 2020 జనవరి నుంచి డిసెంబర్ 2021 వరకు ఉద్యోగులకు రూ.5,900 కోట్లు చెల్లించింది.
- గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో కొత్తగా 1.28 లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులను నియమించింది. దీనివల్ల ఏడాదికి రూ.2,300 కోట్లు ఆర్థిక భారం పడుతోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పే స్కేళ్లను వర్తింప చేసింది.
- ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్స్‌డ్ సర్వీసెస్‌ను (ఆప్కోస్) ఏర్పాటు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు తావు లేకుండా చేసింది. ఆప్కోస్ పరిధిలోకి 98,016 ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వచ్చారు. వీరందరికి సకాలంలో వేతనాలు చెల్లిస్తున్నారు. ఇందుకు ప్రతి నెలా రూ.150 కోట్లు చెల్లిస్తూ, ఈపీఎఫ్, ఈఎస్ఐలను వర్తింప చేస్తున్నారు.
- ఏపీపీఎస్సీ నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో ప్రతికూల మార్కుల విధానాన్ని ప్రభుత్వం తొలగించింది. కనీస ఉత్తీర్ణత మార్కులను సక్రమంగా పునరుద్ధరించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ పరీక్షల నిబంధనలు–1965లో సవరణలు తీసుకువస్తూ 2020 సెప్టెంబర్ 25న జీవో 101 జారీ చేసింది.
- 1995 నుండి 2011 మధ్య నియమించబడిన వివిధ ఫీడర్ కేటగిరీలకు చెందిన మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల (ఎంపీడీఓలు) సీనియారిటీని ఖరారు చేయడంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కరించింది. డైరెక్ట్ రిక్రూట్ ఎంపీడీఓల కోసం 5:3:3 నిష్పత్తిలో ఎంపీడీఓలకు ప్రమోషన్ ఛానెల్ ఖరారు చేసింది.
- గ్రామ రెవెన్యూ ఆఫీసర్లకు సూపర్ సెషన్‌లో సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులకు మార్గం సుగమం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీఆర్ఏ కేడర్ నుంచి 3,795 గ్రామ రెవెన్యూ ఆఫీసర్ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్లకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.
- హైదరాబాద్ నుంచి వచ్చిన ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాలు కొనసాగిస్తోంది.
- 12 సంవత్సరాల అనంతరం తొలిసారిగా రాష్ట్ర స్థాయిలో ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఉద్యోగ సంఘాల అసోసియేషన్లతో చర్చల ద్వారా వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంది.
- వివిధ శాఖల్లోని 3,01,021 మంది చిరు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచింది. ఈ వేతనాల పెంపు వల్ల రూ.1,196 కోట్ల నుంచి రూ.3,187 కోట్లకు వేతనాలు చేరాయి. వివిధ శాఖల్లోని ఉద్యోగుల జీతాలు ఈ విధంగా పెరిగాయి.

24లోగా బిల్లులు పూర్తి చేయాలని చెప్పాం

- రాష్ట్ర విభజన సందర్భంగా ఆర్థిక వనరుల పంపిణీ అశాస్త్రీయంగా ఉండటంతో పాటు కోవిడ్ సంక్షోభం కారణంగా ఆర్థికంగా తీవ్ర ప్రభావం పడినప్పటికీ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లను ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తోంది. ఇందుకోసం అనేక చర్యలు తీసుకుంది.
- సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లించడానికి పెన్షన్ బిల్లులను 16వ తేదీ నుంచి ప్రారంభించి 24వ తేదీలోగా పూర్తి చేయాలని డీడీవోలకు ఆదేశాలు జారీ చేసింది. పెన్షన్లు, జీతాల చెల్లింపును నెల తొలి పని దినం నుంచి ప్రారంభించి.. నెలాఖరులోగా ఆడిట్ పూర్తి చేయాలని ట్రెజరీలకు ఆదేశాలిచ్చింది.
- రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లకు సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లిస్తూనే మరో పక్క ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం కుక్ కమ్ హెల్పర్లు, హోంగార్డులు, వీఏవోలు, ఆర్పీలు, గిరిజన సంఘం కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగులకు నెలలో 21లోగా జీతాలందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది.
- గతంలో ఈ కేటగిరి ఉద్యోగుల్లో కొంత మందికి నెలల తరబడి జీతాలందేవి కావు. ఈ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపునకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేకంగా ఆప్కోస్ పేరుతో కార్పొరేషన్‌ను సైతం ఏర్పాటు చేసింది.

క్లుప్తంగా...

బాబు హయాం.. తాత్కాలికాల మయం

846వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో తాత్కాలిక భవనాల పేరుతో చంద్రబాబు ప్రజాధనం దుబారా చేశారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 846వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో శాశ్వత సచివాలయ భవనానికి రూ.617 కోట్లు ఖర్చయితే.. అమరావతిలో తాత్కాలిక భవనాలకు రూ.9,700 కోట్లు ఖర్చు చేయడం విడ్డూరం కాదా... అని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు, దొడ్డిదారిలో కమీషన్ల కోసమే చంద్రబాబు 'తాత్కాలికం' పేరుతో నిలువు దోపిడీ చేశాడనేది బహిరంగ సత్యమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని పదవులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేస్తూ అటు రాజకీయంగా, ఇటు సామాజికంగా ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలవలేని లోకేశ్ పాదయాత్ర పేరుతో బయలుదేరడం ఎవరిని ఉద్ధరించేందుకో చెప్పాలని ప్రశ్నించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

24న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 24వ తేదీన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తారు. గత సమావేశాలకు భిన్నంగా పూర్తి కొత్తదనంతో ఈసారి నిర్వహించనున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి వచ్చే నాయకులకు పార్టీ ముందుగానే గూగుల్ లింక్ పంపిస్తుంది. ఈ లింకు ద్వారా సేకరించే వివరాల ప్రకారం.. ఆ నాయకుడికి నరసాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఒక శక్తి కేంద్రం బాధ్యతను పార్టీ అప్పజెబుతుంది. శక్తి కేంద్రం పరిధిలోని ఓ పార్టీ కార్యకర్తను ఆ నాయకుడికి అనుసంధానం చేస్తారు. ఈ నెల 23వ తేదీనే ఆ నాయకుడికి కేటాయించిన శక్తి కేంద్రానికి చేరుకుని ఆ కార్యకర్త ఇంట బస చేసి, శక్తి కేంద్ర స్థాయి సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఆ సమావేశం వివరాలను నివేదిక రూపంలో పార్టీకి తెలియజేయాల్సి ఉంది. కాగా, తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అభివృద్ధికి 'బ్రహ్మశ్రీ' చాగంటి కోటేశ్వరరావు సేవలు, సలహాలు ఉపయుక్తమవుతాయని తాను విశ్వసిస్తున్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ట్విట్టర్ ద్వారా స్పందించారు.

జగన్, చంద్రబాబుల్లో ఎవరికి ఓటేసినా బీజేపీకి వేసినట్లే

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబులలో ఎవరికి ఓటేసినా బీజేపీకి వేసినట్లేనని, ఆ రెండు పార్టీలు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాతో పాటు పలు హక్కులను సాధించడంలో విఫలమయ్యాయని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. ఆయన శనివారం కర్నూలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తున్నారని, బీజేపీ అధికారంలోకి వచ్చాక అప్పుల్లో ఉన్న అదానీ, అంబానీలు ప్రపంచంలోనే కుబేరులుగా అవతరించారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ స్ఫూర్తితో జనవరి 26 నుంచి మార్చి 26వ తేదీ వరకు రెండు నెలలపాటు మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో పాదయాత్రలు చేపడతామన్నారు. ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ ఇన్‌చార్జి మయప్పన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి భూమి కేటాయింపుపై పిల్

రేపు విచారించనున్న సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా రాజుపాలెం గ్రామ పరిధిలోని 1.75 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన వైఎస్సార్‌సీపీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో జారీ చేసిన జీవో నంబర్ 759పై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. జీవో నంబర్ 759ని రద్దు చేయాలని కోరుతూ కొత్తూరు నర్సింగరావుపేట మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, మరో ముగ్గురు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్, జిల్లా కలెక్టర్, తహసీల్దార్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది.

కొల్లేరు.. జీవవైవిధ్య జలతారు

అరుదైన చేపలకు జన్మస్థలం... వలస పక్షులకు ఆవాసం... మూడున్నర లక్షల మందికి నివాసం... పెద్దింట్లమ్మ కొలువు దీరిన పుణ్యక్షేత్రం... మన కొల్లేరు. 901 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి దేశంలోనే అత్యంత పెద్ద మంచినీటి సరస్సుగా... జీవవైవిధ్యానికి జలతారుగా కొల్లేరు ప్రత్యేకతను సంతరించుకుంది. ఉప్పునీటిని, మురుగునీటిని తనలో ఇముడ్చుకుని... తనను నమ్మి వచ్చిన పక్షులు, మనుషులు... ఒకటేమిటి సకలజీవరాశులను అక్కున చేర్చుకుని స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం అందిస్తోంది. **– సాక్షి, అమరావతి**



కొల్లేరులో వలస పక్షులు

ఘన చరిత్రకు ఆనవాళ్లు..

మూడో శతాబ్దం నుంచి ఈ సరస్సు పురాతన గ్రంథాల్లో ఉంది. కొల్లేరుపై పట్టు కోసం పూర్వం రాజుల మధ్య యుద్ధాలు జరిగినట్లు చరిత్ర చెబుతోంది. చైనా యాత్రికుడు హ్యూయాన్‌త్సాంగ్.. వెంగి నగరంతోపాటు కొల్లేరును దర్శించినట్టు పలు గ్రంథాల ద్వారా తెలుస్తోంది. ఇక కొల్లేరును నూజివీడు జమీందార్లు తమకు విశ్వాసంగా ఉండే 'కామదాన' కుటుంబానికి దానం ఇచ్చినట్టు చెబుతారు.

సరస్సులో ఊళ్లు ఎలా వెలిశాయంటే..

వరుస యుద్ధాల కారణంగా 17వ శతాబ్దంలో ఒడిశాలో తీవ్ర కరువు ఏర్పడింది. దీంతో అక్కడి వడ్డెర కులాలకు చెందిన పలు కుటుంబాలు జీవనాధారం వెదుక్కుంటూ వలస వెళ్లాయి. ఆ క్రమంలో సుమారు 10 కుటుంబాలు కొల్లేరు ప్రాంతానికి వచ్చాయి. సరస్సు మధ్యలో మట్టి దిబ్బలపై గుడిసెలు వేసుకుని చేపలను వేటాడి తింటూ జీవనం గడిపేవారు. ఆ తర్వాత పచ్చి, ఎండు చేపల విక్రయం ద్వారా జీవనోపాధి పొందారు. క్రమంగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. పక్క గ్రామాల దురాక్రమణ నుంచి తమను కాపాడుకోవడానికి పలు సందర్భాల్లో కత్తులు, బరిసెలతో గ్రామాల మధ్య హోరాహోరీ యుద్ధాలు జరిగేవి. సుమారు 30 ఏళ్ల క్రితం ప్రత్తికోళ్లలంక, పందిరిపల్లిగూడెం గ్రామాల మధ్య సరిహద్దు విషయమై రెండు పర్యాయాలు జరిగిన పోరులో సుమారు 15 మందికి పైగా మృత్యువాత పడ్డారు. ఇటువంటి కొట్లాటలు ఎన్నో కొల్లేరులో జరిగాయి. తొలినాళ్లలో రవాణాకు తాటిదోనెలను వాడేవారు. ఆతర్వాత నాటు పడవలు, లాంచీలు వినియోగించేవారు. ఇప్పుడు రోడ్లు అభివృద్ధి చెందడంతో వాహనాలు ఉపయోగిస్తున్నారు. కొల్లేరుపై ఆధారపడి జీవించే ప్రజలు చేపలనువేటాడి విక్రయిస్తుంటారు.

పర్యాటకంతో కొత్త అందాలు

కొల్లేరును పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కొల్లేరులో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయం, రోడ్లు, వంతెనల అభివృద్ధి, ఆటపాక పక్షుల కేంద్రాన్ని తీర్చిదిద్దడం, ఉప్పుటేరుపై అక్విడక్ట్‌ల నిర్మాణం వంటి అనేక పనులు వేగంగా జరుగుతున్నాయి. కొల్లేరులో అతిథి గృహాలు, రిసార్టులు, బోట్ షికారు వంటివి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది.

కొల్లేరు విస్తరణ ఇలా..

- ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో ఉన్న తొమ్మిది మండలాల్లో 77,138 ఎకరాల్లో విస్తరించింది.
- సుమారు 901 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన కొల్లేరు ప్రాంతంలో 122 గ్రామాలున్నాయి. వాటిలో సుమారు మూడున్నర లక్షల మంది జీవిస్తున్నారు.
- అతిపెద్ద మంచినీటి (చిత్తడి నేలల) సరస్సుగా 1971లో ఇరాన్‌లోని రాంసార్ సదస్సు తీర్మానించింది.
- 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు ఈ సరస్సులోకి చేరుతుంది.
- ఉప్పుటేరు ద్వారా కొల్లేటి నీరు సముద్రంలో కలుస్తుంది.



కొల్లేటి లంకల్లోకి వెళుతున్న స్థానికులు



వలస పక్షులకు పుట్టిల్లు..

- సైబీరియా, ఆస్ట్రేలియా, నైజీరియా వంటి అనేక దేశాల నుంచి ఏటా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో వలస పక్షులు ఇక్కడికి వచ్చి సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయి.
- గతంలో వలస పక్షులకు తోడు స్థానిక పక్షులన్నీ కలిపి 189 రకాలు కొల్లేరుపై ఆధారపడి జీవించేవి. ఇప్పుడు సుమారు 73 రకాల పక్షులున్నట్టు లెక్కతేల్చారు.
- కైకలూరు సమీపంలోని ఆటపాక పక్షుల విహార కేంద్రం వద్ద శీతాకాలంలో పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ వంటి విదేశీ పక్షులు సందడి చేస్తుంటాయి.
- కొల్లేరులో దాదాపు 140 రకాల చేప జాతులు ఉన్నట్టు అంచనా.
- అరుదైన నల్ల జాతి చేపలు ఇక్కడే పురుడుపోసుకున్నాయి.
- మార్పు, కొరమీను, ఇంగిలాయి, జల్ల, బొమ్మిడాయి, గొరక, వాలుగ, ఇసుక దొందులు వంటి చేపలు ఇక్కడ పుట్టినవే.

పట్టణాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళిక

రూ.3151.48 కోట్లతో పనులు ఖరారు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, మురుగు శుద్ధితోపాటు స్థానిక చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి విడతగా రూ.3,151.48 కోట్లు ఖర్చు చేయనున్నాయి. అమృత్ 2.0 ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన 500 పట్టణాల్లో ఈ పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 106 యూఎల్బీల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు కుళాయిల ఏర్పాటుతో పాటు మురుగు పారుదల, సెప్టేజీ వ్యవస్థ నిర్మాణం, పార్కులు, పచ్చదనం, చెరువులు, నీటి కుంటల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈమేరకు ప్రభుత్వం పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. చేపట్టాల్సిన పనులకు యూఎల్బీల వాటాగా 20 శాతంతో పాటు, 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొదటి విడత పనుల్లో 239 ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఇందులో అధిక భాగం ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకే ఎక్కువ మొత్తం కేటాయించారు. ఇందులో మొత్తం 92 తాగునీటి ప్రాజెక్టులు, 46 సీవేజ్, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు, 101 నీటి ట్యాంకులు, చెరువుల పునరుజ్జీవన ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం రూ.1,065.59 కోట్లు ఇవ్వనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,189.80 లక్షలు, యూఎల్బీలు తమ వాటాగా రూ.694.74 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.200.33 కోట్లు ఖర్చు చేయనున్నారు. అమృత్ 2.0లో చేపట్టే పనుల కోసం నిధులను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డిపాజిట్ చేసి, పనులు చేపట్టే ఏజెన్సీలకు కేటాయించనున్నారు. అందుకు అవసరమైన వివరాలు పంపాలని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సీడీఎంఏ, ఏపీ టిడ్కో, పబ్లిక్ హెల్త్, గ్రీనింగ్ కార్పొరేషన్లను ఆదేశించారు.

14,000+ పోస్టులు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి స్థాయి ఆఫ్‌లైన్ (ఓఎమ్మార్ షీట్–పేపర్, పెన్ను) విధానంలో నిర్వహించగా.. ఈ విడతలో మాత్రం ఆన్‌లైన్ విధానంలో నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది.

మూడో విడతలో పలు మార్పులు

- గ్రామ, వార్డు సచివాలయాల్లో మొత్తం 20 రకాల కేటగిరీ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఎనర్జీ అసిస్టెంట్ల కేటగిరీ ఉద్యోగాలు మినహా మిగిలిన 19 కేటగిరీ ఉద్యోగాల భర్తీ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగే రాత పరీక్షల ద్వారా భర్తీ చేస్తున్నారు.
- తొలి, రెండో విడతల నోటిఫికేషన్ల సమయంలో ఈ 19 కేటగిరీ ఉద్యోగాల భర్తీకి 14 రకాల రాత పరీక్షల ద్వారా నియామక ప్రక్రియ కొనసాగింది. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు ఉద్యోగాలకు కలిపి ఉమ్మడిగా ఒకే రాత పరీక్ష నిర్వహించారు. గ్రేడ్ – 2 వీఆర్వో, విలేజ్ సర్వేయర్ ఉద్యోగాలకు ఉమ్మడిగా మరో రాత పరీక్ష నిర్వహించారు. మిగిలిన 12 కేటగిరీ ఉద్యోగాలకు వేర్వేరుగా 12 రకాల రాత పరీక్షలు నిర్వహించారు.
- ప్రస్తుతం మూడో విడతలో 19 కేటగిరీ ఉద్యోగాలకు వేర్వేరుగా 19 రకాల పరీక్షల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రేడ్– 5 పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు, గ్రేడ్ – 2 వీఆర్వో, విలేజ్ సర్వేయర్ ఉద్యోగాలకు కూడా వేర్వేరుగా పరీక్షలు జరిగే అవకాశం ఉంది. భవిష్యత్‌లో.. ఆయా కేటగిరీ ఉద్యోగాల్లో తక్కువ సంఖ్యలో ఖాళీలు ఏర్పడినప్పుడు కూడా.. మరో కేటగిరీ ఉద్యోగ ఖాళీల గురించి వాటి భర్తీని ఆలస్యం చేసే అవకాశం లేకుండా ఒక్కొక్క దానికి వేరుగా పరీక్షల నిర్వహణ మంచిదని అధికారులు ఈ దిశగా నిర్ణయం తీసుకుంటున్నారు.

8 లక్షల దరఖాస్తులు అంచనా..

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019లో రికార్డు స్థాయిలో 1.34 లక్షల కొత్త శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఒకేసారి మంజూరు చేసిన అనంతరం మొదటిసారి ఆ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు.. అప్పట్లో రికార్డు స్థాయిలో 21.69 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో జరిగిన రాత పరీక్షలకు 19 లక్షల మందికి పైగా హాజరయ్యారు.
- మొదటి విడత నోటిఫికేషన్‌లో గ్రేడ్– 5 పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు ఉద్యోగాలకు కలిపి ఉమ్మడిగా నిర్వహించిన రాత పరీక్షలకు ఏకంగా 12.54 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.
- 2020 రెండో విడత జారీ చేసిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ నోటిఫికేషన్‌కు కూడా దాదాపు 9 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, అప్పట్లో నిర్వహించిన పరీక్షలకు 7.69 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.
- ప్రస్తుతం మూడో విడత జారీ చేసే నోటిఫికేషన్‌కు సంబంధించి దాదాపు 8 లక్షల మందికి పైగా నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.
- మూడో విడత ఆన్‌లైన్ విధానంలో రాత పరీక్షలు నిర్వహించినా, ఒక్కో విడతకు 40 వేల మంది దాకా పరీక్షలు రాసే వసతులు రాష్ట్రంలో ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే కొన్ని కేటగిరి ఉద్యోగాలకు ఒకే రోజు ఉదయం, సాయంత్రం వేర్వేరు పరీక్షలు జరపడం ద్వారా 20 రోజుల్లో పరీక్షల ప్రక్రియను పూర్తి చేయవచ్చని భావిస్తున్నారు. మొదటి విడత నోటిఫికేషన్ సమయంలో తొమ్మిది రోజులు, రెండో విడత ఏడు రోజుల పాటు రాత పరీక్షలు నిర్వహించామని అధికారులు చెప్పారు.

ఈనామ్ బిడ్డింగ్‌లో మనదే రికార్డ్

- దేశంలో తొలి రెండుస్థానాల్లో ఆదోని, కర్నూలు మార్కెట్ యార్డులు
- ఆదోనిలో కోటి, కర్నూలులో 45.63 లక్షల బిడ్డింగ్‌లు



ఆదోని ఏఎంసీలో విక్రయించేందుకు రైతులు తీసుకొచ్చిన పత్తి

సాక్షి, అమరావతి: ఎల్రక్టానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈనామ్) బిడ్డింగ్‌లలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతుంది. రికార్డుస్థాయిలో వ్యాపార లావాదేవీలు నిర్వహించడమే కాదు బిడ్డింగ్‌ల్లో కూడా రికార్డులు తిరగరాస్తోంది. కోటి బిడ్డింగ్‌లతో ఆదోని మార్కెట్ యార్డు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 45.63 లక్షల బిడ్స్‌తో కర్నూలు యార్డు రెండోస్థానంలో ఉంది. 2017–18లో ప్రారంభమైన ఈనామ్ దేశవ్యాప్తంగా వెయ్యికిపైగా మండీ (మార్కెట్ యార్డు)ల్లో అమలవుతోంది. మన రాష్ట్రంలో 33 యార్డులు ఈనామ్ పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలో 14.49 లక్షలమంది రైతులు, 3,532 మంది వ్యాపారులు, 2,302 మంది ఏజెంట్లు ఈనామ్‌లో రిజిస్టరయ్యారు. 203 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా ఈనామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఇప్పటివరకు రాష్ట్ర పరిధిలో రూ.35 వేలకోట్ల విలువైన 58.74 లక్షల టన్నుల క్రయవిక్రయాలు ఈనామ్ ద్వారా జరిగాయి. ప్రధానంగా మిరప, పత్తి, పసుపు, నిమ్మ, టమాటా, బెల్లం, ఆముదం, ఉల్లి, వివిధరకాల పండ్లు, కూరగాయలను జాతీయస్థాయిలో రైతులు అమ్ముకుంటున్నారు. నాణ్యత పరీక్ష యంత్రాల ద్వారా ర్యాండమ్‌గా లాట్స్ నాణ్యతను పరీక్షించి ఆన్‌లైన్‌లోనే పరిమాణంతో సహా ప్రదర్శిస్తారు. విక్రయించిన రైతుల ఖాతాల్లో సొమ్ము నేరుగా జమ అవుతోంది.

ఆదోని యార్డు పరిధిలో ఇప్పటివరకు రూ.3,607.28 కోట్ల క్రయవిక్రయాలు

ఆదోని యార్డు పరిధిలో మూడులక్షల మంది రైతులు, 503 మంది వ్యాపారులు, 429 మంది కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. ఇక్కడ ప్రధానంగా పత్తి, వేరుశనగ, ఆముదం, పూలవిత్తనాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఆదోని పరిధిలో 50కి పైగా స్పిన్నింగ్ మిల్స్ ఉండడంతో వ్యాపారులు ఆదోని మార్కెట్ యార్డులో ఈనామ్ టెండర్‌లో పాల్గొని పత్తికి పోటీపడి బిడ్డింగ్‌లు నమోదు చేస్తుంటారు. ఈనామ్ ప్రారంభించినప్పటి నుంచి నేటివరకు రాష్ట్రంలో ఈనామ్ పరిధిలో ఉన్న 33 మార్కెట్ యార్డుల్లో 64.29 లక్షల లాట్స్ మార్కెట్‌కు వచ్చాయి. వీటిలో ఒక్క ఆదోనిలోనే 11.34 లక్షల లాట్స్ ఉన్నాయి. ఈ సరుకు కోసం 300 మంది వ్యాపారులు పోటీపడగా, కోటి బిడ్డింగ్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా 2020–21లో 2.26 లక్షల లాట్స్ కోసం 18.39 లక్షల బిడ్డింగ్స్ నమోదయ్యాయి. యార్డు పరిధిలో ఇప్పటివరకు రూ.3,607.28 కోట్ల విలువైన 6.97లక్షల టన్నుల వ్యవసాయోత్పత్తుల క్రయవిక్రయాలు జరిగాయి. రెండో స్థానంలో నిలిచిన కర్నూలు ఏఎంసీలో ఇప్పటివరకు 45.63 లక్షల బిడ్స్ నమోదయ్యాయి. ఈ యార్డు పరిధిలో రూ.1,536 కోట్ల విలువైన 3.89 లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగాయి. దేశంలో మూడోస్థానంలో నిలిచిన రాజస్థాన్‌లోని కోట మండీలో 36 లక్షల బిడ్స్ నమోదయ్యాయి.


అరుదైన రికార్డు

కోటి బిడ్డింగ్‌లను అధిగమించడం అరుదైన రికార్డు. అనతికాలంలోనే ఈ ఫీట్‌ను సాధించిన తొలి యార్డుగా నిలవడం చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో యార్డు పరిధిలో కల్పించిన మౌలిక వసతుల వలన పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతోంది. రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో పాటు వ్యాపారులకు నాణ్యమైన సరుకు లభిస్తోంది.

– బి.శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి, ఆదోని మార్కెట్ యార్డు

ఇంజనీరింగ్‌లో సగం సీట్లు ఖాళీ

దేశవ్యాప్తంగా ఏటా భారీగా మిగిలిపోతున్న సీట్లు



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, సాంకేతిక వృత్తి విద్యా కోర్సుల్లో సగం సీట్లు భర్తీ కావడంలేదు. గత పదేళ్లుగా కన్వీనర్ కోటాతోపాటు మేనేజ్‌మెంట్ కోటాలోనూ సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి. కొన్ని ప్రముఖ కాలేజీల్లో మినహా చాలా కాలేజీల్లో సగానికి పైగా సీట్లు మిగిలిపోతున్నట్టు ఏఐసీటీఈ గణాంకాలు చెబుతున్నాయి. ఏఐసీటీఈ ఏటా ప్రకటించే గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా గత పదేళ్లలో 40 నుంచి 48 శాతం వరకు సీట్లు మిగిలిపోతున్నాయి. 2013–14లో 39 శాతం సీట్లు మిగిలిపోగా, 2016–18 నాటికి 48 శాతానికి పెరిగింది. ఆ తరువాత రెండేళ్లు ఇదే పరిస్థితి. కరోనా తరువాత చేరికలు కొంతమేర పెరగడంతో మిగులు సీట్లు 42 శాతానికి చేరాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే గత మూడేళ్లుగా 80 శాతానికి పైగా సీట్లు భర్తీ అవుతున్నాయి. 2022–23 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ కన్వీనర్ కోటాలో 85 శాతం సీట్లు భర్తీ అవడం విశేషం.

ఇన్‌టేక్ తగ్గినా చేరికలు మాత్రం అంతే

వాస్తవానికి దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం సీట్ల సంఖ్య గత పదేళ్లలో భారీగా తగ్గింది. పదేళ్లక్రితం 30 లక్షల నుంచి 31 లక్షల వరకు సీట్లు ఉండగా ఇప్పుడది 23 లక్షలకు తగ్గింది. సీట్ల సంఖ్య తగ్గినా చేరికల్లో మాత్రం మార్పు లేదు. గతంలో పలు విద్యా సంస్థలు సదుపాయాలు లేకున్నా కోర్సులకు అనుమతులు తెచ్చుకొనేవి. వీటి వల్ల సాంకేతిక విద్య నాసిరకంగా మారుతుండడంతో సదుపాయాలున్న వాటికే ఏఐసీటీఈ అనుమతులిస్తోంది. ప్రమాణాల మేరకు సదుపాయాలు లేకున్నా, చేరికలు వరుసగా మూడేళ్ల 25 శాతానికి లోపు ఉన్నా వాటికి అనుమతులను రద్దు చేస్తోంది. దీంతో పలు కాలేజీలు మూతపడ్డాయి.

కంప్యూటర్ సైన్సు సీట్లకే డిమాండ్

విద్యార్థులు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న కంప్యూటర్ సైన్సు, తత్సంబంధిత కోర్సులవైపు దృష్టి సారిస్తున్నారు. దానికోసం కాలేజీలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా వెనక్కు తగ్గడం లేదు. ఇతర కోర్సుల్లో చేరికలు అంతంతమాత్రమే. ఒకప్పుడు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ) కోర్సుకే పరిమితమైన ఈ డిమాండ్ ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), బ్లాక్ చైన్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, 3డీ ప్రింటింగ్ అండ్ డిజైన్, వర్చువల్ రియాలిటీ, ఆగ్యుమెంటెడ్ రియాలిటీ (ఏఆర్), బిగ్ డేటా వంటి అంశాలలో నేరుగా లేదా కాంబినేషన్లో వివిధ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. అయితే వీటి బోధనకు అవసరమైన సదుపాయాలను కొన్ని ప్రముఖ కాలేజీలు మాత్రమే కల్పిస్తున్నాయి. మిగతా కళాశాలలు సంప్రదాయ కోర్సులతోనే నెట్టుకొస్తున్నాయి. సంప్రదాయ కోర్ గ్రూప్ కోర్సుల వైపు విద్యార్థులను మళ్లించడానికి ఇతర అంశాలను వీటికి మైనర్ కోర్సులుగా జతచేయాలని ఏఐసీటీఈ ఆలోచిస్తోంది. ఈ కోర్సుల్లోని నూతన అంశాలపై అధ్యాపకులకు శిక్షణ కూడా ఇస్తోంది. లెక్చరర్ల కోసం ఇంటర్న్‌షిప్ కోర్సులు కూడా నిర్వహిస్తోంది.

రాష్ట్రంలో నాలుగేళ్లలో సీట్ల భర్తీ ఇలా.. (ఎంపీసీ స్ట్రీమ్)

సంవత్సరం	కన్వీనర్	బీ కేటగిరీ	స్పాట్	మొత్తం
2022-23	95,968	2,210	23,658	1,21,836
2021-22	86,669	3,237	22,622	1,12,528
2020-21	79,503	1,451	22,233	1,03,187
2019-20	65,279	1,485	25,630	92,394

దేశంలో ఇంజనీరింగ్, సాంకేతిక వృత్తి విద్యా కోర్సుల సీట్ల భర్తీ ఇలా

సంవత్సరం	మొత్తం సీట్లు	చేరికలు	మిగులు	మిగులు శాతం
2013-14	29,52,280	18,00,284	11,51,996	39
2014-15	31,83,015	17,39,782	14,43,233	45
2015-16	30,94,566	16,78,955	14,15,611	46
2016-17	29,99,534	15,61,182	14,38,352	48
2017-18	28,70,688	14,87,127	13,83,561	48
2018-19	27,11,878	14,16,965	12,94,913	48
2019-20	25,41,512	14,11,244	11,30,268	44
2020-21	24,42,638	12,94,182	11,48,456	47
2021-22	23,67,270	13,69,706	9,97,564	42

రాష్ట్రంలో చేరికలు 80 శాతం పైనే

దేశంలోని పరిస్థితులకు భిన్నంగా రాష్ట్రంలో చేరికలు 80 శాతానికి పైగా ఉండటం విశేషం. గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలతో చేరికలు భారీగా పెరుగుతున్నాయి. జగనన్న విద్యా దీవెన కింద రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసించే వారందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. ఆర్థిక భారం లేకపోవడంతో విద్యార్థులు ఎక్కువగా ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. జగనన్న వసతి దీవెన కింద ప్రతి విద్యార్థికి ఏటా రూ.20 వేలు అదనంగా ఇస్తున్నారు. ఇంజనీరింగ్ సిలబస్‌ను సంస్కరించి ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కొత్త అంశాలను జోడించారు. ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థలతో శిక్షణ, సర్టిఫికేషన్ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. జగనన్న విద్యా దీవెన కింద ఇప్పటివరకు రూ.9051.57కోట్లు అందించారు. దీని ద్వారా ఇంజనీరింగ్‌తో పాటు ఇతర కోర్సులకు చెందిన 24,74,544 మంది విద్యార్థులకు మేలు చేకూరింది. జగనన్న వసతి దీవెన కింద ఇప్పటివరకు రూ.3,349.57కోట్లు అందించగా 18,77,863 మందికి లబ్ధి చేకూరింది. కాలేజీలకు న్యాక్ గుర్తింపును తప్పనిసరి చేశారు. ప్రమాణాలు మెరుగుపరుచుకోని కాలేజీలకు అనుమతులు రద్దు చేస్తున్నారు. గత ఏడాది ప్రవేశాలు సరిగా లేని 28 కాలేజీల్లో ప్రవేశాలు నిలిపివేశారు. ఒక్క విద్యార్థీ చేరని మరో 22 కాలేజీల అనుమతులు రద్దు చేశారు. దీంతో కాలేజీల్లో వసతులు, బోధనలో నాణ్యత మెరుగుపడుతున్నాయి. ఈ చర్యలతో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2022–23 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటా సీట్లు 1,13,403 కాగా, అందులో 95,968 (85 శాతం) భర్తీ అయ్యాయి. యాజమాన్య కోటా, స్పాట్ అడ్మిషన్లతో పాటు చూస్తే 1,21,836 (76 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. గత నాలుగేళ్ల గణాంకాలు చూస్తే ఏటా భర్తీ అయ్యే సీట్ల సంఖ్య పెరుగుతుండడం విశేషం.

● తెలంగాణ

ప్రారంభమైన నాగోబా జాతర

ఇంద్రవెల్లి/ఉట్నూర్(ఖానాపూర్): ఆదివాసీలు గూడేలు వీడెను. నాగోబా నీడన చేరెను. ఆదివాసీల ఆరాధ్య దైవమైన నాగోబా జాతర శనివారం మొదలైంది. వేలాదిగా తరలివచ్చిన గిరిజనులతో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ జనసంద్రంగా మారింది. మూడురోజులుగా వడమర(మర్రిచెట్లు) వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు తూమ్ పూజలు(చనిపోయిన వారికి కర్మకాండలు) నిర్వహించి శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్నారు. పుష్య అమావాస్య అర్ధరాత్రి పవిత్ర గంగాజలాలతో నాగోబాను అభిషేకించిన అనంతరం జాతర ప్రారంభమైంది. మెస్రం వంశీయులు ఉదయం నుంచి ఆచార సంప్రదాయాలు పాటిస్తూ నాగోబాను స్మరిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ సమీపంలోని వడమర వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు, పెద్దలు(పటేళ్లు) శనివారం తెల్లవారుజామున 84 మందికి తూమ్ నిర్వహించారు. శనివారం నాగేంద్రుడి విగ్రహంతో ఆలయానికి చేరుకున్నారు. సిరికొండ మండల కేంద్రం నుంచి తెప్పించిన మట్టికుండలకు మెస్రం పెద్దలు పూజలు నిర్వహించారు.

కలహమునకు దూరముగా నుండుట నరులకు ఘనత.
మూర్ఖుడైన ప్రతివాడును పోరును కోరును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.12.57 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.8.00 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.11.43 నుండి 1.11 వరకు, **దుర్ముహూర్తం:** ప.4.15 నుండి 5.01 వరకు, **అమృతఘడియలు:** రా.8.36 నుండి 10.04 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.45
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

డాక్టర్ తమిళిసై (గవర్నర్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఒకే గ్రహం మీది మనుషులు ఒకర్నొకరు ఎందుకు అసహనంగా, అనుమానంగా చూసుకుంటారు! ఒకే గ్రహం కాదు.. ఒకే దేశం, ఒకే రాష్ట్రంలోని మనుషులు కూడా!

మనుషులు మనుషులుగా ఉన్నంత వరకేనేమో ఒకరితో ఒకరు బాగుండటం?! అవతలి వ్యక్తి గవర్నర్‌గా రాగానే ఇవతలి వ్యక్తికి తను మనిషిని కాదనీ, ముఖ్యమంత్రిననీ ఎందుకు గుర్తుకు రావాలి!

మనిషిగా నాకున్న మంచి జ్ఞాపకాలన్నీ కేవలం మనుషులతోనే. అధినేతలతో కాదు. ముప్పై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. మనిషిని చెయ్యి వదిలిన రోజు లేదు నేను. మనిషి కనిపిస్తే నాడి పట్టుకుని చూస్తాను. "ఏం తల్లీ, బాగున్నావా?" అని అడుగుతాను. బాగున్నవాళ్ల నాడి పట్టుకుని చూడకూడదనే ముంది?! ఏ దారిలోనైనా స్కూలు కనిపిస్తే ఆగి, స్కూలు లోపలికి వెళతాను. "పిల్లలూ.. వేళకు భోంచేస్తున్నారా?" అని అడుగుతాను. వాళ్లు తరగతి గదిలో ఉన్నంత మాత్రాన "పిల్లలూ.. బాగా చదువుతున్నారా?" అని మాత్రమే నేను



అడగాలనేముంది?

కేసీఆర్ గారిని కూడా.. ఆయన నన్ను గవర్నరుగా మాత్రమే చూసేందుకు పరిమితం కాకపోయుంటే నన్ను నేను గవర్నర్‌గా మాత్రమే చూసుకుని ఉంటానా? "ఏమండీ చంద్రశేఖర్రావు గారూ.. ఎప్పుడూ మీరు ప్రజలకు సేవ చేయడమేనా! ప్రజల్నీ మీకు సేవ చేయనివ్వండి.." అని తేనీటి సేవనానికి ఆయన్ని రాజ్‌భవన్‌కు ఆహ్వానించి ఉండనా?!

"అసలు మీకు, కేసీఆర్ గారికి మధ్య గొడవెలా మొదలైంది?" అని తమిళ జర్నలిస్టు ఒకరు రాజ్‌భవన్‌లో మోదీజీ పుస్తకం 'ఎగ్జామ్ వారియర్స్' ఆవిష్కరణకు వచ్చినప్పుడు నన్ను అడిగారు. తమిళ జర్నలిస్టుకైనా, తెలుగు జర్నలిస్టుకైనా, హిందీ జర్నలిస్టుకైనా నేను చెప్పేది ఒకటే. ఆ గొడవన్నది తెలంగాణ అనే ఒక రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రికీ, ఆ రాష్ట్ర గవర్నరుకీ మధ్య మొదలైనదే తప్ప.. ఒకే గ్రహానికి చెందిన ఇద్దరు మనుషుల మధ్య మొదలైంది కాదని.

రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లేకపోవచ్చు కానీ.. మహిళలు మాత్రమే రాజకీయాల నుంచి ఒక మనిషిని 100 శాతం వేరు చేసి చూడగలరు. అలా వేరు చేసి చూస్తే.. కేసీఆర్ గారు పర్‌ఫెక్ట్ జెంటిల్మన్. మమతా బెనర్జీ ఆల్రెడీ తమ కొత్త గవర్నర్ ఆనంద బోస్‌ను పర్‌ఫెక్ట్ జంటిల్మన్ అనేశారు కనుక, కేసీఆర్ గారిని మోస్ట్ పర్‌ఫెక్ట్ జెంటిల్మన్ అనాలి. ఆయన మరొకరి ఘనతను అంగీకరించరు కాబట్టి.


ప్రొటోకాల్ విషయంలో కేసీఆర్ గారు ఎలాగున్నా, రాష్ట్రపతి శ్రీమతి ముర్ము హైదరాబాద్ వచ్చినప్పుడు మాత్రం ఆయన తన మానవ ధర్మాన్ని విస్మరించలేదు. మేడమ్‌ను ఆహ్వానించడానికి నాతో కలిసి వచ్చారు. నన్ను తనతో కలుపుకొని వెళ్లారు! ఖమ్మం సభలో కూడా ముందుగా ఏమీ ఆయన గవర్నర్‌లను అనలేదు. కేజ్రీవాల్, విజయన్ అన్నాకే.. తను అనవలసి వచ్చి అన్నారు.

గవర్నర్‌లను అనకూడదనేమీ లేదు. అయితే ఒక పార్టీ ఆవిర్భావ సభకు వచ్చిన ముఖ్యమంత్రులు ఆ పార్టీ నాయకుడి సామర్థ్యాల గురించి కాకుండా, గవర్నర్‌లు తమను వేధిస్తున్నారని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని వాపోవడం ఏమిటి!

సభకు వచ్చిన ఆ ఇద్దరు ముఖ్యమంత్రుల కన్నా.. సభకు రాని ముఖ్యమంత్రులు నితీశ్‌కుమార్, మమతాబెనర్జీ, స్టాలిన్, నవీన్ పట్నాయక్.. వీళ్లే నిజంగా కేసీఆర్ గారి వెంట ఉన్నట్లు. కేసీఆర్ గారి కొత్త జాతీయ పార్టీకి నిజంగా మద్దతు ఇస్తున్నట్లు.

ఈ మాటంటే కేసీఆర్ గారు వినిపించుకుంటారా?! మోదీజీని మైండ్‌లోంచి దించేసుకుంటే తప్ప ఆయన ఆలోచనలకేదీ ఎక్కదు. ఆయన తనని ముఖ్యమంత్రి అనుకుంటున్నంత కాలం.. మోదీజీని వట్టి ప్రధానిగానే చూస్తారు. అసలైన ప్రజా నాయకుడిగా చూడలేరు. తనూ అసలైన ప్రజా నాయకుడిగా ఉండలేరు.

చిలుక జోస్యమే చివరి ఆశ!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



తూర్పు దిక్కున విచ్చుకుంటున్న ప్రభాత రేకల్ని మనం చూడగూడదు. పడమటి సంధ్యారాగపు విభాత గీతాలాపన మన చెవిన పడగూడదు. తలుపులకూ, కిటికీలకూ ఇనుప తెరలు కప్పేద్దాం. మన పాలితులకు మన సినిమానే చూపిద్దాం. ఆధిపత్య వర్గాలకు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగుబాటయ్యే సమాజాల్లో ఈ భావజాలం రాజ్యం చేస్తుంది. సకల వ్యవస్థలనూ ఈ వర్గాలు పెంపుడు చిలుకలుగా మార్చివేస్తాయి. వార్తలనూ, వ్యాఖ్యానాలనూ ఈ చిలుకల పలుకుల్లోనే మనం గ్రహించాలి. ధర్మమేమిటో, సంప్రదాయమేమిటో, వ్యవహారమేమిటో కూడా ఈ చిలుకలే మనకు బోధిస్తాయి. 'హెచ్‌ఎమ్‌వి' రికార్డుల్నే ఈ చిలుకలు వినిపిస్తాయనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు తాలం వేయని ప్రభుత్వాలు ఏర్పడితే ఇక రణమే. పెంపుడు చిలుకలు కూడా కత్తులు దూస్తాయి. మీడియానే ముందుండి యుద్ధం చేస్తుంది. ఈ పరిణామాలకు ఆంధ్రప్రదేశ్ కంటే స్పష్టమైన ఉదాహరణ ఇంకొకటి లేదు. పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసే ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలో పెంపుడు చిలుకలకు అరాచకమే కనిపిస్తుంది. తొక్కిసలాట నిరోధించే భద్రతా చర్యలైనా, అక్రమ భవంతులను కూల్చివేయడమైనా అప్రజాస్వామికంగానే కనిపిస్తాయి.

సూర్యుడు మార్నింగ్ బెల్ కొట్టకముందే వేకువ కిరణాల మాదిరిగా సంక్షేమాన్ని జనం ముంగిటకు చేర్చుతున్న వలంటీర్లలో ఎల్లో మీడియాకు సంఘ విద్రోహులు కనబడుతున్నారు. తనకు కనిపించడమే కాదు, ప్రజలందరూ ఇదే విషయాన్ని నమ్మి తీరాలని కూడా ఎల్లో మీడియా సమాజాన్ని ఆదేశిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థను దేశంలో ఉన్న విజ్ఞులందరితోపాటు ఇంగిత జ్ఞానమున్న సామాన్యులు సైతం ప్రశంసిస్తున్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాకారంలో విప్లవాత్మకమైన ముందడుగుగా భావిస్తున్నారు. కానీ, మన పెత్తందారీ వర్గాల పెంపుడు చిలుకలు మాత్రం ఒక దుందుడుకు చర్యగా పరిగణిస్తున్నాయి. వాటి మీద విష ప్రచారాన్ని ఎక్కుపెట్టాయి. రైతు పండించిన ధాన్యానికీ, మద్దతు ధరకూ మధ్యన అడ్డుగోడగా నిలిచిన దళారీ వ్యవస్థను ప్రభుత్వం తొలగించింది. ఇది గిట్టని ఎల్లో మీడియా ప్రతిరోజూ కళ్లల్లో నిప్పులు గుమ్మరించుకుంటూనే ఉన్నది.

పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం చదువు చెబితే ఎల్లో మీడియాకు కడుపునొప్పి. నాణ్యమైన ఆధునిక విద్యను ఉచితంగా అందజేస్తే అజీర్తి రోగం. అత్యుత్తమమైన ప్రజా వైద్యం పల్లెగడప తొక్కితే మూలశంక వ్యాధి మెలిపెడుతున్నది. మహిళల సాధికారత కోసం పదవులూ, నిధులూ అందుబాటులో ఉంచితే కడుపు తరుక్కుపోతున్నది. సొంత ఇంటి రూపంలో కొంత ఆస్తిని సమకూర్చితే ఎల్లో కూటమి కాలేయం కమిలిపోతున్నది. పేదవర్గాలకు ప్రత్యక్షంగా నగదు బదిలీని చేస్తుంటే తనువెల్లా దహించుకుపోతున్నది. తను ఇంతగా రోగపీడితం కావడానికి కారణమైన ప్రభుత్వంపై ఈ కూటమి తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నది. తక్షణం గద్దె దింపాలన్న కోరికతో సెగలు కక్కుతున్నది. అందుకోసం సమాచార విధ్వంసానికి పూనుకుంటున్నది. నందిని పందిగా, పందిని నందిగా ప్రచారం చేయడానికి తెగబడుతున్నది. వ్యవస్థల్లోని పెంపుడు చిలుకలను ఉపయోగించుకొని ప్రజాభిప్రాయాన్ని 'ఉత్పత్తి' చేయడానికి ఒడిగడుతున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెస్తున్న అప్పులపైనా, చేస్తున్న ఖర్చులపైనా ఎల్లో మీడియా ఎంత గోబెల్స్ బీభత్సాన్ని సృష్టించిందో లోకమంతా చూసింది. రాష్ట్రం నేడో, రేపో మరో శ్రీలంక కాబోతున్నదని ప్రజలను బెదరగొట్టే ప్రయత్నాలు చేసింది. డబ్బంతా పప్పు బెల్లాలకే ఖర్చు చేస్తున్నారు తప్ప అభివృద్ధి కోసం పైసా విదల్చడం లేదని చాటింపు వేసి మరీ బాకా ఊదారు. ఇటువంటి కుక్క కాట్లకు ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ శాఖలే చెప్పుదెబ్బల్లాంటి సమాధానాలిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో అభివృద్ధి వాటానే ఎక్కువని బడ్జెట్ గణాంకాలను ఉటంకిస్తూ ఆర్‌బీఐ అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. సామాజిక రంగంపై చేసే ఖర్చు... అంటే విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, గోదాముల నిర్మాణం వంటివన్నీ అభివృద్ధి ఖాతాలోకే వస్తాయని ఆర్‌బీఐ తేటతెల్లం చేసింది. 11.43 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెస్తున్న అప్పులపైనా, చేస్తున్న ఖర్చులపైనా ఎల్లో మీడియా ఎంత గోబెల్స్ జీభత్సాన్ని సృష్టించిందో లోకమంతా చూసింది. రాష్ట్రం నేడో, రేపో మరో శ్రీలంక కాబోతున్నదని ప్రజలను బెదరగొట్టే ప్రయత్నాలు చేసింది. డబ్బంతా పప్పు బెల్లాలకే ఖర్చు చేస్తున్నారు తప్ప అభివృద్ధి కోసం పైసా విదల్చడం లేదని చాటింపు వేసి మరీ బాకా ఊదారు. ఇటువంటి కుక్క కాట్లకు ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ శాఖలే చెప్పుదెబ్బల్లాంటి సమాధానాలిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో అభివృద్ధి వాటానే ఎక్కువని బడ్జెట్ గణాంకాలను ఉటంకిస్తూ ఆర్‌బీఐ అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. సామాజిక రంగంపై చేసే ఖర్చు... అంటే విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, గోదాముల నిర్మాణం వంటివన్నీ అభివృద్ధి ఖాతాలోకే వస్తాయని ఆర్‌బీఐ తేటతెల్లం చేసింది. 11.43 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి దేశంలోనే మొదటిస్థానంలో (2021-22) ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నివేదికల సారాంశం ఎల్లో మీడియాకు నిద్ర పట్టనివ్వడం లేదు. అది వితండ వాదానికి తెగబడుతున్నది. అమరావతిలో నాలుగు భవంతుల నిర్మాణమే అభివృద్ధిగా ప్రచారం చేయడానికి ఆపసోపాలు పడుతున్నది.

దేశంలోనే మొదటిస్థానంలో (2021–22) ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నివేదికల సారాంశం ఎల్లో మీడియాకు నిద్ర పట్టనివ్వడం లేదు. అది వితండవాదానికి తెగబడుతున్నది. అమరావతిలో నాలుగు భవంతుల నిర్మాణమే అభివృద్ధిగా ప్రచారం చేయడానికి ఆపసోపాలు పడుతున్నది.

ప్రపంచమంతటా ఇప్పుడు కొత్త గాలులు వీస్తున్నాయి. నయా ఉదారవాదానికి (Neo Liberalism) కాలం చెల్లినట్టేనని పెట్టుబడిదారీ ఆర్థిక ప్రవక్తలే గట్టిగా వాదిస్తున్నారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ఈ దేశంలో సృష్టించిన కీలుబొమ్మల్లో ముఖ్యుడైన చంద్రబాబు సహా ఆయన పెత్తందారీ ఎల్లో కూటమి ఇంకా దాన్నే పట్టుకొని వేలాడుతున్నాయి. మానవాభివృద్ధి కంటే వస్తుగతాభివృద్ధిలోనే పెత్తందారీ వర్గాల స్వీయ ప్రయోజనాలు ఇమిడి ఉండటమే అందుకు కారణం.

గడిచిన నాలుగేళ్లలో ఒకదాని తర్వాత ఒకటి చొప్పున లాటిన్ అమెరికాలో నయా ఉదారవాద ప్రభుత్వాలు కుప్పకూలుతున్నాయి. వాటి స్థానంలో వామపక్ష, వామపక్ష మధ్యేవాద ప్రభుత్వాలను ప్రజలు అధికారంలోకి తెస్తున్నారు. మెక్సికో, అర్జెంటీనా, చిలీ, పెరూ, బొలీవియా, హోండూరాస్, బ్రెజిల్ వగైరా డజన్‌కు పైగా లెఫ్టిస్టు ప్రభుత్వాలతో దక్షిణ అమెరికా ఖండం రంగు మారుతున్నది. నయా ఉదారవాదపు అమానవీయ పంపిణీ విధానాన్ని జనం తిరస్కరిస్తున్నారు.

నయా ఉదారవాదం సృష్టించిన అసమానతలు ఎంత అమానుషంగా ఉన్నాయో ఎప్పటికప్పుడు ఆక్స్‌ఫామ్ విడుదల చేస్తున్న నివేదికలు స్పష్టం చేస్తూనే ఉన్నాయి. మొన్నటి దావోస్ సమావేశాల తొలిరోజు విడుదల చేసిన తాజా నివేదిక మరింత భయంగొలిపే విధంగా ఉన్నది. ఈ రెండున్నరేళ్లలో ప్రపంచం 42 ట్రిలియన్ డాలర్ల సంపదను సృష్టించింది. జనాభాలో ఒక్క శాతం శ్రీమంతుల ఖాతాలో అందులో 67 శాతం సంపద పడిపోయింది. మిగిలిన 99 శాతం మందికి 33 శాతం సంపద. 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్' పేరుతో విడుదల చేసిన ఈ నివేదిక నయా ఉదారవాద అమానుషత్వాన్ని ఎత్తి చూపింది. సంపన్నుల సంపద ఈ పాతికేళ్లలో ఎంత వేగంగా పెరిగిందో అంతే వేగంగా పేద ప్రజల పేదరికం కూడా పెరిగింది.

భారతదేశం పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. అట్టడుగున ఉండే 50 శాతం మంది పేద ప్రజల చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉన్నది. ఒక్కశాతం కుబేరుల చేతిలో 40 శాతం సంపద పోగుపడింది. ఈ కుబేరుల్లో వరసగా 10 శాతం మందిని లెక్కిస్తే వారందరి చేతిలో కలిపి 80 శాతం సంపద ఉన్నది. అంటే ఈ దేశంలో ఒక వంద రూపాయల సంపద ఉందనుకుంటే, దేశ జనాభా వందమంది అనుకుంటే పంపిణీ ఈవిధంగా ఉంటుంది. పదిమంది ధనవంతుల ఆస్తి 80 రూపాయలు. 50 మంది పేదవారి ఉమ్మడి ఆస్తి 3 రూపాయలు. 40 మంది మధ్య–ఎగువ మధ్యతరగతి వారి ఆస్తి విలువ 17 రూపాయలు. దేశంలోని సమస్త ప్రజలు సమష్టిగా శ్రమించి, అందరికీ చెందవలసిన సహజ వనరులను ఉపయోగించుకుని సృష్టించిన సంపదలో ఈ రకమైన పంపిణీ న్యాయమైనదేనా? ఈ దేశంలోని శ్రీమంతులకూ, పెట్టుబడిదారులకూ ఇంకో సౌలభ్యం కూడా ఉన్నది. వాళ్లు బ్యాంకుల్లో ఉన్న ప్రజల సొమ్మును అప్పుగా తీసుకొని ఆ తర్వాత ఎగవేయవచ్చు. అలా గడిచిన ఎనిమిదేళ్లలో 12 లక్షల కోట్ల రుణాలను ఎన్‌పీఏలుగా పరిగణించి కేంద్ర పెద్దల సాయంతో మాఫీ ముద్ర వేసేశారట. ఏ పేదవాడి రుణాన్నయినా ఈ దేశంలోని ఏ బ్యాంకయినా ఇలా మాఫీ చేసిన చరిత్ర ఉన్నదా? చెంబూ, తపేలాలతో సహా ఇంటినీ, ఒంటి మీది గోచీని కూడా వేలంవేసి వసూలు చేయడమే బ్యాంకులకు రివాజు.

ఈ నేపథ్యంలోనే నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా కొత్త ఆలోచనలు ముందుకు వచ్చాయి. ఈ ఆలోచనలకే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు పట్టం కడుతున్నారు. లాటిన్ అమెరికా దేశాల్లోని పరిణామాలను కూడా ఈ కోణం నుంచే అర్థం చేసుకోవలసి ఉంటుంది. అసమానతలతో కూడిన అమానవీయ అభివృద్ధికి బదులుగా సమస్త మానవుల అభివృద్ధి, ప్రకృతి వనరుల పరిరక్షణతో కూడిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (Sustainable development) ఎంపిక చేసుకోవాలనేది ఒక ముఖ్యమైన ఆలోచన. ముఖ్యమైన పరిశ్రమలు, కీలక మౌలిక రంగాల మీద ప్రభుత్వరంగ అజమాయిషీయే కొనసాగాలనేది మరో ఆలోచన. ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేయడానికీ, విద్య, వైద్య సౌకర్యాల విస్తరణకూ, వారి సాధికారతకూ ప్రభుత్వాలు పెద్దఎత్తున ఖర్చు చేయాలి. ధనిక–పేద, ఆడ–మగ, జాతి లేదా కులాల మధ్య అంతరాల్లేని అభివృద్ధి లక్ష్యంగా ఉండాలి. ఈ తరహా ఆలోచనలకే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పట్టం కడుతున్నారు.

పేద వర్గాల ప్రజలను నిలబెట్టడానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రెండు లక్షల కోట్లను ప్రత్యక్షంగా బదిలీ చేయడాన్ని 'ఈనాడు' సహిత ఎల్లో మీడియా, ఆంధ్రప్రదేశ్ పెత్తందార్లు, వారి నాయకుడైన చంద్రబాబు సహించలేకపోతున్నారు. ఇలా ఖర్చుపెడితే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని శాపనార్థాలు పెడుతున్నారు. ట్యాక్స్‌పేయర్ల సొమ్మును ఉచితాలకు తగలేస్తున్నారని మధ్యతరగతి వారిని రెచ్చగొడుతున్నారు. అయ్యా ట్యాక్స్ పేయర్లూ! మీ సొమ్మును ఎవరు కబళించుకుపోతున్నారో కొంచెం బుర్రపెట్టి ఆలోచించండి. ఎల్లో మీడియా మిడిమిడి జ్ఞానపు రాతలకూ, వాట్సప్ యూనివర్సిటీ పోసుకోలు పాఠాలకూ ప్రభావితం కావద్దు. మీ ట్యాక్స్ సొమ్మునే కాదు, పేద ప్రజలు రక్తమాంసాలు కరిగించి చిందించిన చెమట చుక్కల్ని కూడా కుబేరులు దోచుకుంటున్నారు. ఆ కుబేరులు పోగేసుకున్న 80 శాతం సంపదలో కనీసం సగమైనా సామాజిక అభివృద్ధికి తరలించవలసిన అవసరం లేదా? ఆలోచించండి.


ఈ పూర్వరంగం నుంచి చూసినప్పుడే మనకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కూడా అర్థమవుతాయి. పేద వర్గాల ప్రజలను నిలబెట్టడానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండు లక్షల కోట్లను ప్రత్యక్షంగా బదిలీ చేయడాన్ని 'ఈనాడు' సహిత ఎల్లో మీడియా, ఆంధ్రప్రదేశ్ పెత్తందార్లు, వారి నాయకుడైన చంద్రబాబు సహించలేకపోతున్నారు. ఇలా ఖర్చుపెడితే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని శాపనార్థాలు పెడుతున్నారు. ట్యాక్స్ పేయర్ల సొమ్మును ఉచితాలకు తగలేస్తున్నారని మధ్యతరగతి వారిని రెచ్చగొడుతున్నారు. అయ్యా ట్యాక్స్ పేయర్లూ! మీ సొమ్మును ఎవరు కబళించుకుపోతున్నారో కొంచెం బుర్రపెట్టి ఆలోచించండి. ఎల్లో మీడియా మిడిమిడి జ్ఞానపు రాతలకూ, వాట్సప్ యూనివర్సిటీ పోసుకోలు పాఠాలకూ ప్రభావితం కావద్దు. మీ ట్యాక్స్ సొమ్మునే కాదు, పేద ప్రజలు రక్తమాంసాలు కరిగించి చిందించిన చెమట చుక్కల్ని కూడా కుబేరులు దోచుకుంటున్నారు. ఆ కుబేరులు పోగేసుకున్న 80 శాతం సంపదలో కనీసం సగమైనా సామాజిక అభివృద్ధికి తరలించవలసిన అవసరం లేదా? ఆలోచించండి.

'యుద్ధం ముగిసిన రణభూమి వృద్ధాప్యం' అంటారు. చేతులు – కాళ్లు తప్ప మరే ఆస్తిలేని పేదలంతా కరాల బిగువు, నరాల సత్తువ ఉన్నంతవరకూ జీవన పోరాటం చేసి అలసి సొలసి, కొంచెం సాంత్వన కోరుకుంటారు. కన్నబిడ్డలు ఎవరి బతుకు పోరులో వారు నిమగ్నం కాగా, బుక్కెడు బువ్వకోసం, ఓ చిన్న పలకరింపు కోసం అవ్వాతాతలు ఎదురుచూస్తుంటారు. వారి ఇళ్ల వద్దకు వలంటీర్లు వెళ్లి యోగక్షేమాలడిగి పెన్షన్ డబ్బులు చేతిలో పెడితే పాపమా? అది వ్యవస్థ బాధ్యత కాదా? 'ఈనాడు'–చంద్రబాబు ఎల్లో కూటమి అది పాపమనే అభిప్రాయపడుతున్నాయి. పేద పిల్లలు ఇంగ్లిషు మీడియంలో చదవడం కూడా పాపమనే భావిస్తున్నాయి. మహిళలకు సమాన స్థాయి సామాజిక – రాజకీయ – ఆర్థిక హోదాను కల్పించడాన్ని కూడా పాపకార్యంగానే భావిస్తున్నాయి. కనుక ఈ తరహా సుస్థిర–మానవీయ అభివృద్ధి లక్ష్యాలను ఎంచుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై అవి యుద్ధానికి సమాయత్తమవుతున్నాయి. కానీ ఈ కూటమి నమ్ముకున్న నయా ఉదార విధానాలు ప్రపంచమంతటా మట్టికరుస్తున్నాయి. కొత్త ఆలోచనల ఝంఝూమారుతం ప్రచండ వేగంతో వీస్తున్నది. ఇనుప తెరలు ఆ వేగాన్ని తట్టుకోలేవు. ఎన్ని రాజకీయ కూటములను ఏర్పాటు చేసుకున్నా, ఎంతమంది ప్రవచకుల చేత సుభాషితాలు చెప్పించినా, ఎన్ని చిలుక జోస్యాలను ప్రచారంలో పెట్టినా, జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న పేదవర్గాలు – మధ్యతరగతి ప్రజల ఐక్య సంఘటనను ఎదుర్కోలేవు.

vardhelli1959@gmail.com

గిడుగు తెలుగు భాషకు గొడుగు

సందర్భం



శ్రీనివాస్ కోరాడ

గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు (1863 ఆగస్టు 29–1940 జనవరి 22) తెలుగు వ్యావహారిక భాషోద్యమ పిత. వ్యాకరణ బంధనాల్లో చిక్కుకొని, పండిత కుటుంబాలకే అంటే అగ్రవర్ణాలకే పరిమితమైన చదువును... బడుగు బలహీన వర్గాలకు దగ్గర చేసినవాడు గిడుగు. భాష ద్వారా సామాజిక అంతరాలను తగ్గించి, తెలుగు నేలను అభ్యుదయం వైపు నడిపించిన పిడుగు మన గిడుగు.

18, 19 శతాబ్దాలలో విజయనగరం సంస్థానంలో పని చేయడానికి కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి వలస వచ్చిన అనేక కుటుంబాలలో గిడుగు కుటుంబం కూడా ఒకటి. గిడుగు తండ్రి గిడుగు వీర్రాజు. ఈయన స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా (నేడు డా॥ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా) ఇందుపల్లి గ్రామం. 1858లో వీర్రాజు విజయనగరం వలస వచ్చి, సంస్థానంలో ఉద్యోగంలో చేరారు. తర్వాత రామ్మూర్తి 1863 ఆగస్టు 29న జన్మించారు.

రామ్మూర్తి విజయనగరం మహారాజా కళాశాలలో లోయర్ ఫోర్త్‌లో చేరారు. గురజాడ అప్పారావు కూడా అదే తరగతి. మెట్రిక్యులేషన్ పూర్తయ్యే వరకు అంటే 1879 వరకు ఇద్దరిదీ ఒకటే తరగతి. వీరికి దిగువ తరగతిలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు ఉండేవారు. 1879లో మెట్రిక్యులేషన్ పూర్తయింది. అదే సమయంలో కుటుంబ, వివాహ బాధ్యతల వలన రామ్మూర్తి పంతులు విశాఖపట్నం కలెక్టర్ ఆఫీసులో గుమాస్తాగా చేరాల్సి వచ్చింది. రెవెన్యూలో ఉద్యోగం నచ్చక పర్లాకిమిడి హైస్కూల్లో నెలకు రూ. 30 జీతానికి ఉపాధ్యాయునిగా చేరారు. ఉద్యోగం చేస్తూనే ఎఫ్ఏ, బీఏలను ప్రైవేటుగా పాసయ్యారు. తదుపరి చరిత్ర ఉపన్యాసకులుగా కూడా పనిచేశారు.

పర్లాకిమిడిలో 'రీడింగ్ రూమ్' అనే సమాజం ద్వారా సంఘ సంస్కరణ కోసం కృషిచేశారు. 'రీడింగ్ రూమ్' సమాజం వితంతు వివాహాల కోసం చురుకుగా పనిచేసేది. దీని వెనుక 1908 వరకు ఆ సమాజానికి కార్యదర్శిగా ఉన్న గిడుగు కృషి ఉంది.

పర్లాకిమిడి పట్టణ ప్రాంత సమీప కొండల్లో సవరజాతివారు నివసిస్తుండేవారు. కొండల్లో కట్టెలు కొట్టుకువచ్చి పర్లాకిమిడిలో అమ్ముకొనేవారు. రామ్మూర్తి పంతులు వారి జీవితాలను పరిశీలించారు. వారు దోపిడీకి గురవుతున్నారని గ్రహించారు. వారిని నాగరిక ప్రపంచంలోనికి తీసుకురావాలంటే చదువుకున్నవారిగా తయారుచేయాలని భావించారు. తెలుగు భాష తెలిసిన సవర 'పొట్టెడు' వద్ద సవర భాష నేర్చుకొన్నారు. సవరల బతుకులు మార్చాలనీ, వారి కోసం బడులను తెరవాలనీ రామ్మూర్తి భావించారు. ఈ క్రమంలో సవరలతో స్నేహం చేయడానికి చేసే ప్రయత్నంలో మలేరియా జ్వరం బారిన పడి, క్వినైన్ మందు వాడారు. అందు వలన చెముడు వచ్చింది. చివరకు సవరలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పి, వారినే ఉపాధ్యాయులుగా ఉపయోగించి, వారి కోసం పాఠశాలలను ఏర్పాటు చేశారు. సవర భాషకు చేసిన సేవకుగాను రామ్మూర్తి పంతులు 'కైజర్–ఇ–హింద్' బిరుదును మద్రాసు గవర్నర్ జనరల్ చేతులు మీదుగా అందుకున్నారు.



ఇదే సమయంలో 1906లో జేఏ ఏట్స్ గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల పాఠశాల తనిఖీ అధికారిగా విశాఖపట్నంలో విధుల్లో చేరారు. ఉద్యోగ రీత్యా ఈయన తెలుగు నేర్చుకోవల్సి వచ్చింది. ఏట్స్ నేర్చుకుంటున్న భాషకు జనసామాన్యంలో ఉన్న భాషకు విపరీతమైన తేడా ఉన్నట్టు గుర్తించారు. పాఠశాలల తనిఖీ సమయంలోనూ పాఠశాలలో చెప్పే గ్రాంథిక భాషకూ, వాడుక భాషకూ చాలా వ్యత్యాసం ఉందని ఏట్స్ గ్రహించారు. ఆ విషయంపై గురజాడ సలహా మీద గిడుగు రామ్మూర్తి ముందు తన సందేహాలను ఉంచారు ఏట్స్. ఆయన కొంత సమయం ఇవ్వమని ఏట్స్‌ను అడిగారు. ఆయనకు విద్యారంగంలో ఉన్న అనుభవం వలన ఏట్స్ లేవనెత్తిన అంశం సరైనదిగా తోచింది. కాని తనకు తెలుగు భాషపై ప్రావీణ్యత లేదని భావించి దానిని సాధించడం కోసం నన్నయ్య కాలం నుండి చిన్నయ్య సూరి కాలం వరకు తెలుగు కావ్య భాషను పరిశీలించారు. భాష అనేది మారుతూ ఉన్నదనీ, జీవద్భాషకు మార్పు సహజమనీ రామ్మూర్తి గ్రహించారు.

ఏట్స్ గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల కొరకు ఉపాధ్యాయ పరిషత్ ఏర్పాటు చేసి 1907 నుంచి వేసవి సెలవులలో సభలు నిర్వహించారు. 1910 నాటి సభలో ఫోర్త్ ఫారం నుంచి బీఏ వరకు విద్యార్థుల చేత వ్యాస రచనలు, అనువాదాలు తెలుగు వ్యావహారిక భాషలో రాయించడం మంచిదని రామ్మూర్తి సూచించారు. ఇదే వ్యావహారిక భాషావాదంలోని మొదటి కలకలం.

రామ్మూర్తి పంతులు గ్రాంథిక వాదులను ఎదుర్కొంటూ తను మరణించేంత వరకు అంటే 1940 వరకు ఒక్కడై పోరాడి విజయం సాధించారు. బడుగు బలహీన వర్గాలవారికి చదువు దగ్గరై సామాజిక తారతమ్యాలు దూరమవడానికి ఆయన కృషే ప్రధాన సాధనం అయ్యింది. వ్యావహారిక భాష విద్యారంగంలో ముందుగానే ప్రవేశ పెట్టిన బెంగాళీలు నాడు దేశంలో అందరికంటే ముందుండేవారు. తెలుగు నేలపై కూడా వ్యావహారిక భాషోద్యమం మరి కొన్నాళ్ళు ఆలస్యమై ఉండి ఉంటే, మనం మరికొంత వెనుకబడి ఉండేవారమేమో!

1928–1936 మధ్య పర్లాకిమిడి రాజావారితో ఏర్పడిన విభేదాల కారణంగా ఆయన ఒరిస్సా రాష్ట్రం ఏర్పడే సమయానికి రాజమండ్రికి చేరుకొని అక్కడే చివరి శ్వాస వరకు జీవించారు. తెలుగువారం ఉన్నంత కాలం రామ్మూర్తికి రుణపడే ఉంటాం.

వ్యాసకర్త తహశీల్దార్, భోగాపురం మండలం, విజయనగరం జిల్లా

(నేడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి)

హిమాలయాలను కాపాడాలి

హిమాలయాలు లేకపోతే, భారతదేశమే లేదంటే అతిశయోక్తి కాదు. దేశంలో 70 శాతం ప్రజలకు తాగునీరు, సాగునీరు, అందజేస్తున్న మూడు జీవనదులు గంగా, సింధు, బ్రహ్మపుత్రల పుట్టినిల్లు హిమాలయాలు. మనకు అందమైన పర్యాటక ప్రదేశాలు, కులూ మనాలి, సిమ్లా, ముస్సోరి, డార్జిలింగ్ వంటి హిల్ స్టేషన్లు, ప్రపంచములోనే అత్యంత అందమైన కశ్మీర్ లోయ, హిమాలయాల్లోనే ఉన్నాయి. మన పుణ్యక్షేత్రాలు బదరీనాథ్, కేదార్‌నాథ్, అమర్‌నాథ్ వంటివి అక్కడే ఉన్నాయి. మనకు ఆపిల్ తోటలు, న్యూస్‌ప్రింట్ కాగితం, ఆయుర్వేదానికి కావాల్సిన విలువైన మూలికలు వంటి వాటికి హిమాలయాలే పుట్టిల్లు. అంతేనా... సైబీరియా నుంచి వచ్చే శీతల గాలుల నుండి దేశాన్ని రక్షిస్తున్నదీ, ఈశాన్య రుతు పవనాలకు సహకరించేదీ హిమాలయాలే. ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద వ్యాసమే అవుతుంది.

అలాగే హిమాలయాల గురించి భూగర్భ శాస్త్రవేత్తలు చెపుతున్న విషయాలలో రెండు ముక్కలు ప్రస్తావించుకుందాము. హిమాలయాలు ప్రపంచంలోనే అతి పిన్న ముడుత పర్వతాలు. దక్షిణ భారతంలో గ్రానైట్ రాళ్ళు అతి కఠినమైనవీ, పురాతనమైనవీ. టెక్టానిక్ ఫోర్సెస్ (భూ అంతర్గత ఒత్తిడుల) వల్ల భారత ఉప ఖండ పలక, అతిపెద్దదైన యురేషియన్ పలక వైపు జరిగే నేపథ్యంలో ఏర్పడుతున్న ముడుత పర్వతాలే హిమాలయాలు. ఇప్పటికీ ఈ నిర్మాణ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. అంతే కాకుండా ఇవి భూకంప జోన్‌లో ఉన్నాయి. మరి ఇంత సున్నిత పర్వతాలలో, జలవిద్యుత్ కేంద్రాలు, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, రోడ్లు వెడల్పు చేయటం ఎంతవరకు మన దేశానికి శ్రేయస్కరం? దీనికితోడు ప్రపంచ వ్యాప్తమైన పర్యావరణ విధ్వంసం, మరి జోషీమఠ్, నైనిటాల్ వంటి చోట్ల భూమిలో పగుళ్లు, ఇళ్లలో బీటలు, హఠాత్తుగా వస్తున్న వరదలు ఊహించదగినవే. అందమైన, సున్నితమైన హిమాలయాలను అంతే సున్నితంగా నియంత్రణతో వాడుకోవటం దేశానికి ఎంతో శ్రేయస్కరం. హిమాలయాల వెంబడి ఉన్న రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి, ఉత్తర్వులు ఇవ్వాలి. అందమైన, విలువైన హిమాలయ ప్రాంతాన్ని, అంతే అందంగా, సున్నితంగా వాడుకుందాం. ప్రపంచం మేలు కొరకు, వీలైతే చైనాకు కూడా చెపుదాం.

– మరింగంటి శ్రీరామ, రిటైర్డ్ చీఫ్ జీఎం, సింగరేణి

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 12 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో ఆరు కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,756 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 26,725 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.82 కోట్లు వేశారు. టైం స్లాట్ దర్శన టికెట్లు కలిగిన వారికి సకాలంలో, టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి రెండు గంటల్లో దర్శనం లభిస్తోంది.

29న గోరటి వెంకన్నకు వేటూరి కవితా పురస్కారం



పాయకరావుపేట: వేటూరి సాహితీ పీఠం, శ్రీ ప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ తుని, పాయకరావుపేట వారు 'వేటూరి గుండెగా మన వూరి పండుగ' పేరున ఇస్తున్న వేటూరి కవితా పురస్కారాన్ని ఈ ఏడాది ప్రఖ్యాత కవి, గాయకుడు గోరటి వెంకన్నకు ఇవ్వనున్నట్లు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వర శర్మ, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్ శనివారం తెలిపారు. ఈ నెల 29న వేటూరి జయంతి సందర్భంగా అవార్డును ప్రదానం చేస్తామని చెప్పారు. తుని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చిట్టూరి మెట్రోలో జరుగనున్న ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా ప్రఖ్యాత సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ పాల్గొంటారని చెప్పారు. 12 సంవత్సరాలుగా వేటూరి కవితా పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు.

స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేసుల్లో రికార్డు స్థాయిలో హాట్ మెటల్ ఉత్పత్తి



స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ గోదావరి, కృష్ణా బ్లాస్ట్ ఫర్నేసుల్లో రికార్డు స్థాయిలో హాట్ మెటల్ ఉత్పత్తి చేశాయి. గత నెలలో సాధించిన రికార్డును ఈ నెల 20న తిరగరాశాయి. ఇందులో భాగంగా శుక్రవారం రెండు బ్లాస్ట్ ఫర్నేసులు సంయుక్తంగా 16,250 టన్నులు హాట్ మెటల్ ఉత్పత్తి చేయడం ద్వారా మరో రికార్డును సాధించాయి. తద్వారా గత నెల 20న రెండు ఫర్నేస్‌లు సాధించిన 16,200 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి రికార్డును అధిగమించాయి. ప్లాంట్ ప్రారంభించిన నాటి నుంచి రెండు ఫర్నేస్‌ల అత్యధిక ఉత్పత్తి ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జి బాగ్చీలు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ఉద్యోగులను అభినందించారు.

హేతువాద సంఘ చైర్మన్ 'రావిపూడి' కన్నుమూత



చీరాల అర్బన్: భారత హేతువాద సంఘ చైర్మన్, హేతువాది మాసపత్రిక ఎడిటర్ రావిపూడి వెంకటాద్రి (101) అనారోగ్యంతో శనివారం చీరాలలో కన్నుమూశారు. హేతువాద మాసపత్రిక సంపాదకుడిగా ఆయన ఎన్నో వ్యాసాలు రాయడమే కాక.. వందలాది పుస్తకాలను స్వయంగా రచించి ముద్రించారు. వెంకటాద్రి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం ఇంకొల్లు మండలం నాగండ్లలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఎండు చేపలు.. మెండైన ఆదాయం

బాపట్ల జిల్లా చందోలు వారాంతపు సంతలో ఎండు చేపల విక్రయం



చందోలు సంతలో జోరుగా సాగుతున్న చేపల క్రయవిక్రయాలు

- ఒక్క రోజులో రూ.3 కోట్ల వ్యాపారం
- కాకినాడ, విశాఖ, భద్రాచలం, నిజాంపట్నం, చీరాల ప్రాంతాల నుంచి చేపల రాక
- కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి

సాక్షి ప్రతినిధి, బాపట్ల : బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలులో ప్రతి శుక్రవారం జరిగే సంత ఎండు చేపల క్రయవిక్రయాలకు ప్రసిద్ధి. ఈ సంతకు వందేళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. విశాఖపట్నం, కాకినాడ, ఒంగోలు, భద్రాచలం, నెల్లూరు, నిజాంపట్నం, చీరాల ఓడరేవు, మచిలీపట్నం, కొత్తపట్నం తదితర సముద్ర తీర ప్రాంతాల్లో లభ్యమయ్యే పలు రకాల చేపలను ఎండబెట్టి.. మత్స్యకారులు, వ్యాపారులు ప్రతి శుక్రవారం ఇక్కడి సంతకు తీసుకొస్తారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు ఏపీలోని అన్ని జిల్లాలకు చెందిన వ్యాపారులు, మత్స్యకారులు ఇక్కడ ఎండు చేపలను కొనుగోలు చేసి.. వాటిని తమ ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ఏపీలోని సీమ జిల్లాలతో పాటు, గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో చేపల అమ్మకాలు అధికంగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.



విక్రయానికి ఎండు చేపలు

గురువారం సాయంత్రానికి చేపలు విక్రయించే వారితో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చే వ్యాపారులు చందోలు చేరుకుంటారు. దీంతో చేపల వ్యాపారులతో చందోలు కిటకిటలాడుతుంది. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే సంత మొదలై.. ఏడు గంటలకల్లా వ్యాపారం జోరందుకుంటుంది. ఇతర రాష్ట్రాలకు వెళ్లే వారు వేకువజామునే చేపలను కొనుగోలు చేసి వాహనాల్లో తరలిస్తారు. చిరు వ్యాపారులు రాష్ట్ర వ్యాప్తంగా విక్రయాల కోసం చేపలను కొనుగోలు చేస్తారు. మహిళలు అధికంగా వచ్చి చేపలు కొనుగోలు చేస్తుండటం విశేషం.

రకరకాల చేపలు లభ్యం

చందోలు సంతలో సముద్ర ప్రాంతంలో దొరికే పలు రకాల ఎండు చేపలు లభిస్తాయి. చీలికలు, మెత్తళ్లు, రొయ్యలు, బొంత చేపలు, కానాగంతలు, సావడాయలు, రొయ్యపొట్టు, కారువాయలు, పండుగప్పలు, కూనం, టేకి, ఉప్పు చేపలు దొరుకుతాయి. సంతలో కిలో ఎండు చేపలు రూ.50 నుంచి రకాలను బట్టి కిలో రూ.600 వరకూ లభిస్తాయి. సావడాయిలు కిలో రూ.120, రొయ్యపొట్టు రూ.100 నుంచి 200, మెత్తళ్లు రూ.150 నుంచి 250, కారువాయలు రూ.120, రొయ్యలు రూ.100 నుంచి 350, పండుగప్పలు రూ.250 నుంచి 600, టేకు రూ.100, కూనం రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు.

పదేళ్లుగా సంతకొస్తున్నా..



ఎండుచేపల విక్రయానికి ప్రతి గురువారం రాత్రికే చందోలుకు చేరుకుంటాం. శుక్రవారం తెల్లవారుజాము నుంచే చేపల విక్రయాలు ప్రారంభమవుతాయి. ఇక్కడికి చేపల కొనుగోళ్ల కోసం అన్ని ప్రాంతాల నుంచి వస్తారు. నేను ఇప్పటికి సుమారు పదేళ్లుగా ఇక్కడికి వస్తున్నా.

– కల్పాల శ్రీను, చేపల వ్యాపారి, తాడేపల్లి గూడెం

తెచ్చిన చేపలన్నీ వెంటనే అమ్ముడుబోతాయి



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా కుటుంబం చేపల వేట పైనే ఆధారపడి జీవిస్తోంది. మేం వేటాడిన చేపలను ఎండబెట్టి చందోలు సంతకు తెస్తాం. మేం వచ్చే సమయానికే కొనుగోలుదారులు కూడా ఇక్కడికి చేరుకుంటారు. తెచ్చిన చేపలన్నీ వెంటనే అమ్ముడుబోతాయి.

– సంగాని గంగాధరరావు, మత్స్యకారుడు, కాకినాడ

వారం రోజులకు సరిపడా తెచ్చుకుంటాం



మేము ప్రతి శుక్రవారం చందోలు సంతకు వెళ్లి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చేపలను కొనుగోలు చేస్తాం. వాటిని వారం రోజుల పాటు బాపట్ల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తిరిగి అమ్ముకుంటాం. వ్యాపారులు.. మాకు ఏళ్ల తరబడి పరిచయం ఉండటంతో అప్పులు కూడా ఇస్తుంటారు. చందోలు సంతలో చేపలంటే కొనుగోలుదారులు ఎగబడతారు.

– నీలావతి, బాపట్ల

రోజుకు రూ.3 కోట్ల వ్యాపారం

చందోలు సంతలో ప్రతి శుక్రవారం రూ. 2 కోట్ల నుంచి 3 కోట్ల వ్యాపారం జరుగుతుంది. కరోనాకు ముందు ఒక్క రోజులో రూ.4 కోట్ల నుంచి 5 కోట్ల వ్యాపారం జరిగేదని సంత పర్యవేక్షకులు చెప్పారు. కరోనా తర్వాత వ్యాపారాలు బాగా తగ్గాయని, ఇప్పుడిప్పుడే తిరిగి పుంజుకుంటున్నాయని తెలిపారు. ఏటా జూన్ 15 నుంచి ఏప్రిల్ 15 వరకు చేపల వేట ఉంటుందని.. ఆ కాలంలో మాత్రమే చేపలను సంతలో విక్రయిస్తామని మత్స్యకారులు చెప్పారు. సంతలో చేపల విక్రయాలవల్ల రాష్ట్ర వ్యాప్తంగానే కాక అటు తమిళనాడు, కర్ణాటక , తెలంగాణ రాష్ట్రాల పరిధిలో వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది.

పిండ మార్పిడి ద్వారా పెయ్యి దూడ జననం

- పిండ మార్పిడి ద్వారా మేలు జాతి దూడను పుట్టించే ప్రయోగం విశాఖ జిల్లాలో విజయవంతం
- దూడను పరిశీలించిన వెటర్నరీ శాఖ అధికారులు



పిండ మార్పిడి పద్ధతి ద్వారా పుట్టిన పెయ్యి

మధురవాడ(భీమిలి): పశు సంతతి వృద్ధికి ఆవు జాతితో సంబంధం లేకుండా పిండ మార్పిడి ద్వారా మేలు జాతి దూడను పుట్టించే ప్రయోగం జిల్లాలో విజయవంతమైంది. తొలిసారిగా విశాఖ జిల్లా పీఎం పాలెంలో ఉంటున్న బొబ్బిలి పార్వతికి చెందిన జెర్సీ ఆవు.. ఇటీవల దేశవాళీ గిర్ జాతికి చెందిన మేలు జాతి పెయ్యి దూడకు జన్మనిచ్చింది. ఈ ప్రయోగం ద్వారా పుట్టిన దూడని శనివారం సాయంత్రం పశు సంవర్ధక శాఖ విశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకరరావు, ప్రయోగంలో ప్రధాన భూమిక పోషించిన డాక్టర్ పి.భానుబాబు, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రామ్మోహనరావు ఇతర అధికారులు పరిశీలించారు. ప్రయోగం విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న పద్ధతుల ద్వారా ఒక ఆవు జీవిత కాలంలో సుమారుగా 16 కాన్పులు చేయగలదని, ఈ పిండ మార్పిడి పద్ధతి ద్వారా మేలు జాతి దేశీయ ఆవుల అండం, వీర్యం సేకరించి ప్రయోగశాలల్లో ఫలదీకరణం చేయించడం ద్వారా పిండాన్ని అభివృద్ధి చేస్తారు. 7వ రోజు వయస్సు కలిగిన ఈ పిండాన్ని ఘన నత్రజనిలో ఘనీభవింపజేసి.. దానిని వేరే ఆవుల్లో ప్రవేశపెట్టి తద్వారా మేలు జాతి దూడలను ఉత్పత్తి చేస్తారు. ఈ దూడలకు తల్లి జాతి ఆవు లక్షణాలుండవు. మేలు జాతి ఆవు లక్షణాలు మాత్రమే వస్తాయి. ఈ పద్ధతి ద్వారా ఒక ఆవు కనీసం 50 దూడలకు జన్మనివ్వగలదని చెప్పారు. ఇది ఎంతో గొప్ప విజయమని, దీని ద్వారా పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఇక్కడ ఆవుకు గతేడాది మార్చి 28న ఇంజక్షన్ ద్వారా అండాన్ని ప్రవేశ పెట్టగా.. జనవరి 10న దూడకి జన్మనిచ్చిందని వివరించారు. ఈ దూడను పరిశీలించిన వారిలో ఎండ్రాలజీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.శంకరరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ బి.ప్రసాదరావు, మధురవాడ పశువైద్యాధికారి అరుసుఅరుల్ ఉన్నారు.

చాలా ఆనందంగా ఉంది



మా జెర్సీ ఆవుకు దేశవాళి గిర్ జాతికి చెందిన పెయ్యి దూడ పుట్టింది. ఇది పెద్దదయితే పూటకి 10 లీటర్ల వరకూ పాలిస్తుంది. మాకు మేలు జాతి ఆవులు లేకున్నా ఈ పద్ధతి ద్వారా మేలు జాతి పెయ్యిలు పుడుతున్నాయి.

–బొబ్బిలి పార్వతి, పాడి రైతు, పీఎంపాలెం

'విద్య అమృత మహోత్సవ్'లో ఏపీకి రెండో స్థానం

సాక్షి, అమరావతి: 'విద్య అమృత్ మహోత్సవ్' కార్యక్రమం అమలులో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే రెండో స్థానం దక్కిందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ 'శిక్షక్ పర్వ్' వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వినూత్న, వైవిధ్య విద్యా అంశాలతో పిల్లల మనసుల్ని ఆకట్టుకునేలా చిన్నచిన్న అద్భుతమైన ఆలోచనలని దృశ్య రూపకంగా మార్చి బోధనా అభ్యసనకు తగిన 1,00,758 ప్రాజెక్టులను అప్‌లోడ్ చేసి ఏపీ ఉపాధ్యాయులు ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు. ప్రథమ స్థానం సాధించిన బిహార్, ఇతర రాష్ట్రాల్లో మూడు నెలలు ముందే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినా.. మన రాష్ట్రం ఒక నెలలోనే అధికంగా ప్రాజెక్టులు అప్‌లోడ్ చేసి ద్వితీయ స్థానం కైవసం చేసుకుందని వివరించారు. వివిధ అంశాలపై దృశ్యరూపకాలను అప్‌లోడ్ చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ అధ్యాపకులు, స్కూల్ కాంప్లెక్స్ సభ్యులను కమిషనర్ అభినందించారు. జాతీయ స్థాయిలో 10 దృశ్య రూపకాలను (వీడియోలు) ఎంపిక చేసి దేశమంతా ప్రదర్శిస్తారని తెలిపారు.



రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినందుకు కృతజ్ఞతగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీశయన, పొందర కార్పొరేషన్ చైర్మన్లు, తదితరులు

ఊర చెరువులకూ ఆస్తులు

- గుళ్లు, సత్రాలు వలే వీటి నిర్వహణకు వ్యవసాయ భూములు దానం
- రాష్ట్రంలో 104 గ్రామాల్లో ఈ తరహా చెరువులు
- దేవదాయ శాఖ ఆధీనంలోనే ఈ ఆస్తులు
- గుంటూరు, ప్రకాశం, కృష్ణా ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఈ భూములు
- వీటిపై వచ్చే ఆదాయంతో ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- పేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, సైకిళ్ల పంపిణీకి వినియోగం



సాక్షి, అమరావతి: సాధారణంగా గ్రామాల్లో ఓ ఊర చెరువు ఉంటుంది. పూర్వం ఈ చెరువులోని నీటినో లేదంటే ఆ చెరువు పక్కనే ఉండే బావి నీటినో గ్రామస్తులు తాగునీరుగా వాడుకునేవారు. కానీ, వీటిలో తరచూ పూడికతీత వంటి నిర్వహణ పనులు చేపట్టాలి కదా.. అందుకు.. గుళ్లు, సత్రాలు, విద్యాసంస్థలకు దాతలు భూములు దానం ఇచ్చినట్లుగానే ఈ ఊర చెరువులకు కూడా దాతలు విడిగా భూములు దానంగా ఇచ్చేవారు. చెరువు ఉన్న భూమిని దానంగా ఇవ్వడం కాదు.. విడిగా కొంత వ్యవసాయ భూములను ఆ చెరువుల పేరుతో దానం చేసేవారు.

ఈ భూములు దేవదాయ శాఖ ఆధీనంలో..

రాష్ట్రవ్యాప్తంగా 104 చోట్ల ఊర చెరువు పేరుతో విడిగా వ్యవసాయ భూములున్నాయి. ఇవి ప్రస్తుతం దేవదాయ శాఖ పరిధిలోనే ఉన్నాయి. గుళ్లు, సత్రాల నిర్వహణకు కార్యనిర్వాహక అధికారులు (ఈఓ)లు పనిచేస్తున్నట్లే ఈ ఊర చెరువుల నిర్వహణకూ దేవదాయశాఖ ఈఓలను నియమించింది. ఇవి ప్రత్యేకించి కొన్ని జిల్లాల్లో మాత్రమే ఉన్నట్లు దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 59 చోట్ల ఉండగా.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 42, ఉమ్మడి కృష్ణాజిల్లాలో మూడుచోట్ల కలిపి మొత్తం 104 ఉన్నాయి. ఒక్కొక్క చెరువు పేరిట ఆ చెరువు ఉన్న విస్తీర్ణానికి అదనంగా రెండు ఎకరాల వ్యవసాయ భూమి మొదలు కొన్ని చెరువుల పేరిట 80 ఎకరాలకు పైగా కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం కొప్పోలులో 66.60 ఎకరాల్లో ఊర చెరువు ఉండగా.. దాని పేరిట దాతలు దానం ఇచ్చిన మరో 31.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అదే ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం గుత్తికొండవారిపాలెం గ్రామంలో తొమ్మిది ఎకరాల్లో ఊర చెరువు ఉంటే.. దాని పేరిట రెండు ఎకరాల భూమిని దాతలు దానంగా ఇచ్చారు. ఇలా అత్యధిక భూములున్న ఒకట్రెండు ఊర చెరువులకు వాటికి ఉన్న వ్యవసాయ భూముల ద్వారానే ఏటా పది లక్షలకు పైబడి రాబడి వస్తోంది. ఎక్కువగా ఏటా రూ.5 లక్షల దాకా ఆదాయం వచ్చే చెరువులే ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇలా వచ్చే ఆదాయంలో మిగులును దేవదాయ అధికారులు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తున్నారు.

పేద పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

మారిన పరిస్థితులతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల అలవాట్లలో చాలా మార్పులు వచ్చాయి. ఊర చెరువుల నుంచి నీటిని తెచ్చుకుని తాగేవాళ్లు ఇప్పుడు ఎవరూ లేరనే చెప్పొచ్చు. మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి వాటర్ క్యాన్‌లు సరఫరా పెరిగిపోయింది. దీంతో దేవదాయ శాఖ పరిధిలో ఉండే ఊర చెరువుల పేరిట ఉన్న వ్యవసాయ భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ గ్రామంలో పేద పిల్లలకు స్కాలర్‌షిప్పులు, కొన్నిచోట్ల ఆడపిల్లలకు సైకిళ్ల వంటివి అందజేయడంపై దేవదాయ శాఖ దృష్టి పెట్టింది. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం కొప్పోలులో ఉండే ఊర చెరువుకు ఉన్న వ్యవసాయ భూముల ద్వారా ఏటా రూ.5.05 లక్షల ఆదాయం వస్తుండగా.. ఈ ఏడాది నుంచి మొట్టమొదటిసారి ఆ ఆదాయంలో రూ.75 వేలతో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో ఆడవారికి ముగ్గుల పోటీలు... యువకుల కోసం కబడ్డీ, పరుగు పందెం వంటి పోటీలు నిర్వహించారు. అంతేకాదు.. గ్రామ పరిధిలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే ఆడపిల్లలకు ఇద్దరు చొప్పున ఉచితంగా సైకిళ్లు అందజేయాలని దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ సంబంధిత ఊర చెరువు ఈఓను ఆదేశించారు. ఇక నుంచి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కూడా ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

తిరుమల ఆలయం వీడియో ప్రచారంపై చర్యలు : వైవీ





తిరుమల: శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించినట్టుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయం వెలుపల శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ఆలయం పైన ఎలాంటి విమానాలు, డ్రోన్లు తిరిగేందుకు అవకాశం లేదని, ఆగమ శాస్త్రాల ప్రకారం నిషేధించినట్టు తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న తిరుమల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడం సాధ్యం కాదని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ సోషల్ మీడియాలో ఓ వీడియోను ప్రసారం చేస్తోందని టీటీడీ విజిలెన్స్, భద్రతాధికారులు గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే ఆ సంస్థకు చెందిన వ్యక్తులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో డ్రోన్ ద్వారా చిత్రీకరించారా.. లేక పాత ఫొటోలను మార్ఫింగ్ చేసి 3డీ విధానంలోకి మార్చారా అనేది ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఆధారంగా తెలుస్తుందన్నారు. సదరు వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, సమగ్ర విచారణ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు కారకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చర్యలు తీసుకోవాలని కోరాం: ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు

దివ్య శక్తితో వెలసిన తిరుమల క్షేత్రం పైన విమానాలు, డ్రోన్లు ప్రయాణించరాదని ఆగమశాస్త్రం చెబుతోందని తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. సంప్రదాయంలో భాగంగా తిరుమలలో కొన్ని నిబంధనలు అమల్లో ఉన్నాయని చెప్పారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి సైతం టీటీడీ ఇప్పటికే విన్నవించిందని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నట్టు తెలిపారు.

డ్రోన్‌తో చిత్రీకరణపై పోలీసు కేసు నమోదు

తిరుమల శ్రీవారి ఆలయంపై డ్రోన్‌తో చిత్రీకరణ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై టీటీడీ వీజీవో బాలిరెడ్డి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. కిరణ్ అనే వ్యక్తి ఆలయ భద్రత నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్‌ను వినియోగించి వీడియో చిత్రీకరణ చేసి సదరు వీడియోను గృహ శ్రీనివాస, ఐకాన్ ఫేక్ అకౌంట్లో పోస్ట్ చేశాడు. డ్రోన్ కెమెరాతో శ్రీవారి ఆలయ దృశ్యాలు చిత్రీకరించి భద్రత నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు, అసాంఘిక శక్తులకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరించడంపై ఐపీసీ సెక్షన్ 447 కింద కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కడే ఆ నలుగురై..

- అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తున్న హెడ్ కానిస్టేబుల్
- ఆదర్శంగా నిలుస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామారావు



అనాథ శవాన్ని ఖననం చేస్తున్న రామారావు

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న తెలుకల రామారావు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేయడం నుంచి ఇబ్బందుల్లో ఉన్న వారికి సాయం చేయడం వరకు రామారావు ఆన్ డ్యూటీలోనే ఉంటారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన రామారావు 1993లో నందిగాం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 1995లో నందిగాంలో ఓ సాధువు భిక్షాటన చేస్తూ మృతి చెందాడు. శవాన్ని పూడ్చడానికి ఎవరూ ముందుకు రాకపోగా.. దూరం నుంచి వెళ్లిపోవడం ప్రారంభించారు. ఈ దృశ్యాన్ని చూసిన రామారావు తొలిసారిగా ఆ సాధువుకు శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు పూర్తి చేశారు. అప్పటి నుంచి ఈ క్రతువు ఓ యాగంలా కొనసాగిస్తున్నారు. నందిగాంలో ఒకటి, బత్తిలిలో రెండు, నరసన్నపేటలో ఒకటి, నౌపడలో రెండు, ఇచ్ఛాపురంలో మూడు అనాథ శవాలకు స్వయంగా అంత్యక్రియలు జరిపారు. నౌపడలో పనిచేస్తున్నప్పుడు భార్యభర్తలిద్దరూ అనారోగ్యంతో మరణించగా.. వారి పిల్లలు ప్రవీణ్, నవీన్ బాగోగులు రామారావే చూశారు. ఒక పిల్లాడిని హాస్టల్‌లో చేర్పించి, మరో విద్యార్థిని బంధువుల ఇంటి వద్ద ఉంచి 2014 నుంచి 2019 వరకు వారిని చదివించి, వారి ఆలనాపాలనా చూస్తున్నారు.

ఆ తృప్తే వేరు



మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిని. ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి వచ్చా. అనాథలు, బిచ్చగాళ్లను చూస్తే నా మనసు కకావికలం అవుతుంది. నాకు ఉన్నంతలో సాయం చేస్తుంటాను. సేవ చేయడంలో ఉండే తృప్తే వేరు.

– తెలుకల రామారావు, హెడ్ కానిస్టేబుల్, ఇచ్ఛాపురం

రామారావును ఆదర్శంగా తీసుకోవాలి



రామారావు లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. ఓవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే.. మరోవైపు ప్రజోపకరమైన సేవలు అందిస్తారు. ఇలాంటి వ్యక్తి మా శాఖలో ఉండటం గర్వకారణం. ఆయన మా అందరికీ ఆదర్శనీయమైనవాడు. రామారావు మరిన్ని సేవా కార్యక్రమాలు అందిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

– రాజాన ఈశ్వరచంద్ర ప్రసాద్, సీఐ, ఇచ్ఛాపురం

సత్యసాయి సేవలో కేంద్ర మంత్రి చౌహాన్



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి దేవాన్ష్ చౌహాన్

ప్రశాంతి నిలయం: కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవాన్ష్ చౌహాన్ శనివారం సత్యసాయి సేవలో గడిపారు. రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో పుట్టపర్తికి విచ్చేసిన ఆయనకు ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరం వద్ద సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు తదితరులు ఘన స్వాగతం పలికారు. మందిరంలోని సత్యసాయి మహాసమాధిని చౌహాన్ దర్శించుకున్నారు. అనంతరం పుట్టపర్తిలో జరిగిన 'ప్రవాస్ యోజన' కార్యక్రమంలో ఆయన పాల్గొని బీజేపీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

క్లుప్తంగా...

న్యూజిలాండ్ నూతన ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్



ఆక్లాండ్: క్రిస్ హిప్కిన్స్(44) న్యూజిలాండ్ నూతన ప్రధాన మంత్రి కానున్నారు. ప్రధాని జెసిండా ఆర్డెర్న్ గురువారం అనూహ్యంగా రాజీనామా ప్రకటన చేయడం తెలిసిందే. ఆ పదవికి అధికార లేబర్ పార్టీ నుంచి ఎంపీ హిప్కిన్స్ ఒక్కరే నామినేషన్ వేశారు. ఆదివారం ప్రతినిధుల సభ సమావేశంలో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధికారికంగా ప్రకటించనుంది. తర్వాత ఆయన బాధ్యతలు చేపడతారు. 2008లో తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికైన ఆయన 2020లో కోవిడ్-19 మంత్రిగా నియమితులయ్యారు. ఈ ఏడాది చివర్లో న్యూజిలాండ్‌లో ఎన్నికలున్నాయి. లేబర్ పార్టీకి గెలుపు కష్టమేనని విశ్లేషకులు అంటున్నారు.


జోషీమఠ్‌లో మళ్లీ కూల్చివేతలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో మంచు, వర్షం కారణంగా నిలిచిపోయిన భవనాల కూల్చివేత పనులు శనివారం నుంచి మళ్లీ మొదలయ్యాయి. భూమి కుంగిపోవడంతో జోషీమఠ్‌లో 849 ఇళ్లకు పగుళ్లు రావడం తెలిసిందే. 269 కుటుంబాలను తాత్కాలిక సహాయ కేంద్రాలకు తరలించామన్నారు. వీరికి హీటర్లు, ఉలెన్ దుస్తులు, వేడి నీరు, ఆహారపదార్థాల కిట్లు అందజేశామన్నారు.

కేంద్రంపై కాంగ్రెస్ చార్జిషీట్



న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను విమర్శిస్తూ కాంగ్రెస్ శనివారం చార్జిషీట్ విడుదలచేసింది. బీజేపీ తప్పుడు హామీలు గుప్పిస్తోందని ఆరోపించింది. బీజేపీ అంటే భ్రష్ట జుమ్లా పార్టీ అంటూ కొత్త భాష్యం చెప్పింది. ''మోదీ ప్రభుత్వం సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ అంటూ ఎప్పుడూ నినదిస్తుంది. కానీ నిజానికది కుచ్ కా సాథ్, కుచ్ కా వికాస్, సబ్‌కే సాథ్ విశ్వాస్‌ఘాత్ (కొద్ది మందికే లబ్ధి, మిగతా అందరికీ మోసం)'' అంటూ మండిపడింది. కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' లోగోను పార్టీ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ శనివారం ఆవిష్కరించారు. మోదీ సర్కారుపై చార్జిషీట్‌ను, రాహుల్ సందేశ లేఖను ఇంటింటికీ తీసుకెళ్లే ఈ కార్యక్రమం జనవరి 26న మొదలవుతుందని చెప్పారు.



తారలు తెర'మరుగు'

బెంగళూరు: మబ్బుల్లేని రాత్రి వేళ అలా ఆకాశంలోకి చూసినప్పుడు లెక్కలేనన్ని నక్షత్రాలు తళుకుమంటూ కనువిందు చేస్తుంటే ఎంతో బావుంటుంది కదా! కానీ వినువీధిలో తారల తళుకులు నానాటికీ తగ్గిపోతున్నాయి. 2011తో పోలిస్తే 2022 నాటికి అబ్జర్వేటరీల కెమెరా కంటికి కన్పిస్తున్న నక్షత్రాల సంఖ్య ఏకంగా 10 శాతం తగ్గిందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది! అయితే, దీనికి కారణం నక్షత్రాలు నశించిపోవడం కాదు. భూమిపై కృత్రిమ వెలుగులు మితిమీరి పెరిగిపోవడం! మరోలా చెప్పాలంటే కాంతి కాలుష్యమన్నమాట!! దాంతో కాస్త తక్కువ ప్రకాశంతో కూడిన నక్షత్రాలన్నీ సదరు కృత్రిమ వెలుగు మాటున మరుగున పడిపోతున్నాయట! ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితని యూనివర్సిటీ ఆఫ్ శాంటియాగో డీ కాంపొస్టెలా భౌతిక శాస్త్రవేత్త ఫాబియో ఫాల్చీ ఆవేదన వెలిబుచ్చారు. ''కాంతి కాలుష్యం ఏటా 7 నుంచి 10 శాతం చొప్పున పెరిగిపోతోంది! ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. దీనికి తక్షణం అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది'' అని ఆయనన్నారు. ''ఒకప్పట్లా చిక్కటి చీకటితో నిండిన రాత్రుళ్లు ఎప్పటికీ తిరిగిరావు. ముఖ్యంగా నగరాల్లోనైతే రాత్రిపూట వెలుగులు అనివార్యంగా మారి దశాబ్దాలు దాటింది. కానీ పరిస్థితి పూర్తిగా చేయి దాటకుండా చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆకాశంలో కేవలం వేళ్లపై లెక్కబెట్టగలిగినంతకు మించి చుక్కలు కన్పించని రోజు ఎంతో దూరంలో లేదు'' అంటూ హెచ్చరించారు.

వైరస్‌కు ప్రతి సృష్టి!

లండన్: మానవ చరిత్రలో తొలిసారిగా వైరస్‌కు కంప్యూటర్ సాయంతో యథాతథంగా ప్రతి సృష్టి చేశారు! గతంలోనూ ఇలాంటివి జరిగినా జీవపరంగా, 3డి నిర్మాణపరంగా, జన్యుపరంగా ఓ వైరస్‌ను అచ్చుగుద్దినట్టుగా పునర్నిర్మించడం ఇదే తొలిసారట! బ్రిటన్లోని ఆస్టన్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ ద్మిత్రీ నెరుక్ ఈ ఘనత సాధించారు! అత్యాధునిక సూపర్ కంప్యూటర్లు వాడినా కూడా ఈ పరిశోధనకు ఏకంగా మూడేళ్లు పట్టిందట! ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైరస్ నిర్మాణాలను క్రయో ఎలక్ట్రాన్ మైక్రోస్కొపీ, కంప్యుటేషనల్ మోడలింగ్ సాయంతో పరిశీలించారు. ''ఇంతకాలం పాటు వైరస్‌ల పూర్తి జన్యు నిర్మాణక్రమం అందుబాటులో లేని కారణంగా వాటి తాలూకు జీవక్రియలపై మనకు సంపూర్ణ అవగాహన లేదు. తాజా అధ్యయనం ఈ విషయంలో దారి చూపగలదు'' అని సైంటిస్టులు చెబుతున్నారు. ''అంతేగాక ఈ పరిశోధన వల్ల యాంటీబయాటిక్స్‌కు మెరుగైన, సమర్థమైన ప్రత్యామ్నాయాల దిశగా కొత్త దారి దొరుకుతుంది. యాంటీబయాటిక్స్‌కు లొంగని మొండి బ్యాక్టీరియా సమస్యకూ పరిష్కారం లభిస్తుంది'' అని వారంటున్నారు. ఈ అధ్యయనం ఫారడే డిస్కషన్స్ జర్నల్‌లో పబ్లిషైంది.

పెన్షన్.. టెన్షన్

ఆందోళనలతో అట్టుడికిన ఫ్రాన్స్ • రిటైర్‌మెంట్ వయసు 62 నుంచి 64కు పెంచడంపై వ్యతిరేకత
పెన్షన్ సంస్కరణలకి వ్యతిరేకంగా లక్షలాది మంది నిరసన ప్రదర్శన



పారిస్‌లో వేలాది మంది కార్మికుల నిరసన ర్యాలీ

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ పెన్షన్ సంస్కరణలు దేశ చరిత్రలో అతి పెద్ద నిరసన ప్రదర్శనకు దారి తీశాయి. పదవీ విరమణ వయసుని 62 నుంచి 64కి పెంచుతూ ప్రతిపాదనలు చేసినందుకే దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పెన్షన్ అందుకోవడానికి మరో రెండేళ్లు పని చేయాలా అంటూ ప్రజలు ఆందోళన బాట పట్టారు. రైళ్లు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. పాఠశాలలు తెరుచుకోలేదు. కార్యాలయాలు మూతబడ్డాయి. ఈఫిల్ టవర్‌ను మూసేశారు. పారిస్ సహా పలు నగరాల్లో 10 లక్షల మందికిపైగా నిరసనకారులు వీధుల్లోకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. 12 ట్రేడ్ యూనియన్లు, లెఫ్ట్ పార్టీలు, ఫార్ రైట్ పార్టీలు కలసికట్టుగా ఈ ఆందోళనల్లో పాల్గొనడం విశేషం. దేశంలో 68% ప్రజలు ఈ పెన్షన్ పథకాన్ని వ్యతిరేకిస్తున్నట్టుగా సర్వేలు చెబుతున్నాయి. రైట్ పార్టీల మద్దతుతో అధికారంలో ఉన్న సంకీర్ణ సర్కార్ వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే పెన్షన్ సంస్కరణల బిల్లుకు ఎంతవరకు మద్దతు లభిస్తుందన్న అనుమానాలున్నాయి.

రిటైర్మెంట్ వయసు పెంపు ఎందుకు?

ప్రపంచమంతటా సగటు ఆయుఃప్రమాణం పెరుగుతోంది. జననాల రేటు తగ్గిపోతోంది. దీంతో వయసు మీద పడినా కష్టపడి పని చేయాల్సి వస్తోంది. అయితే రిటైర్మెంట్ వయసు యూరప్‌లోకెల్లా ఫ్రాన్స్‌లోనే తక్కువ. స్పెయిన్‌లో 65, యూకేలో 67, జర్మనీలో 67 ఏళ్లుగా ఉంది. జర్మనీ కూడా రిటైర్మెంట్ వయసును 70 ఏళ్లకు పెంచే యోచనలో ఉంది. ఫ్రాన్స్ కూడా పెన్షన్ నిధుల్ని పెంచుకోవడానికే ఈ సంస్కరణలను తీసుకొచ్చింది. రెండేళ్ల రిటైర్‌మెంట్ వయసు పెంపుతో ఏడాదికి 1,770 కోట్ల యూరోలు జమ అవుతాయి. 2027 నాటికి బ్రేక్ ఈవెన్ సాధ్యపడుతుంది.

ఎందుకీ వ్యతిరేకత?

హాయిగా ఇంటి పట్టున ఉండి పెన్షన్ అందుకుందామని అనుకున్న వారు మరో రెండేళ్లు పనిచేయడానికి సుముఖంగా లేరు. ఇంకా పని చేస్తే రిటైరవక ముందే ఆరోగ్యం పూర్తిగా పాడవుతుందని రైల్వే వర్కర్లు, మహిళలు, నైట్‌షిఫ్టుల్లో ఉండేవారు ఆందోళనగా ఉన్నారు. కనీసం 43 ఏళ్లు పని చేయాలన్న నిబంధనపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆలస్యంగా మొదలు పెట్టే మహిళలు, ఉన్నత విద్య చదివే వారు 67 ఏళ్ల దాకా పని చేయాల్సి వస్తుంది. మరోవైపు నిరుద్యోగులు కూడా తమకు ఉద్యోగాలు లేటవుతాయంటూ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఫ్రాన్స్‌లో కనీస పెన్షన్ పెరుగుతున్న ధరలకి అనుగుణంగా లేదు. కరోనా, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ధరాభారం పెరిగింది. ఫ్రాన్స్‌లో పెన్షన్ సంస్కరణలపై నిరసనలు ఇదేం మొదటిసారి కాదు. 2010లో రిటైర్‌మెంట్ వయసుని 60 నుంచి 62 ఏళ్లకు పెంచినప్పుడు కూడా ఇదే స్థాయి వ్యతిరేకత ఎదురైంది. ఫ్రాన్స్ అధ్యక్షుడయ్యాక మాక్రాన్ ఈ సంస్కరణలు తేవాలని గట్టిగా అనుకున్నారు. 2019లో ఈ ప్రతిపాదిత సంస్కరణలకి వ్యతిరేకంగా సమ్మె జరిగినా కరోనా సంక్షోభంతో సమ్మెని ఆపేశారు. పెన్షన్ నిధి పెంచుకోవాలంటే సంపన్నులకి పన్నులు పెంచాలని, పెన్షన్ పథకంలో యాజమాన్యాల వాటాను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పెన్షన్ పథకంలో సంస్కరణలివే

- రిటైర్మెంట్ వయసును ఏడాదికి మూడు నెలల చొప్పున పెంచుతూ 2030 నాటికి 64 ఏళ్లకు పెంచడం.
- 2027 తర్వాత చేరే ఉద్యోగులెవరైనా పూర్తి పెన్షన్ కోసం కనీసం 43 ఏళ్లు పని చేయాలి.
- పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రిటైరయే నాటికి 43 ఏళ్ల సర్వీసు లేకపోతే 67 ఏళ్లు వచ్చేదాకా పని చేస్తేనే పెన్షన్ లభిస్తుంది.
- పూర్తి కాలం ఉద్యోగం చేసిన అల్పాదాయ వర్గాలకు 85% పెంపుతో పెన్షన్ 1200 యూరోలు అవుతుంది. 20 లక్షల మంది చిన్న ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుంది.

''నేను ఒక కాస్మటిక్ కంపెనీలో పనిచేస్తున్నాను. మా కార్యాలయంలో పని చేసే పరిస్థితుల్లేవు. మరో రెండేళ్లు పనిచేయాలంటే నా వల్ల కానేకాదు. ఈ పెన్షన్ బిల్లు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు''
– వర్జీనియా, మహిళా ఉద్యోగి

''నేను రైల్వేల్లో పనిచేస్తాను. శారీరక శ్రమ చేయాలి. చేతులు, కాళ్లు విరగ్గొట్టుకుంటూ పని చేస్తున్నాను.ఈ పరిస్థితుల్లో ఎన్నేళ్లు వచ్చే వరకు పని చెయ్యగలను. కనీసం 43 ఏళ్ల సర్వీసు ఉంటేనే పెన్షన్ వస్తుందనడం చాలా అన్యాయం''
– రైల్వే కార్మికుడు

ఇక వృద్ధులు భారమేనా..?

- ప్రపంచ దేశాలు పెన్షన్లను ఖరీదైన వ్యవహారంగా పరిగణిస్తున్నాయి. అమెరికాలో 50 ఏళ్ల క్రితం ప్రతీ 10 మందిలో 8 మందికి డిఫైన్డ్ బెనిఫిట్ పథకాలు వర్తిస్తే ఇప్పుడు ప్రతీ 10 మందిలో ఒక్కరికే వర్తిస్తోంది.
- ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే మొత్తం వృద్ధులలో దాదాపు మూడో వంతు మందికి పెన్షన్‌పై భరోసా లేదు. కొందరికి పెన్షన్ వస్తున్నా అది వారి కనీస అవసరాలకి ఏ మూలకూ సరిపోవడం లేదు.
- వృద్ధులైన తల్లిదండ్రులకు పిల్లలు ఆర్థికంగా అండదండగా ఉంటారన్న నమ్మకం లేదు. ఎందుకంటే పిల్లల సంఖ్య కూడా ప్రపంచమంతటా క్రమక్రమంగా తగ్గిపోతోంది. కుటుంబంలో పిల్లల సంఖ్య సగటున 1.7కి పడిపోయింది.
- 1960వ దశకంలో ప్రపంచ జనాభాలో ఒక వృద్ధునికి సగటున 12 మంది పని చేసే శ్రామికుల చొప్పున ఉండేవారు. కానీ ప్రస్తుతం అలా పని చేసేవారి సంఖ్య ఏకంగా ఎనిమిదికి పడిపోయింది! 2050 నాటికల్లా ఈ సంఖ్య మరీ తక్కువగా 4కు పడిపోతుందని అంచనా. దీంతో పని చేయలేని వృద్ధులను ప్రభుత్వాలు భారంగా చూసే రోజులొస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారతీయ భాషల్లోకి తీర్పుల కాపీలు: సీజేఐ



ముంబై: కోర్టు తీర్పులను అన్ని భారతీయ భాషల్లోకి అందుబాటులోకి తెచ్చేందుకు కృత్రిమ మేధ(ఏఐ)ను వినియోగించుకుంటామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. సమాచార అంతరాలను తొలగించడంలో సాంకేతికత చాలా కీలకమైందని ఆయన అన్నారు. ఇంగ్లిష్‌లో ఉండే కొన్ని చక్కని అంశాలు గ్రామీణ ప్రాంతాల లాయర్లు ఆకళింపు చేసుకోలేరు. లాయర్లందరికీ ఉచితంగా సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నదే నా ఉద్దేశం. ఇందుకోసం తీర్పుల ప్రతులను ఏఐను వినియోగించుకుని అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయిస్తాం'అని చెప్పారు. శనివారం బార్ కౌన్సిల్ ఆఫ్ మహారాష్ట్ర, గోవా నిర్వహించిన కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. విచారణల లైవ్ స్ట్రీమింగ్ ద్వారా లా విద్యార్థులు, టీచర్లు కోర్టుల కార్యకలాపాలను ప్రత్యక్షంగా తెలుసుకునే వీలుంటుందన్నారు. తద్వారా సమాజంలో జరుగుతున్న అన్యాయాలను గుర్తించగలుగుతారని చెప్పారు.

చంద్రునిపై కాలుపెట్టిన ఆల్డ్రిన్‌కు...
93వ ఏట నాలుగో పెళ్లి



లాస్ ఏంజెలిస్: చంద్రునిపై కాలు పెట్టిన రెండో వ్యక్తిగా చరిత్రకెక్కిన అమెరికా వ్యోమగామి బజ్ ఆల్డ్రిన్ లేటు వయసులో మళ్లీ ఓ ఇంటివాడయ్యారు! శుక్రవారం 93వ పుట్టినరోజు నాడే తన చిరకాల ప్రేయసి అయిన 63 ఏళ్ల డాక్టర్ అంకా ఫార్‌ను పెళ్లాడారు. లాస్ ఏంజెలెస్‌లో నిరాడంబరంగా తామిద్దరం వైవాహిక బంధంతో ఒక్కటయ్యామంటూ ట్వీట్ చేశారు. తామిప్పుడు లేచిపోయి పెళ్లి చేసుకున్న టీనేజర్లలా ఎక్సైటింగ్‌గా ఫీలవుతున్నామంటూ చిలిపిదనం చిందించారు! రెండు పెళ్లి ఫొటోలను షేర్ చేశారు. వాటిలో ఆయన చూడచక్కని సూట్ ధరించి మురిసిపోతూ కన్పిస్తున్నారు. దానిపై మెడల్, ఎయిర్‌ఫోర్స్ బ్యాడ్జ్ కూడా ధరించారు. గతంలో మూడుసార్లు విడాకులు తీసుకున్న ఆల్డ్రిన్‌కు ఇది నాలుగో పెళ్లి! ఆయనకు ముగ్గురు పిల్లలు, ఒక మనవడు, ముగ్గురు ముని మనవలతో పాటు ఒక ముని ముని మనవరాలు కూడా ఉన్నారు! నాసా అపోల్-11 మిషన్లో భాగస్వాములైన ముగ్గురు వ్యోమగాముల్లో 1969 జూలై 20న నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై కాలుపెట్టి చరిత్ర సృష్టించడం తెలిసిందే. కాసేపటికి ఆల్డ్రిన్, ఆయన తర్వాత మైఖేల్ కొలిన్స్ చంద్రునిపై దిగారు. వారిలో ఇప్పటికీ జీవించి ఉన్నది కూడా ఆల్డ్రినే. ఆయన 1971లో నాసా నుంచి రిటైరయ్యారు. తర్వాత షేర్‌స్పేస్ వెంచర్స్ స్థాపించారు. అంకా అందులో 2019 నుంచి పని చేస్తున్నారు.

నేతాజీ, ఆరెస్సెస్ భిన్నధ్రువాలు: అనితా బోస్



కోల్‌కతా: భావజాలపరంగా నేతాజీ సుభాష్ చంద్ర బోస్, ఆరెస్సెస్ భిన్న ధ్రువాలని నేతాజీ కూతురు అనితా బోస్ పిఫాఫ్ అన్నారు. జనవరి 23న నేతాజీ జయంతిని ఆరెస్సెస్ ఘనంగా జరిపేందుకు ఆరెస్సెస్ ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. దాని వెనక కూడా బీజేపీ, ఆరెస్సెస్ స్వప్రయోజనాలు నెరవేర్చుకునే ఉద్దేశం ఉండొచ్చని అనిత అభిప్రాయపడ్డారు. జర్మనీలో ఉంటున్న ఆమె పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడారు. ''ఆరెస్సెస్ భావజాలం గురించి నేను విన్నదాని ప్రకారం వారిది బహుశా నేతాజీ వారసత్వాన్ని సొంతం చేసుకోవాలన్న ప్రయత్నం అయ్యుండవచ్చు. కానీ నేతాజీ హిందూ అయినా అన్ని మతాలనూ గౌరవించారు. భిన్న మతాలను పాటించే వారు సామరస్యంగా జీవించాలని కోరుకున్నారు. ఈ ధోరణి బీజేపీ, ఆరెస్సెస్‌లో కన్పించదు. సింపుల్‌గా చెప్పాలంటే వాళ్లు రైటిస్టులైతే నేతాజీ లెఫ్టిస్టు. భావజాలపరంగా నేతాజీకి, కాంగ్రెస్‌కు మధ్య చాలా సారూప్యత ఉంటుంది'' అన్నారు. అయితే నేతాజీని గౌరవించుకునేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలు అభినందనీయమన్నారు. నేతాజీ 1945లో విమాన ప్రమాదంలోనే మరణించారని కాంగ్రెస్ హయాంలో వేసిన రెండు కమిషన్లు తేల్చగా అది అవాస్తవమని బీజేపీ హయాంలో వేసిన ముఖర్జీ కమిషన్ పేర్కొంది.

జోడో యాత్ర వేళ జమ్మూలో పేలుళ్లు



జమ్మూ: జమ్మూ శివారులో శనివారం ఉదయం 15 నిమిషాల వ్యవధిలో జరిగిన జంట పేలుళ్లలో 9 మంది గాయపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర రెండు రోజుల్లో జమ్మూ చేరుకోనుండగా ఈ ఘటన జరిగింది! నర్వాల్ ప్రాంతంలో పాత సామాను దుకాణం వద్ద ఓ వాహనం, 50 మీటర్ల దూరంలోని రిపేర్ షాప్‌లో బొలెరో వాహనంలో ఐఈడీలే ఈ పేలుళ్లకు కారణమని పోలీసులు అంటున్నారు. సమీపంలో ఉన్నవారు పేలుళ్లలో గాయపడ్డారు. ఫోరెన్సిక్ నిపుణులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, స్నైపర్ డాగ్స్‌తో ఆధారాల కోసం అన్వేషణ ప్రారంభించారు.

మాస్కో-గోవా విమానానికి మళ్లీ బెదిరింపు

పణజి: రష్యా రాజధాని మాస్కో నుంచి గోవాకు వస్తున్న విమానానికి శనివారం వేకువజామున మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో విమానాన్ని ఉజ్బెకిస్తాన్ వైపు దారి మళ్లించారు. రష్యాకు చెందిన అజూర్ ఎయిర్ చార్టెర్డ్ విమానం 240 ప్రయాణికులు, ఏడుగురు సిబ్బందితో మాస్కో నుంచి బయలుదేరింది. వేకువజామున 4.15 గంటలకు గోవా చేరాల్సి ఉంది. అందులో బాంబు పెట్టినట్లు అర్ధరాత్రి 12.30 గంటలప్పుడు గోవా విమానాశ్రయం డైరెక్టర్‌కు మెయిల్ రావడంతో ఉజ్బెక్‌కు దారి మళ్లించారు. తనిఖీలు చేసి ప్రమాదకర వస్తువులు లేవని నిర్ధారించాక విమానం గోవా బయల్దేరింది. ఈ నెల 9న కూడా అజూర్ ఎయిర్‌కే చెందిన మాస్కో-గోవా విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో జామ్‌నగర్ ఎయిర్‌పోర్టులో దించేయడం తెలిసిందే.

బెంగళూరులో జి-20 తొలి భేటీ

న్యూఢిల్లీ: భారత్ అధ్యక్షతన జి-20 దేశాల తొలి పర్యావరణ సమావేశాలు ఫిబ్రవరి 9-11 తేదీల మధ్య బెంగళూరులో జరగనున్నాయి. జి-20 సభ్య దేశాలతోపాటు అతిథి దేశాలు, అంతర్జాతీయ సంస్థలు పాల్గొననున్నాయి. షెర్పా ట్రాక్ కింద 13 వర్కింగ్ గ్రూపులు ఏర్పాటయ్యాయి. సమావేశాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులు శనివారం చర్చించారు.

త్రిపుర ఎన్నికల నోటిఫికేషన్ జారీ

అగర్తలా: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 16వ తేదీన పోలింగ్ జరగనుంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 30 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 2 తుది గడువు. 60 స్థానాలకు ఫిబ్రవరి 16న పోలింగ్, మార్చి 2న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయి.

వేధింపులపై 'మలివాల్ వర్సెస్ బీజేపీ'

- ఆప్‌తో కలిసి పోలీసులపై బురదజల్లజూస్తున్నారు
- ఎల్జీకి బీజేపీ ఫిర్యాదు, ఖండించిన మలివాల్



న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌ను మద్యం మత్తులో ఓ వ్యక్తి వేధించిన ఘటన రాజకీయ రంగు పులుముకుంటోంది. కేంద్రం అజమాయిషీలో ఉండే ఢిల్లీ పోలీసులు సత్వరం స్పందించలేదంటూ స్వాతి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది. మహిళా కమిషన్ చీఫ్ హోదాలో కేసును ప్రభావితం చేస్తున్నారని ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ దుయ్యబట్టారు. ''ఢిల్లీలో మహిళలకు భద్రత లేదని చూపేందుకు, ఢిల్లీ పోలీసులను అసమర్థులుగా చిత్రీకరించేందుకు సీఎం కేజ్రీవాల్, ఆయన నియమించిన స్వాతి కుట్ర చేస్తున్నారు. వాస్తవానికి నిందితుడు హరీశ్ చంద్ర ఆప్ కార్యకర్త. ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్ తరఫున ప్రచారం చేశారు. అందుకే దర్యాప్తు నిష్పాక్షికంగా పూర్తయ్యేదాకా స్వాతిని పదవి నుంచి తప్పించాలి'' అంటూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు కపూర్ లేఖ రాశారు.

నన్ను భయటపెట్టలేరు: స్వాతి

బీజేపీ నేతల ఆరోపణలను స్వాతి ఖండించారు. ''నన్ను భయపెట్టలేరు. జీవితంలో ఎన్నో సవాళ్లను, దాడులను ఎదుర్కొన్నా. ఏనాడూ వెనక్కి తగ్గలేదు. ఇలాంటి ప్రతి ఘటనా నాలోని ఉద్యమాగ్నిని మరింతగా ఎగదోస్తుంది. మరింత బలంగా మారుస్తుంది. తుది శ్వాస దాకా పోరాడుతూనే ఉంటా'' అన్నారు. జనవరి 19న తెల్లవారుజామున ఢిల్లీ రోడ్లపై మహిళల భద్రతను పరిశీలిస్తున్న స్వాతిని ఒక తాగుబోతు కారెక్కాలంటూ వేధించడం తెలిసిందే. అతన్ని పట్టుకునే ప్రయత్నంలో ఆమె చేయి కారు డోర్, అద్దం మధ్య ఇరుక్కోవడం, నిందితుడు ఆమెను కొద్ది దూరం ఈడ్చుకెళ్లడం తెలిసిందే.

బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధం

గోధ్రా అల్లర్లకు మోదీ బాధ్యుడనటంపై కేంద్రం ఆగ్రహం • యూట్యూబ్ వీడియోలు, ట్విట్టర్ పోస్టులు బ్లాక్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 2002లో గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాలంలో రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లకు మోదీనే కారణమంటూ బ్రిటన్‌కు చెందిన బీబీసీ వార్తాసంస్థ రూపొందించిన డాక్యుమెంటరీపై భారత సర్కార్ ఆంక్షల కొరడా ఝుళిపించింది. దేశంలోని పలు యూట్యూబ్ వీడియోలు, ట్విట్టర్ పోస్టుల ద్వారా షేర్ అవుతుండటాన్ని బ్లాక్ చేయాలని ఆదేశాలిచ్చింది. ఇప్పటికే ఆ వీడియోల లింక్‌లు ఉన్న 50 ట్వీట్లను తొలగించాలని ట్విట్టర్‌ను కేంద్ర సమాచార, ప్రసారశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ఆదేశించారు. 'గోధ్రా అల్లర్ల కేసులో మోదీకి క్లీన్‌చిట్ ఇస్తూ తీర్పు వెలువర్చిన సుప్రీంకోర్టు విశ్వసనీయతను ఈ డాక్యుమెంట్ ప్రశ్నిస్తోంది. సమాజంలోని వేర్వేరు వర్గాల మధ్య వైషమ్యాలను పెంచేలా దీనిని వండివార్చారు' అని విదేశాంగ, హోం, సమాచార, ప్రసార శాఖల్లోని ఉన్నతాధికారుల అభిప్రాయాల మేరకు డాక్యుమెంట్‌ను ప్రభుత్వం బ్లాక్ చేసిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి భంగం కలిగేలా, భారత్, బ్రిటన్ స్నేహసంబంధాలు దెబ్బతినేలా, దేశంలో మత సామరస్యానికి ముప్పు వాటిల్లేలా డాక్యుమెంట్‌ను రూపొందించారని ఆ ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు. 'ప్రధానిపై ప్రయోగించిన దుష్ప్రచారాస్త్రం ఇది. భారత్ పట్ల బ్రిటన్ వలసవాద వైఖరి ఇంకా మారలేదని చెప్పేందుకు ఈ డాక్యుమెంట్ నిదర్శనం' అంటూ గురువారం భారత విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తంచేయడం తెల్సిందే.

అది దురుద్దేశపూర్వక చార్జిషీట్

బీబీసీ డాక్యుమెంటరీపై మాజీ జడ్జీలు, ఉన్నతాధికారులుసహా 300 మందికిపైగా బ్యూరోక్రాట్లు మండిపడ్డారు. 'మోదీపై తప్పుడు ఉద్దేశంతో తయారుచేసిన అభియోగ పత్రమది. విభజించు – పాలించు విధానంతో భారతీయ హిందూ, ముస్లింలలో చిచ్చురేపిన బ్రిటన్ వైఖరికి ఇది చక్కని ఉదాహరణ' అని వారు వ్యాఖ్యానించారు. ఈ మేరకు రాజస్తాన్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ అనిల్ సింగ్, మాజీ 'రా' చీఫ్ సంజీవ్ త్రిపాఠి, మాజీ ఎన్ఐఏ డైరెక్టర్ యోగేశ్ చందర్, మాజీ హోం శాఖ కార్యదర్శి ఎల్‌సీ గోయల్, పలువురు మాజీ జడ్జీలు, దౌత్యవేత్తలుసహా 302 మంది సంతకాలతో ఒక సంయుక్త ప్రకటన వెలువడింది. మోదీదే బాధ్యత అంటూ ఆనాటి పోలీస్ అధికారులు ఆర్‌బీ శ్రీకుమార్, సంజీవ్ భట్, బీజేపీ నేత హరేన్ పాండ్యా చేసిన ఆరోపణలను సుప్రీం కోర్టు కొట్టేసిందని ప్రకటన గుర్తుచేసింది. వీరి పేర్లను బీబీసీ తన డాక్యుమెంట్‌లో పేర్కొనడం గమనార్హం.

నా ట్వీట్ తీసేశారు: డెరిక్ ఓబ్రియాన్

బీబీసీ డాక్యుమెంట్‌పై తాను చేసిన పోస్ట్‌ను ట్విట్టర్ తొలగించేసిందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరిక్ ఓబ్రియాన్ చెప్పారు. 'భారతీయ చట్టాలను ఉల్లంఘించినందుకే తొలగించాం' అంటూ ట్విట్టర్ మెయిల్ చేసింది. ఈ చర్య సెన్సార్ విధించడమే' అని ఓబ్రియాన్ మరో ట్వీట్‌చేశారు.



• ఇది నదే..!

నదుల గుండెకోతకు సజీవ సాక్ష్యమీ చిత్రం. బోస్నియా, సెర్బియా, మోంటెనిగ్రో దేశాల గుండా ప్రవహించే డ్రీనా నదిలోకి టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా కొట్టుకొచ్చాయి.

ఏడాది సెలవులు, ఇంట్లో ఆయాలు

జనాభాను పెంచేందుకు సిక్కింలో ప్రభుత్వోద్యోగినులకు వరాలు

గాంగ్‌టాక్: సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు సీఎం ప్రేమ్ సింగ్ తమంగ్ పలు ప్రోత్సాహకాలను ప్రకటించారు. వారి చిన్నారులకు ఇంటి వద్దే సహాయకులను ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. చిన్నారుల బాధ్యత తీసుకునే ఆయాలకు నెలకు రూ.10 వేలను ప్రభుత్వమే ఇస్తుందన్నారు. 40 ఏళ్లు, ఆపైన వయస్సుండే మహిళలకు చిన్నారులను ఏడాది వరకు చూసుకునే బాధ్యతలను అప్పగిస్తామన్నారు. మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవులను 365 రోజులకు, తండ్రులకైతే నెల రోజులు సెలవులు ఇస్తామని చెప్పారు. రెండో బిడ్డను పోషించేందుకు ఒక ఇంక్రిమెంట్, మూడో బిడ్డకైతే రెండు ఇంక్రిమెంట్లు ఇస్తామన్నారు. తరిగిపోతున్న జననాల రేటు చాలా ఆందోళన కలిగించే అంశమన్నారు. క్షీణిస్తున్న స్థానిక జాతుల జనాభాను పెంచేందుకు ప్రభుత్వం సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లులవ్వాలనుకునే ఉద్యోగినులు పుట్టబోయే తమ సంతానం బాగోగుల గురించి ఆందోళన చెందరాదనే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. జననాల రేటు పెంచేందుకు సాధారణ ప్రజానీకానికి కూడా ప్రోత్సాహకాలు ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు. సంతానం కలగడంలో ఇబ్బందులు ఎదురయ్యే వారి కోసం ఐవీఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో చికిత్స తీసుకునే వారికి రూ. 3 లక్షలు గ్రాంటుగా అందజేస్తామన్నారు. సిక్కింలోని 7 లక్షల లోపు జనాభాలో 80 శాతం మంది స్థానిక తెగల ప్రజలే. సంతానోత్పత్తి రేటు 1.1%గా ఉంది.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
ఆదివారం । 22 । జనవరి । 2023

ఎయిమ్స్ లోగోలో తమిళం తప్పనిసరి

సాక్షి, చెన్నై: మదురై ఎయిమ్స్ లోగోలో తమిళాన్ని తప్పనిసరిగా చేర్చాలని ఎంపీ మాణిక్ ఠాకూర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవ్యకు లేఖ రాశారు. ఇందులో మదురైలో ఏర్పాటు కానున్న ఎయిమ్స్ అంశాన్ని ప్రస్తావించారు. ఆలస్యంగా నైనా ఈ పనులు మొదలు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరితగతిన ఎయిమ్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే చెన్నైలో గత వారం జరిగిన ఎయిమ్స్ నిర్వాహక కమిటీ సమావేశంలో ఆస్పత్రికి సంబంధించిన లోగోను ఖరారు చేశారని వివరించారు. అయితే ఇందులో తమిళం కనిపించడం లేదని, మాతృభాషను తప్పనిసరిగా చేర్చాలని కోరారు. ఇందుకు సంబంధించి నిర్వాహక కమిటీకి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

న్యూస్‌రీల్

18 నెలల్లో 10 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- కేంద్ర మంత్రి ఎల్. మురుగన్



ఉద్యోగ ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి మురుగన్

కొరుక్కుపేట: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా ఉపాధి మేళా (రోజ్‌గార్ మేళా) ద్వారా కనీసం 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 1.47 లక్షల మందికి నియామక ఉత్తర్వులు అందాయని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. శుక్రవారం తిరుచ్చిలో రోజ్‌గార్ మేళా కింద ఉపాధి ఉత్తర్వులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, పీఎస్‌యూలు, స్వతంత్ర సంస్థల సహకారంతో 18 నెలల్లో 10 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కాబట్టి రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని గత ఏడాది అక్టోబర్‌లో ప్రారంభించామని యూపీఎస్సీ, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీల ద్వారా ఈ నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటి వరకు 1.47 లక్షల మందికి రెండు దశల్లో జాబ్ ఆర్డర్లు అందగా, మూడో దశలో ఇప్పటి వరకు 71,000 మందికి ఉత్తర్వులు అందాయని మురుగన్ అన్నారు. ఈ ఉపాధి మేళాను కేంద్ర ప్రభుత్వమే కాకుండా, ఎన్డీయే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖలో ఖాళీల భర్తీకి పరీక్షలు జరుగుతున్నాయని పేర్కొంటూ తమిళనాడు నుంచి ఎక్కువ మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ కాలుష్య నియంత్రణకు కార్యాచరణ

- అంతర్జాతీయ జింక్ అసోసియేషన్ సదస్సులో వక్తల ప్రకటన



ప్రసంగిస్తున్న రాహుల్ శర్మ, రాధాకృష్ణన్ తదితరులు

సాక్షి, చెన్నై: చెన్నై నగరంలో పర్యావరణ కాలుష్యం, నష్టాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు వ్యాఖ్యానించారు. వివరాలు.. శుక్రవారం సాయంత్రం అంతర్జాతీయ జింక్ అసోసియేషన్ నేతృత్వంలో వివిధ నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనలో తుప్పు ప్రభావం, ఈ కారణంగా ఎదురయ్యే వైఫల్యాలు, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం, తదితర అంశాలపై నాలెడ్జ్ సెషన్ జరిగింది. ఇందులో ఐఐటీ మద్రాసు నిపుణులు, జింక్ అసోసియేషన్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ శర్మ ప్రసంగిస్తూ, మౌలిక సదుపాయాల దీర్ఘాయువును నిర్ధారించేందుకు, ఆర్థిక, పర్యావరణ నష్టాలను కూడా తగ్గించే కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే తప్పు ప్రభావాన్ని తగ్గించేందుకు రక్షణ యంత్రాంగం అవశ్యమని స్పష్టం చేశారు. కొత్తగా నిర్మాణాల కోసం వచ్చే దరఖాస్తులు, స్మార్ట్ సిటీ అప్లికేషన్ల గురించి ఆయన వివరించారు. ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్ రాధాకృష్ణన్ జి. పిళ్లై మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రయత్నాలు, స్మార్ట్ సిటీ మిషన్ ప్రాజెక్టులు, భారీ నిర్మాణాలు, తీర ప్రాంతాల్లో జరిగే నిర్మాణాలు, అణు రక్షిత నిర్మాణాలు, ప్రమాదాల, మానవ జీవితాలు, మౌలిక సదుపాయాల వల్ల ఎదురయ్యే నష్టం, కాంక్రీట్, ఉక్కు వాడకం గురించి వివరించారు. సమావేశానికి తమిళనాడు ప్రజా పనుల శాఖ, చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, ఐఐటీ మద్రాసు, క్రెసెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధికారులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేశారు.

మీడియాతో మాట్లాడుతున్న పన్నీర్ సెల్వం



ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక రసవత్తర రాజకీయానికి వేదికగా మారింది. ప్రధానంగా అన్నాడీఎంకేలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తన బలాన్ని చాటుకునేందుకు ఈ ఎన్నికలను వేదికగా చేసుకోవాలని భావిస్తున్న పళణి స్వామి శిబిరాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా పన్నీరు సెల్వం శనివారం కీలక నిర్ణయం తీసుకున్నారు. తన శిబిరం తరపున కూడా అభ్యర్థి పోటీలో ఉంటారని ప్రకటించారు. అయితే బీజేపీ బరిలో ఉంటే మాత్రం వారికే మద్దతు ఇస్తామని తేల్చారు. ఇక డీఎంకే కూటమి తరపున కాంగ్రెస్ అభ్యర్థి రేసులో తాను లేనని ఈవీకేఎస్ ఇలంగోవన్ స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో కుమారుడు సంజయ్ పేరును ఆయన తెర మీదకు తేవడం గమనార్హం.

జాన్ పాండియన్‌ను కలిసిన పళణి స్వామి మద్దతుదారులు



రేసులో పన్నీరు శిబిరం

ఈరోడ్‌లో ఉపఎన్నికల వేడి

- బరిలో తమ అభ్యర్థి కూడా ఉంటారన్న మాజీ సీఎం పన్నీరు సెల్వం
- కాంగ్రెస్ తరపున పోటీలో లేనని ఈవీకేఎస్ స్పష్టీకరణ
- తెరపైకి తన రెండో కుమారుడు సంజయ్ పేరు
- అభ్యర్థి ఖరారు కాకుండానే ఎన్నికల ప్రచారానికి డీఎంకే శ్రీకారం
- భారతీయ జనతా పార్టీ నిర్ణయంపై ఉత్కంఠ



పెరియార్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డీఎంకే మంత్రి కేఎన్ నెహ్రూ

సాక్షి, చెన్నై: ఈరోడ్‌లో ఉప ఎన్నికల వేడి రాజుకుంది. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి తరపున కాంగ్రెస్, అన్నాడీఎంకే కూటమి తరపున తమిళ మానిల కాంగ్రెస్ అభ్యర్థులే మరోసారి పోటీలో ఉంటారని విశ్లేషకులు భావించారు. అయితే శుక్ర, శనివారం నాటి పరిణామాలు చకచకా మారిపోయాయి. తాము పోటీలో లేమని తమిళ మానిల కాంగ్రెస్ ప్రకటించడంతో పాటు తమ మద్దతు అన్నాడీఎంకేకు అని ఆ పార్టీ నేత వాసన్ స్పష్టం చేశారు. దీంతో అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి శిబిరం తరపున అభ్యర్థి పోటీలో ఉంటారనేది స్పష్టమైంది. ఈ ఎన్నికల ద్వారా రెండాకుల గుర్తును కైవసం చేసుకోవడమే కాకుండా, గెలుపుతో తన బలాన్ని చాటేందుకు పళణి వ్యూహాలకు పదును పెట్టారు. ఇందుకు క్లెం వేసే విధంగా ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శనివారం కీలక నిర్ణయం తీసుకున్నారు. మీడియాతో పన్నీరు సెల్వం మాట్లాడుతూ.. ఉప ఎన్నికల్లో అన్నాడీఎంకే తప్పకుండా పోటీ చేస్తుందని, తమ శిబిరం తరపున అభ్యర్థిని నిలబెట్టనున్నామని ప్రకటించారు. రెండాకుల గుర్తు మరోమారు సీజ్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, అవసరం అయితే పళణి స్వామి శిబిరంతో సంప్రదింపులకు రెడీ అని వ్యాఖ్యానించారు. ఒకవేళ బీజేపీ పోటీ చేస్తే తమ మద్దతు ఆ పార్టీ అభ్యర్థికి ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ ప్రకటన బీజేపీ వర్గాలను ఆలోచనలో పడేసింది. దీంతో ఈ ఎన్నికకు సంబంధించి పోటీ చేసే విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ముఖ్యనేతలతో సమావేశం కావడం గమనార్హం. పన్నీరు మద్దతును బీజేపీ సీనియర్ నేత పొన్ రాధాకృష్ణన్ ఆహ్వానిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. పళణి, పన్నీరు శిబిరం తనను కలిసి మద్దతు ప్రకటించినా, అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తేల్చి చెప్పినట్లు సమాచారం.

దూరంగా పీఎంకే..

ఉప ఎన్నికలకు దూరంగా ఉండాలని పీఎంకే నిర్ణయించింది. అన్నాడీఎంకే కూటమి నుంచి ఇటీవల బయటకు వచ్చిన పీఎంకే తాజా ఉప ఎన్నిక విషయంపై తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి రాందాసు, అధికార ప్రతినిధి బాలు మీడియాతో మాట్లాడుతూ, ఉప ఎన్నికల్లో తాము పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. అలాగే ఎవ్వరికీ మద్దతు కూడా ఇవ్వడం లేదని తేల్చి చెప్పారు.

తెరపైకి సంజయ్..

తనయుడు తిరుమగన్ ఈవేరా మరణంతో ఈరోడ్ తూర్పు నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఈసారి తానే స్వయంగా రంగంలోకి దిగేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇలంగోవన్ సిద్ధమైనట్లు మొదట్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. కానీ తాను బరిలో దిగబోవడం లేదని ఆయన కాంగ్రెస్ అధిష్టానానికి స్పష్టం చేశారు. అనారోగ్య సమస్యల కారణంగా తాను పోటీ నుంచి విరమించుకున్నట్లు పార్టీ అగ్రనాయకత్వానికి లేఖ కూడా పంపించారు. అదే సమయంలో ఎవరూ ఊహించని రీతిలో రెండో కుమారుడు సంజయ్‌ను రాజకీయ తెర మీదకు తెచ్చేందుకు ఈవీకేఎస్ సిద్ధమయ్యారు. టెక్స్‌టైల్స్ బిజినెస్‌లో ఉన్న సంజయ్‌ను ఉప ఎన్నికల్లో పోటీ చేయించేందుకు రంగం సిద్ధం చేసినట్లు కాంగ్రెస్‌లో ప్రస్తుతం చర్చ జరుగుతోంది. తనకు బదులు కుమారుడు సంజయ్‌కు సీటు ఇవ్వాలని ఏఐసీసీ అధిష్టానాన్ని ఈవీకేఎస్ విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అదే సమయంలో ఈరోడ్ జిల్లాలో కాంగ్రెస్‌కు కీలక నేతగా ఉన్న మక్కల్ జీ రాజన్ కూడా పోటీపై ఆశలు పెట్టుకున్నారు. అధిష్ఠానం అవకాశం ఇస్తే బరిలో దిగేందుకు సిద్ధమని కాంగ్రెస్ సీనియర్ల వద్ద ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎవరో ఖరారు కాకున్నా, డీఎంకే మాత్రం ఆ పార్టీకి మద్దతుగా ఎన్నికల ప్రచారానికి శనివారం శ్రీకారం చుట్టింది. ఆ పార్టీ సీనియర్ నేతలు, మంత్రులు ముత్తుస్వామి, కేఎన్ నెహ్రూ ఇంటింటా ప్రచారంతో ఓట్ల వేటలో నిమగ్నం కావడం గమనార్హం.

నేనంటే.. నేను..

అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి శిబిరం, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరం పోటా పోటీగా మిత్ర పక్షాల మద్దతు వేటలో ఉదయం నుంచి రాత్రి వరకు బిజీబిజీగా ఉన్నాయి. పళణి శిబిరం నేతలు జయకుమార్, సెంగోట్టయన్, దిండుగల్ శ్రీనివాసన్, ఎస్పీ వేలుమణి, తంగమణి ఉదయాన్నే తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం నేత జాన్ పాండియన్‌తో సమావేశమయ్యారు. తమ మద్దతు అన్నాడీఎంకేకు ఉంటుందని జాన్ పాండియన్ స్పష్టం చేశారు. అయితే ఏ శిబిరానికి అనే విషయాన్ని మాత్రం తేల్చలేదు. అనంతరం బీజేపీ అధ్యక్షుడు అన్నామలైతో పాటు పలువురు నేతలతో సంప్రదింపులు జరిగాయి. తానే మీ తక్కువ తిన్నానా? అన్నట్లుగా పన్నీరు సెల్వం సైతం తన మద్దతుదారులతో కలిసి జీకే వాసన్‌ను కలిశారు. అయితే తన నిర్ణయాన్ని శుక్రవారమే స్పష్టం చేసినట్లు వాసన్ పేర్కొనడం గమనార్హం. పన్నీరు సెల్వం సైతం బీజేపీ వర్గాలతో సంప్రదింపులు జరపడంతో అన్నాడీఎంకేలో రాజకీయం మరోమారు వేడెక్కింది. తాజా పరిణామాలపై పళణి శిబిరం నేత జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. పన్నీరు సెల్వం ఒంటరి అయ్యాడని, ఆయనతో సంప్రదింపులకు తాము సిద్ధంగా లేమని స్పష్టం చేశారు.

ఒడిశాతో క్రీడాశాఖ ఒప్పందం

సాక్షి, చెన్నై: ఒడిశా ప్రభుత్వంతో తమిళనాడు క్రీడల శాఖ శనివారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఇరు రాష్ట్రాల పరస్పర సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఒడిశాలో జరుగుతున్న హాకీ ప్రపంచ కప్ పోటీలను, స్టేడియం నిర్మాణాలను పరిశీలించాలని తమిళనాడు క్రీడాశాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ నిర్ణయించారు. ఈ మేరకు ఒడిశా రాష్ట్రంలో శుక్రవారం నుంచి ఆయన పర్యటిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఇరు రాష్ట్రాల క్రీడల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఒప్పందాలు జరిగాయి. పరస్పర క్రీడా సహకారం, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి ఈ ఒప్పందాలు జరిగాయి. అలాగే క్రీడా శిక్షణ కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పన తదితర అంశాలపై రెండు రాష్ట్రాలు దృష్టి పెట్టనున్నాయి. ఈ కార్యక్రమంలో హాకీ సంఘం అధ్యక్షుడు దిలీప్ డర్కీ, కార్యదర్శి మనోహర్, ఒడిశా క్రీడల మంత్రి వినీల్ కృష్ణ, నగరాభివృద్ధి శాఖ కార్యదర్శి మదివదనన్, తమిళనాడు యువజన, క్రీడల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, కార్తికేయన్ ఐఏఎస్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో మంత్రి ఉదయ నిధి స్టాలిన్, అధికారులు

మాధవరానికి కొత్త సొబగులు

- బస్ టెర్మినల్‌ను తనిఖీ చేసిన మంత్రి పీకే శేఖర్ బాబు
- ఏపీఎస్‌ఆర్‌టీసీ ఉద్యోగులకు అదనపు వసతులు
- ఫిబ్రవరి 14న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



మాధవరం బస్టాండ్‌లో మంత్రి శేఖర్‌బాబు పరిశీలన

సాక్షి, చెన్నై: చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ (సీఎండీఏ) నేతృత్వంలో మాధవరం బస్టాండ్‌ను మరింత అభివృద్ధి చేయనున్నామని ఆ కమిటీ చైర్మన్, మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. శనివారం ఆయన ఈ మేరకు బస్టాండ్‌లో తనిఖీలు చేశారు. కోయంబేడు బస్టాండ్‌లో రద్దీని తగ్గించే విధంగా చెన్నైకు ఉత్తర దిక్కులోని మాధవరంలో గత ప్రభుత్వ హయాంలో సబర్బన్ బస్ టెర్మినల్ రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఇక్కడి నుంచే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, విజయవాడ, ఆత్మకూరు, కడప వైపుగా వెళ్లే బస్సులు రోడ్డెక్కిస్తున్నారు. 8 ఎకరాల్లో రూ. 94 కోట్లతో అప్పట్లో ఈ బస్టాండ్ నిర్మించినా, ఇక్కడ వసతుల కొరత వెంటాడుతోంది. ఈ బస్టాండ్‌లో అభివృద్ధి అంతంత మాత్రమే. ఇక్కడి దుకాణ సముదాయాలన్నీ ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. ఇక్కడ వసతులు తక్కువగా ఉండడంతో పాటు ప్రయాణికుల రాక తగ్గుతుండడంతో ఈ బస్టాండ్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు సీఎండీఏ నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం ఇక్కడి వసతులు, చేపట్టాల్సిన పనుల గురించి మంత్రి, సీఎండీఏ చైర్మన్ శేఖర్‌బాబు పరిశీలించారు.

ఉత్తర తమిళనాడు వైపుగా..

మాధవరం బస్టాండ్ నుంచి రానున్న రోజుల్లో కోయంబత్తూరు సహా కొంగుమండలం, ఉత్తర తమిళనాడు వైపుగా బస్సులను నడపాలని నిర్ణయించారు. ఈ మేరకు బస్టాండ్‌ను పూర్తిగా ఉపయోగంలోకి తీసుకు రానున్నామని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రవాణా సంస్థ ఉద్యోగులు, సిబ్బందికి ఈ బస్టాండ్‌లో అదనపు వసతులు కల్పించేందుకు నిర్ణయించారు. పురుషులు, మహిళా ప్రయాణికుల కోసం వసతి గృహాలను 2, 4, 6 పడకలతో గదులను తీర్చిదిద్దనున్నారు. ప్రయాణికులు వేచి ఉండే గదుల్లో ప్రత్యేక కుర్చీలు, టీవీ ఏర్పాటుకు మంత్రి ఆదేశించారు. మొదటి అంతస్తులోని బస్ వెయిటింగ్ ఏరియాలో బస్సుల పార్కింగ్, ప్రధాన మార్గంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పోలీసులతో చర్చించి ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు, భవనాలకు సొబగులు, పరిసరాలను పచ్చదనంతో నింపే విధంగా ఉద్యానవనాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇదిలా ఉండగా చెన్నై దక్షిణ శివారు ప్రాంతమైన కీలాంబాక్కంలో రూ.400 కోట్లతో నిర్మిస్తున్న కొత్త బస్టాండును ఫిబ్రవరి 15వ తేదీన ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఆ పనులను వేగవంతం చేశారు.

పాలారు తీరంలో తర్పణ పూజలు

- పితృదేవతలకు పిండ ప్రదానం చేసిన జనం

వేలూరు: తమిళ తై అమావాస్యను పురస్కరించుకొని ప్రజలు పాలారు నదీ తీరంలో పితృదేవతలకు పెద్దఎత్తున తర్పణ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివరాలు.. వేలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో తమిళ తైమాస అమావాస్య సందర్భంగా పాలారు నది సమీపంలోని ముత్తు మండపం వద్దకు చేరుకొన్నారు. ఈ సందర్భంగా శివాచార్యులు పాలారు నది వద్దకు చేరుకొని తర్పణం, తిథిని సమర్పించారు. తిరుపత్తూరు, వాణియంబాడి, ఆర్కాడు, రాణిపేట, వాలాజ, ఆంబూరు వంటి ప్రాంతాల్లోని పాలారు నదీ తీరం వద్ద, తిరువణ్ణామలై జిల్లాలోని శ్మశాన వాటికల వద్ద జనం బారులుదీరారు.

కావేరి నదీ తీరంలో..

తిరువొత్తియూరు: తై అమావాస్యను పురస్కరించుకుని రామేశ్వరం, కన్యాకుమారి, తిరుచెందూరు సహా రాష్ట్రంలోని ముఖ్య పుణ్య క్షేత్రాల్లో ప్రజలు తమ పూర్వీకులకు తర్పణలు సమర్పించారు. తిరుచ్చి శ్రీరంగం ఆలయంలో కావేరి నదీ తీరంలో పలుచోట్ల పితృదేవాలకు పిండ ప్రదానం చేశారు. అలాగే ఈరోడ్, తిరుపూర్, నామక్కల్, చెన్నైలోని ట్రిప్లికేన్‌లోని పార్థసారథి ఆలయం వద్ద భక్తులు పెద్దఎత్తున తై అమావాస్య పూజలు చేశారు.



తిరువళ్లూరు: రత్నాంగి సేవలో వీరరాఘవ స్వామి

వీరరాఘవ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

తిరువళ్లూరు: తై అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వైద్య వీరరాఘవుని ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు శనివారం తరలి వచ్చారు. పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. పుష్కరిణిలో పాలు, బెల్లం చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రత్నాంగి సేవలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారిని దర్శించుకున్నారు. నాలుగు గంటల పాటు క్యూలలో వేచి ఉన్నారు. భక్తులు పోటెత్తడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆలయ ప్రాంగణంలో రోటరీ సంఘంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానంతో పాటు వైద్య శిబిరాలను నిర్వహించారు.



వేలూరు: షికారీలకు దుస్తులు అందజేసిన దాతలు

ధన్వంతరి ఆరోగ్యపీఠంలో..

వేలూరు: వాలాజలోని శ్రీ ధన్వంతరి ఆరోగ్య పీఠంలో తై అమావాస్యతో పాటు శని పెయర్చి మిరపకాయ యాగ పూజలను శనివారం పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం లోక క్షేమం కోరుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ధన్వంతరి పెరుమాల్‌కు పచ్చిబియ్యంతో అభిషేకం చేశారు. అదేవిధంగా అమావాస్య కావడంతో పీఠంలోని అధర్వణ భద్రకాళి ప్రత్యంగరా దేవికి 33 రకాల ద్రవ్యాలతో పాటు మహాయాగ పూజలు చేశారు. అనంతరం పీఠంలో ప్రతిష్ఠించిన శని భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ యాగ గుండంలో గుమ్మడి, చందనం, మిరప, పాలు, పెరుగు, పసుపు, కుంకుమ, పట్టు చీరలు, పుష్పాలు, నిమ్మకాయ, ఆకు వక్క వంటి వరసు తాంబూలం పెట్టి అమ్మవారికి అభిషేకం చేసి యాగ గుండంలో ఎండి మిరప కాయలను వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం షికారీలకు దుస్తులు అందజేసి అన్నదానం చేశారు.



వేలూరు: తర్పణ పూజలు చేస్తున్న భక్తులు

చెన్నై ఆదివారం । 22 । జనవరి । 2023 సాక్షి

క్లుప్తంగా

శ్రీరామచంద్ర వీసీగా ఉమా శేఖర్



కొరుక్కుపేట: శ్రీరామ చంద్ర ఉన్నత విద్య, పరిశోధనా సంస్థ (శ్రీహెర్) కొత్త వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ ఉమా శేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ వీసీగా పీవీ విజయ రాఘవన్ ఉన్నారు. మైక్రోబయాలజిస్ట్ అయిన ఈమె మెడికల్ కాలేజీకి అసోసియేట్ డీన్‌గా, లాబొరేటరీ సర్వీసెస్ డైరెక్టర్‌గా, మైక్రోబయాలజీ హెచ్‌ఓడీగా ఉమా సేవలు అందించారు. 100కి పైగా పరిశోధన ప్రచురణలను గావించారు. శ్రీహెర్ మొదటి వీసీ డాక్టర్ లలితా కామేశ్వరన్ తర్వాత ఉమా శేఖర్ రెండో మహిళా వైస్ చాన్స్‌లర్ కావడం విశేషం.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న విద్యావేత్త సుఖిశివం

తిరుత్తణి: విద్యతో పాటు క్రమశిక్షణ ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలైమామణి అవార్డు గ్రహీత, విద్యావేత్త సుఖిశివం అన్నారు. తిరుత్తణి దళపతి వినాయకం మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్న స్థాయికి చేరుకోవాలని సూచించారు. కళాశాల దశ విద్యార్థులకు కీలకమని.. ఇక్కడ నేర్చుకున్న పాఠాలు ఎదుగుదలలో పునాదాలు అవుతాయని అన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, ఓర్పు, పట్టుదల ఉంటేనే విజయం సాధించగలరని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ బాలాజీ, జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారి రామన్ పాల్గొన్నారు.

ఆర్కేపేట విద్యార్థిని ప్రతిభ



అభినయ

పళ్లిపట్టు: రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఆర్కేపేట మండలం అమ్మయార్‌కుప్పం ప్రభుత్వ విద్యార్థిని అభినయను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మండల, జిల్లా స్థాయిలో గ్రామీణ పాటల పోటీల్లో తొలి స్థానం సాధించగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. బాలికను పీటీఏ కమిటీ అధ్యక్షుడు సెంగుట్టువన్, ఉపాధ్యాయులు అభినందించారు.

కుంభాభిషేకానికి భారీ ఏర్పాట్లు

- హిందూ ధర్మాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు
- పళనిలో పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి శేఖర్ బాబు

కొరుక్కుపేట: పళని శ్రీదండాయుధపాణి స్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ కుంభాభిషేకం నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని హిందూ ధర్మాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు తెలిపారు. శనివారం ఆలయ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు కుంభాభిషేక ఘట్టాన్ని వీక్షించేందుకు 16 చోట్ల ఎల్‌ఈడీ టీవీలను ఉంచుతున్నట్లు తెలిపారు. తొలి సారిగా హెలికాప్టర్ నుంచి పువ్వులు, పుణ్యజలాలను అభిషేకించేందుకు అధికారులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 47 వేల మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో కుంబాభిషేకాన్ని వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

వారిలో 3 వేల మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయనున్నామని తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు 6 వేల వీఐపీ పాస్‌లను జారీ చేయాలని ప్రతిపాదించారన్నారు. కుంభాభిషేకాన్ని ఎక్కువ మంది వీక్షించడానికి వీలుగా యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాలను ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. బారికేడ్లు, ప్రత్యేక వాచ్ టవర్లు, పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైన వారికి ప్రథమ చికిత్స కోసం అంబులెన్స్‌లు, తాత్కాలిక వైద్య శిబిరాలను సిద్ధం చేయనున్నామని పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్ర పర్యాటక సంస్థ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతుందన్నారు. అలాగే భక్తులకు అన్నదానం చేసేందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చారని చెప్పారు. కుంభాభిషేకం అనంతరం రెండో రోప్‌కార్ ప్రాజెక్టును అధ్యయనం చేయనున్నామని తెలిపారు.

ఒలింపియన్‌లకు ఘన సత్కారం



మంజిమా కురియాకోస్‌ను సత్కరిస్తున్న ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్

కొరుక్కుపేట: ఒలింపియన్లు వాసుదేవన్ భాస్కరన్, మంజిమా కురియాకోస్‌లను ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ కుమార్ బజాజ్ ఘనంగా సత్కరించారు. శనివారం ఉదయం ఇండియన్ బ్యాంక్ కాసా వ్యాపార సమీకరణలో భాగంగా మెగా రోడ్ షో–వాకథాన్‌ను నిర్వహించారు. ఈ వాకథాన్‌ను ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేష్ కుమార్ బజాజ్ జెండా ఊపి ప్రారంభించారు. చెన్నై అన్నానగర్‌లోని రౌండ్‌టానా నుంచి జై గోపాల్ గరోడియా వివేకానంద విద్యాలయ వరకు వాక్ థాన్ సాగింది. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంకు అందిస్తున్న డిజిటల్ సేవలు, ఖాతాదారులకు వివిధ స్కీమ్‌ల గురించి వివరించారు. బ్యాంక్ కార్పొరేట్ కార్యాలయం, ఫీల్డ్ జనరల్ మేనేజర్ కార్యాలయం, జోనల్‌కు చెందిన సీనియర్ అధికారులతో సహా 350 మంది పాల్గొన్నారు.

హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్‌కు అవార్డు

కొరుక్కుపేట: చెన్నైకు చెందిన హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీకి ఉత్తమ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తిస్తూ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈ అవార్డును పౌర విమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా, అసోచామ్ నేషనల్ కౌన్సిల్ సివిల్ ఏవియేషన్ చైర్మన్ నారాయణరావు చేతుల మీదుగా హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు అందుకున్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

26న టాస్మాక్ ఉద్యోగుల సమావేశం

అన్నానగర్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో తమిళనాడు టాస్మాక్ వెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సు ఈ నెల 26న చెన్నై వానగరంలో నిర్వహించనున్నారు. ప్రభుత్వ పరిధిలోని టాస్మాక్ కార్పొరేషన్ రిటైల్ దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలపై ఇందులో చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నారు.

25న సీఎం సభకు చురుగ్గా పనులు



రోడ్డుకు రంగులు వేస్తున్న సిబ్బంది

తిరువళ్లూరు: డీఎంకే ఆధ్వర్యంలో జనవరి 25న జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి స్టాలిన్ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. తమిళ భాష పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన త్యాగధనులకు ఏటా రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు భారీ బహిరంగ సభను నిర్వహించి ఘన నివాళులు అర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా డీఎంకే ఆధ్వర్యంలో జనవరి 25న ప్రతి జిల్లాలోనూ బహిరంగ సభలు నిర్వహించి భాషా పరిరక్షణ త్యాగులకు నివాళి అర్పించాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. ఇందులో భాగంగానే తిరువళ్లూరులో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రసంగించనున్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తిరువళ్లూరుకు తొలిసారి వస్తున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయడానికి పార్టీ నేతలు, అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే సభ కోసం స్టేజీ నిర్మాణపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా అధికారులు సైతం ముఖ్యమంత్రి రాకకోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగింపు, సెంటర్ మీడియన్‌కు రంగులు వేసే ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్

తిరుత్తణి: తిరువలంగాడు యూనియన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ శనివారం పరిశీలించారు. యూనియన్‌లోని 42 గ్రామ పంచాయతీల్లో సంక్షేమ పథకాలు, గ్రామీణ రోడ్లు, పాఠశాలలను తనిఖీ చేశారు. తిరువలంగాడు, జకీర్‌మంగళం, పళయనూర్‌లో దుస్థితికి చేరుకున్న రోడ్ల పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతతో చేపట్టాలని అన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులతో మాట్లాడారు. వారికి పాఠాలు బోధించి ప్రశ్నలు వేశారు.

మహిళా సంరక్షణకు సైకిల్ యాత్ర

- వేలూరుకు చేరుకున్న మధ్యప్రదేశ్ యువతి



కలెక్టర్ కుమరవేల్ పాండియన్‌తో మాట్లాడుతున్న ఆశా పావ్య

వేలూరు: మహిళా సంరక్షణ కోసం మధ్యప్రదేశ్‌కు చెందిన యువతి 28 రాష్ట్రాలకు సైకిల్ యాత్ర చేస్తూ అవగాహన కల్పిస్తోంది. యాత్రలో భాగంగా వేలూరుకు వచ్చిన ఆమె కలెక్టర్ కుమరవేల్ పాండియన్‌ను కలిశారు. ఎంపీకి చెందిన ఆశా పావ్య(24) గత ఏడాది నవంబర్ ఒకటో తేదీ సైకిల్ యాత్రను ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా మొత్తం 28 రాష్ట్రాల్లో 25 వేల కిలో మీటర్ల దూరం సైకిల్ యాత్ర చేసి మహిళా సంరక్షణ, అభివృద్ధి కోసం అవగాహన కల్పించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో యాత్ర పూర్తి చేసుకుని తమిళనాడుకు వచ్చినట్లు తెలిపారు. తమిళనాడులోని కన్యాకుమారి నుంచి తెన్‌కాశి, కరూర్ మీదుగా శుక్రవారం సాయంత్రం వేలూరుకు వచ్చినట్లు చెప్పారు. ఇప్పటి వరకు మొత్తం 7,500 కిలో మీటర్ల దూరం ప్రయాణించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి ఢిల్లీ చేరుకుని తన యాత్రను ముగిస్తానన్నారు. వేలూరుకు వచ్చిన ఆమెను కలెక్టర్ కుమరవేల్ పాండియన్, సబ్ కలెక్టర్ పూంగొడి, ప్రత్యేక అధికారి విజయరాఘవన్, కలెక్టర్ కార్యాలయ మేనేజర్ బాలాజీ అభినందించారు.

మల్టీ ట్యాలెంటెడ్ కొరియోగ్రాఫర్

తమిళ సినిమా: నటన, కొరియోగ్రఫీ, దర్శకత్వం ఇలా పలు శాఖల్లో ప్రతిభ కలిగి ఉండడం అరుదైన విషయమే. ఇవన్నీ కలిగిన కళాకారుడు వినోద్ కుమార్. చెన్నైకి చెందిన ఈయన 15 ఏళ్ల వయసులోనే నటుడిగా, డాన్సర్‌గా సినీ రంగ ప్రవేశం చేశారు. భరతనాట్యం, క్లాసికల్ నృత్యంలో శిక్షణ పొందిన ఈయన నృత్య దర్శకుడు పాల్ రాజ్ వద్ద శిష్యరికం చేశారు. ఆ తర్వాత ప్రఖ్యాత నటి వెన్నిరా ఆడై నిర్మల వద్ద క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకుని ఆమెకు ప్రియ శిష్యుడు అయ్యారు. నటుడిగానూ కే బాలచందర్ దర్శకత్వంలో, ఇతర చిత్రాల్లో నటించి గుర్తింపు పొందారు. పలు సంస్థలు నిర్వహిస్తున్న డ్యాన్స్ కాంపిటీషన్‌లో పాల్గొనే కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా కలక్క పోవదు యార్ వంటి పలు టీవీ కార్యక్రమాలకు ఈయన నృత్య దర్శకత్వం వహించారు. ఏఆర్ రెహమాన్ సోదరి ఏఆర్. రేహినా నిర్వహిస్తున్న కల్చరల్ ప్రోగ్రామ్స్‌కు ఈయన నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఇప్పటికే 7 షార్ట్ ఫిలిమ్స్‌కు దర్శకత్వం వహించారు. తాను దర్శకత్వం వహించిన షార్ట్ ఫిలిమ్స్‌లో సోషల్ అవేర్నెస్ విషయాలే ఉంటాయి. త్వరలో నిర్మాతగా అవతారం ఎత్తి స్వీయ దర్శకత్వంలో చిత్రాలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీని గురించి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. నటుడిగా, నృత్య దర్శకుడిగా పలు చిత్రాలు చేస్తున్నానని, అయితే తన తల్లి పేరుతో ముల్‌లై ప్రొడక్షన్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సంస్థలో తొలి ప్రయత్నంగా ఒక థ్రిల్లర్ కథా చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన కథను తయారు చేస్తున్నట్లు, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా డ్యాన్స్ నేపథ్యంలో ఇప్పటి వరకు ఎవరూ చేయని కథ చిత్రాన్ని చేయాలనే కోరిక ఉందని చెప్పారు.



వెన్నిరా ఆడై నిర్మలతో వినోద్ కుమార్



దర్శకుడు కె.బాలచందర్‌తో..

కోలీవుడ్ టాక్స్

జీవీ, ఐశ్వర్య కాంబో ఫిక్స్



జీవీతో ఐశ్వర్య రాజేష్

తమిళ సినిమా: సంగీత దర్శకుడిగా, నటుడిగా రాణిస్తున్న నటుడు జీవీ ప్రకాష్ కుమార్. ఈయన హీరోయిజానికే కాకుండా కంటెంట్‌కు ప్రాముఖ్యతనిస్తూ చిత్రాలను చేస్తున్నారు. ఇక సంగీత దర్శకుడిగా తమిళంతో పాటు తెలుగులోనూ దూసుకుపోతున్నారు. త్వరలో నటి ఐశ్వర్య రాజేష్‌తో సినిమా చేయనున్నట్లు సమాచారం. తొలుత క్యారెక్టర్ ఆర్టిస్టుగా పరిచయమైన ఐశ్వర్య రాజేష్ తానేమిటో నిరూపించుకుని కథానాయకిగా ఎదిగారు. ప్రస్తుతం చేతినిండా చిత్రాలతో బిజీగా ఉన్నారు. హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రాలు చేస్తున్న అతి తక్కువ మంది నటీమణుల్లో ఈమె ఒకరు. కాగా జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ కలిసి నటించనున్న చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. శుక్రవారం చెన్నైలో జరిగిన ఫ్రూబే అనే షాపు ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్న జీవీ ప్రకాష్ కుమార్, నటి ఐశ్వర్య రాజేష్ తమ తాజా చిత్రానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

అపర్ణతో ఆటలా?



నటి అపర్ణ బాలమురళి

తమిళ సినిమా: అభిమానం శృతి మించితే మొదటికే మోసం వస్తుంది. ఇటీవల నటుడు అజిత్ అభిమానులు ఇద్దరు అత్యుత్సాహంతో ప్రాణాలను కోల్పోయారు. తాజాగా మరో అభిమాని భవిష్యత్తునే నాశనం చేసుకుంటున్నాడు. ఈ ఘటన కేరళలో జరిగింది. వివరాలు.. దక్షిణాదిలో కథానాయకిగా మంచి పేరు తెచ్చుకుంటున్న నటి అపర్ణ బాలమురళి. ఈ మలయాళీ కుట్టి 8 తూట్టాక్కల్ చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత కొన్ని చిత్రాలు నటించినా, సూర్యతో జతకట్టిన సూరరై పోట్రు చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అదేవిధంగా ఇటీవల అశోక్ సెల్వన్ సరసన నటించిన నిత్తం ఒరు వానం చిత్రంలోని నటనకు మంచి ప్రశంసలను అందుకుంది. ఇలా తమిళం, మలయాళం భాషల్లో నటిస్తున్న అపర్ణ బాల మురళి తాజాగా నటించిన తంగం అనే మలయాళ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో అపర్ణ బాలమురళి పాల్గొంటుంది. అలా ఇటీవల కేరళ రాష్ట్రం, ఎర్నాకులంలోని లా కళాశాలలో జరిగిన చిత్ర ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొంది. అప్పుడు ఆ కళాశాల విద్యార్థి ఒకరు నటి అపర్ణ బాలమురళికి పుష్పగుచ్ఛితో స్వాగతం పలికే క్రమంలో ఆమె భుజంపై చేయి వేశాడు. అతని ప్రవర్తనకు అపర్ణ బాలమురళి సిగ్గుతో పక్కకు జరిగింది. అనంతరం ఆ విద్యార్థి అనాగరిక చర్యకు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఆ విద్యార్థి మీరంటే చాలా అభిమానం అని, అలాంటి అత్యుత్సాహంతోనే అలా ప్రవర్తించినట్లు సంజాయిషీ ఇచ్చుకుని క్షమాపణ కోరాడు. అయినప్పటికీ ఆ లా కళాశాల నిర్వాహకులు కూడా జరిగిన ఘటనపై నటి అపర్ణ బాలమురళికి క్షమాపణలు చెప్పారు. అంతే కాకుండా ఆ విద్యార్థిపై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో అపర్ణతో ఆటలా? చేయి వేస్తే సస్పెండే అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కాగా నటి అపర్ణపై జరిగిన అనాగరిక చర్యను నటి మంజిమ మోహన్, మొదలగు పలువురు సినీ ప్రముఖులు తీవ్రంగా ఖండించారు.

నయన్ కంటే ముందుగానే..



నటి హన్సిక

తమిళ సినిమా: నటి నయనతార కంటే హన్సిక ముందంజలో ఉంది. హన్సికతో లేడీ సూపర్‌స్టార్ నయనతారతో పోలికనే ఊహించలేము. అలాంటిది ఈ కహానీ ఏంటీ అని అనుకుంటున్నారా? ఈ ముద్దగుమ్మలిద్దరూ క్రేజీ హీరోయిన్లే. ఇద్దరూ బాహుభాషా నటీమణులే. ఇద్దరూ ప్రేమ వ్యవహారంలో చేదు అనుభవాలను చవిచూసిన వాళ్లే. ఇంకా చెప్పాలంటే నయనతార, హన్సిక నటుడు శింబును ప్రేమించి విఫలం అయిన వాళ్లే. ఐయితే నయనతార స్టార్ ఇమేజ్ కాస్త ఎక్కువ అంతే. చివరికి ఇద్దరూ ప్రేమ వివాహాలతో సెటిల్ అయిన వాళ్లే. ఇద్దరి పెళ్లిళ్లు దామ్‌ధూమ్‌గానే జరిగాయి. ఆ పెళ్లిళ్లతో ఇద్దరు సొమ్ము చేసుకున్నారు. నయనతార విగ్నేశ్‌తో పెళ్లి తతంగం అంతా నెట్ ఫ్లిక్స్ ఓటీటీ సంస్థ పర్యవేక్షణలోనే జరిగింది. అదే విధంగా నటి హన్సిక సోహైల్ అనే ముంబాయికి చెందిన వ్యాపారవేత్తను ఇటీవలే పెళ్లి చేసుకుంది. ఆర్భాటంగా జరిగిన వీరి పెళ్లి తతంగాన్ని ఒక ప్రముఖ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని చెల్లించి ప్రసార హక్కులను పొందినట్లు ప్రచారం జరిగింది. అయితే వీరి పెళ్లి వీడియో ప్రసారం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నటి నయనతార పెళ్లి జరిగి ఏడు నెలలు పైగా అవుతోంది. అయితే ఇప్పటివరకు ఆ పెళ్లి వేడుక ఓటీటీలో ప్రసారం కాలేదు. ఎప్పుడు స్ట్రీమింగ్ అవుతుందో కూడా తెలియని పరిస్థితి. అలాంటిది ఈ మధ్యనే పెళ్లి చేసుకున్న హన్సిక పెళ్లి తంతు వీడియో త్వరలో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నటి హన్సిక ఒక వీడియో ద్వారా స్వయంగా వెల్లడించింది. అలా ఈ భామ నటి నయనతార కంటే ముందంజలో ఉండబోతోందన్నమాట.

గీత కార్మికుల ఇతివృత్తంతో 'నెడుమి'

తమిళ సినిమా: హరీశ్వర్ ప్రొడక్షన్ పతాకంపై వేల్ మురుగన్ నిర్మించిన చిత్రం నెడుమి. ప్రదీప్ సెల్వరాజ్, అభినయ హీరోహీరోయిన్లుగా నటించారు. రాజసిమ్మ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. నందా లక్ష్మణన్ దర్శకత్వం వహించారు. జాస్ జేపీ సంగీతం, విశ్వమది చాయాగ్రహణను అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చిత్ర యూనిట్ గురువారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్ నిర్వహించారు. ఈ చిత్రం కల్లు గీత కార్మికుల ఇతివృత్తంతో రూపొందించిన వైవిధ్యభరిత కథా చిత్రం అని దర్శకుడు నందా లక్ష్మణన్ తెలిపారు. పాండిచ్చేరికి చెందిన మిత్ర బృందం కలిసి తెరకెక్కించిన చిత్రం ఇదని చెప్పారు. కొత్తవాళ్లను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు నిర్మాత వేల్ మురుగన్ పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు పేరరసు మాట్లాడుతూ.. తాటిచెట్ల వల్ల పలు ఉపయోగాలు, లాభాలు ఉన్నాయన్నారు. తాటికల్లు మద్యం దుకాణాల్లో విక్రయించవచ్చని, ఆరోగ్యాన్ని బాధించే మద్యం కంటే శక్తినిచ్చే తాటికల్లు మేలని పేర్కొన్నారు. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో చిత్రం యూనిట్‌తో పాటు నటుడు పైలాన్ రంగనాథన్, దర్శకుడు కేబుల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ చిత్రాన్ని యాక్షన్ రియాక్షన్ సంస్థ విడుదల చేయనుంది.



నెడుమి చిత్ర ఆడియో ఆవిష్కరణ

'మనబడి'కి ఎమ్మెల్యేల నెల జీతం విరాళం

- సీఎం రూ. 5 లక్షల చెక్కు అందజేత
- మిత్రపక్షాల ఎమ్మెల్యేలు కూడా..
- దేవదాయ శాఖ పాఠశాలలు, కళాశాలల్లో సిబ్బందికి వేతనాల పెంపు



సీఎంకు చెక్కును అందజేస్తున్న మంత్రి అన్బిల్ మహేశ్, విప్ కోవై చెలియన్



వేతన పెంపు ఉత్తర్వులను అందజేస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బృహత్తర ప్రాజెక్టు నమ్మ స్కూల్ ఫౌండేషన్(మన స్కూల్)కు నెల జీతం విరాళంగా అందించేందుకు డీఎంకే ఎమ్మెల్యేలు మంత్రులు ముందుకు వచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం సీఎం స్టాలిన్‌కు అందజేశారు. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాలను విస్తృతం చేయడమే ధ్యేయంగా పలు కార్యక్రమాలు చేపట్టేందుకు మనబడి ఫౌండేషన్‌ను ఇటీవల సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఆయా పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, పలు సంస్థల అధిపతులు విరాళాలు ఇవ్వడం లేదా, ఆయా పాఠశాలలను దత్తత తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాము సైతం అంటూ డీఎంకే మంత్రులు, ఎమ్మెల్యేలు ముందుకు వచ్చారు. తమ నెల జీతాన్ని విరాళంగా మన బడికి శనివారం ప్రకటించారు. ఎమ్మెల్యేల నెల జీతం రూ. కోటి 29 లక్షల 15 వేలకు సంబంధించిన చెక్కును సీఎం స్టాలిన్‌కు విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్, ప్రభుత్వ విప్ కోవై చెలియన్ అందజేశారు. డీఎంకే ఎమ్మెల్యేలే కాకుండా, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి ఎమ్మెల్యే ఈశ్వరన్, మనిదనేయ మక్కల్ కట్చి ఎమ్మెల్యేలు జవహరుల్లా, అబ్దుల్ సమద్ తదితరులు తమ నెల జీతాన్ని అందజేశారు.

వేతనం పెంపు..

రాష్ట్ర దేవదాయ శాఖ నేతృత్వంలో కళాశాలలు, పాఠశాలల ఉన్న విషయం తెలిసిందే. కన్యాకుమారి, తెన్‌కాశి, దిండుగల్ తదితర ప్రాంతాలలో ఉన్న కళాశాలలు, పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనం పెంచుతూ సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంపు ఉత్తర్వులను సచివాలయంలో శనివారం అందజేశారు. ఇందులో 354 మంది తాత్కాలిక ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. ఈ పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.2.72 కోట్ల బారం పడ్డట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖమంత్రి శేఖర్‌బాబు, సీఎస్ ఇరై అన్బు, దేవదాయ శాఖ కార్యదర్శి చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఆలయాలను పరిరక్షించాలి

- బీజేపీ నిరసన

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని ఆలయాలను, ఆలయాల స్థలాలను పరిరక్షించాలని నినాదిస్తూ శనివారం చెన్నై వళ్లువర్ కోట్టంలో బీజేపీ నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. బీజేపీ ఆధ్యాత్మిక విభాగం నేతృత్వంలో జరిగిన దీక్షకు రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు నాచ్చియప్పన్ అధ్యక్షత వహించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, సీనియర్‌నేతలు హెచ్. రాజ, సీపీ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఆలయాలపై దేవదాయ శాఖ అజమాయిషీని ఖండించారు. నిర్వహణ అనేది దేవదాయ శాఖపరిధిలో ఉండ కూడదని డిమాండ్ చేశారు. లీజు పేరిట ఆలయ స్థలాలను దారాదత్తం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని నినాదించారు. ఏటా ఆలయాల ఆస్తుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆగమశాస్త్ర వ్యవహారాలలో ప్రభుత్వం జోక్యం ఉండకూడదని, ఆలయాలకు ట్రస్టీలుగా రాజకీయాలతో సంబంధం లేని వారినే నియమించాలని, పట్టుబడ్డ విగ్రహాలను ఆయా ఆలయాలకు అప్పగించి పునఃప్రతిష్ఠించాలని కోరారు.

క్లుప్తంగా

జల్లికట్టులో ఎద్దు పొడిచి యువకుడి మృతి



వెంకటేషన్ (ఫైల్)

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఉమరాబాద్ సమీపంలోని పుత్తూరు గ్రామానికి చెందిన గోపాల్ కుమారుడు వెంకటేశన్(25) షూ కంపెనీలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈనెల 17న వేలూరు జిల్లా లత్తేరి సమీపంలోని పనమడింగి గ్రామంలో జల్లికట్టు జరగడంతో చూసేందుకు స్నేహితులతో కలిసి వచ్చాడు. ఆ సమయంలో జల్లికట్టులో ఉన్న ఎద్దు అతివేగంగా వెంకటేశన్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్ ద్వారా వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గత రెండు రోజుల క్రితం చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. పనమడంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

అన్నానగర్: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చెన్నై కొళత్తూరులో జరిగింది. ఉమామహేశ్వరి నగర్‌కు చెందిన ఆషిక్ అహ్మద్ (40) ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. భార్య హాజీరా (34), పిల్లలు రబియాదుల్ బలియా (9), అస్మా (5) ఉన్నారు. ఆషిక్ అహ్మద్ శుక్రవారం రాత్రి పిల్లలను ట్యూషన్ నుంచి తీసుకుని ఇంటికి వెళ్లాడు. తలుపు లోపలి గడియ పెట్టి ఉంది. ఎన్నిసార్లు తట్టినా తలుపు తీయకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. అక్కడ హాజీరా ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఉండడంతో షాక్‌కు గురయ్యాడు. సమాచారం అందుకున్న రాజమంగళం పోలీసులు హాజీరా మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టగా.. హాజీరాకు 6 నెలలుగా నిద్ర సరిగ్గా పట్టడం లేదని, దీంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తేలింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కొలనులో మునిగి కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

అన్నానగర్: చెన్నైలోని పల్లికరనై నారాయణపురం ప్రాంతానికి చెందిన గౌతమ్ (29), చెన్నై కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం పని ముగించుకుని తనతో పాటు పనిచేస్తున్న స్నేహితులతో కలిసి మద్యంకొని పల్లికరనై కొలను వద్దకు వచ్చాడు. అందరూ మద్యం తాగారు. ఆ తర్వాత గౌతమ్ మాత్రమే కొలనులోకి స్నానానికి దిగాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. సమయం గడుస్తున్నా నీటిలో నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన సహోద్యోగులు పల్లికరణై పోలీస్ స్టేషన్‌కు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, వెలచ్చేరి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నీటిలో గల్లంతైన గౌతమ్ కోసం గాలించారు. గంట తర్వాత గౌతమ్ మృతదేహం బయటపడింది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుడు గౌతమ్‌కి ఆరు నెలల గర్భిణి అయిన భార్య, ఓ పిల్లవాడు ఉన్నారు.

రేపటి నుంచి సాహిత్య సదస్సు

కొరుక్కుపేట: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో సృజనాత్మక సాహిత్య సదస్సు(కవిత్వం, కథ) నిర్వహించనున్నారు. ఇందులో రిసోర్స్ పర్సన్‌గా ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర, కవి రచయిత యోగా గురువు విశ్వరి వాసిలి వసంత కుమార్, మధురై కామరాజు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు డా. జొన్నలగడ్డ వెంకటరమణ, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీతలు డా.పసునూరి రవీందర్, బోడా మెర్సీ మార్గరేట్, పల్లిపట్టు నాగరాజు పాల్గొననున్నారు. అలాగే పరిశీలకులుగా భువనచంద్ర, ఆచార్య విస్తాలి శంకరరావు, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు హాజరుకానున్నారు. కార్యక్రమంలో అనుభవజ్ఞులైన రచయితలు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని ప్రకటనలో శనివారం విస్తాలి శంకర రావు వెల్లడించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య

తిరువొత్తియూరు: కాంచీపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్యకు గురయ్యాడు. వివరాలు.. కాంచీపురం సమీపంలోని కోవిల్ వాక్కం నేతాజీ నగర్‌కు చెందిన పెరుమాళ్ నాయకర్ (70) వ్యవసాయంతో పాటు రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఇతని ద్వారా ఉత్తరమేరూర్ సమీపంలోని మరుదం ప్రాంతానికి చెందిన మదన్ కోవిల్‌వాక్కంలో నాలుగు నెలల క్రితం స్థలం కొన్నాడు. అక్కడ ఇల్లు కట్టుకోవడానికి మదన్ ఏర్పాట్లు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మదన్‌కు పెరుమాళ్ నాయకర్‌కు మధ్య ఓ విషయంలో గొడవలు జరిగాయి. పెరిమాల్ నాయకర్ తలపై మదన్ రాయితో దాడి చేయడంతో మృతి చెందాడు. మదన్ పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. గొడవలకు గల కారణం తెలియలేదు.

నకిలీ డాక్యుమెంట్లతో భూమి విక్రయం

- ఇద్దరి అరెస్టు



జీవ



ప్రతాప్

తిరువళ్లూరు: నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి రూ. 50 లక్షల విలువ చేసే భూమిని వేరే వ్యక్తులకు విక్రయించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు జిల్లా మాధవరానికి చెందిన పాసిల్ లియోనార్డ్ (84). ఇతనికి వేపంబట్టు ప్రాంతంలో సుమారు రూ. 50 లక్షల విలువైన 2400 చదరపు అడుగుల విస్తీర్ణంతో భూమి ఉంది. ఈ భూమిని చెన్నై ఐనావరానికి చెందిన రాజీ కుమారుడు ప్రతాప్(39), శాలీ గ్రామానికి చెందిన పెరియస్వామి కుమారుడు జీవ(44) నకిలీ డాక్యుమెంట్‌లను సృష్టించి చెన్నై మైలాపూర్‌కు చెందిన అంజలిదేవికి 2016లో విక్రయించారు. ఆలస్యంగా విషయాన్ని గ్రహించిన పాసిల్ లియోనార్డ్ ఆవడి కమిషనర్ సందీప్‌రాయ్‌రాథోడ్‌కు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని స్పెషల్ బ్రాంచీ పోలీసులను ఆయన ఆదేశించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. నకిలీ డాక్యుమెంట్‌లను సృష్టించి భూమిని విక్రయించినట్లు నిర్ధారణ కావడంతో ఇద్దరిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించడంతో పుళల్ జైలుకు తరలించారు.

వీసీకే నాయకుల ధర్నా



ప్రభుత్వ పాఠశాల బోర్డుపై అతికించిన పోస్టర్లు

వేలూరు: ప్రభుత్వ పాఠశాల బోర్డుపై హాస్య నటుడు సంతానం జన్మదినోత్సవ పోస్టర్‌లు అతికించడంపై వీసీకే కార్యకర్తలు పోస్టర్ కరిపించిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా నిర్వహించారు. వివరాలు.. వేలూరు సమీపంలోని అలిమేలు మంగాపురంలో ప్రభుత్వ ఆది ద్రావిడ పాఠశాల ఉంది. వీటిలో సుమారు 500 మంది విద్యార్థులు ఉన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి హాస్య నటుడు అభిమానులు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపే పోస్టర్‌ను పాఠశాల బోర్డుపై అతికించారు. గమనించిన స్థానికులు వీసీకే పార్టీ రెండవ డివిజన్ కార్యదర్శి రీగన్‌కు సమాచారం అందజేయడంతో వీసీకే కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 24న వేలూరు కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేస్తామన్నారు.

పరిహారంలో అన్యాయం జరిగితే ఊరుకోం



మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు షణ్ముగం, సమావేశానికి హాజరైన రైతులు

పళ్లిపట్టు: రైలు మార్గం వల్ల పంట పొలాలు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంలో న్యాయం చేయాలని పళ్లిపట్టు రైతులు కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని నగరి నుంచి తమిళనాడులోని దిండివనం వరకు 120 కిలోమీటర్ల దూరం మీటర్ గేజ్ రైలు మార్గం పనులకు 15 ఏళ్ల కిందట శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం చేయడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రైలు మార్గంలో పొలాలు స్వాధీనంలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రధానంగా పళ్లిపట్టు, ఆర్కేపేట ప్రాంతాల్లో మూడు పంటలు సాగు చేసే పొలాలు రైలు మార్గానికి కావాల్సి రావడంతో రైతులు పొలాలు ఇచ్చేందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న రైతులు సైతం నష్టపరిహారం చాలా తక్కువగా ఉన్నట్లు ఆరోపిస్తూ నిరసన తెలుపుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని అత్తిమాంజేరిపేటలో శనివారం తమిళనాడు రైతు సంఘం ఆధ్వర్యంలో పొలాలు కోల్పోతున్న రైతుల సమావేశం నిర్వహించారు. జిల్లా రైతు సంఘం కోశాధికారి పెరుమాళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పళ్లిపట్టు, ఆర్కేపేట మండలాల నుంచి 200కు పైగా రైతులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు షణ్ముగం ప్రసంగించారు. పంటలు సాగుచేసే పొలాలను ఇస్తే రైతులు జీవితాలు ఏమి కావాలని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ మార్గం అన్వేషించాలన్నారు. తప్పనిసరిగా భూములు కావాలనుకుంటే నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 6వ తేదీ తిరువళ్లూరు కలెక్టర్‌ను కలిసేందుకు తీర్మానించారు. రైతు సంఘం నాయకులు తులసినారాయణన్, సంపత్, జయచంద్రన్, కుప్పన్, నందకుమార్, జ్యోతిప్రకాష్ పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్ట్

- కారు, ద్విచక్ర వాహనం సీజ్

తిరువళ్లూరు: రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసి రూ.5 లక్షలు డిమాండ్ చేసిన వ్యవహారంలో బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్‌నకు గురైన వ్యక్తిని సురక్షితంగా రక్షించి బంధువులకు అప్పగించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా అంబత్తూరు ఐసీఎఫ్ కాలనీకి చెందిన జయరామన్(31) చెన్నై చింతాద్రిపేటకు చెందిన నిత్యానందం కుమారుడు దివాకర్‌కు మధ్య వ్యాపార సంబంధిత గొడవలు ఉన్నాయి. శుక్రవారం కారులో వచ్చిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జయరామన్‌ను కిడ్నాప్ చేశారు. అతడి భార్య శివరంజినికి ఫోన్ చేసి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆందోళన చెందిన ఆమె ఆవడి కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్, అంబత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి జయరామన్‌ను కిడ్నాప్ చేసిన దివాకర్(40), అతడి తమ్ముడు దేవరాజ్(38), పొన్నేరి పంజెట్టికి చెందిన హేమనాథన్(41), బాలాజీ(38), అయ్యపాక్కానికి చెందిన స్టీఫెన్‌రాజ్(36) అత్తిపట్టుకు చెందిన దినేష్‌కుమార్(23) లను అరెస్టు చేశారు. వీరి నుంచి కారు, ద్విచక్ర వాహనాన్ని సైతం సీజ్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

బాలికకు లైంగిక వేధింపులు

- ముగ్గురికి 34 ఏళ్ల జైలు శిక్ష

అన్నానగర్: బాలికను లైంగికంగా వేధించిన కేసులో 'పోక్సో' ప్రత్యేక న్యాయస్థానం శనివారం ముగ్గురికి 34 ఏళ్ల జైలు శిక్ష విధించింది. శివగంగై జిల్లా తిరుప్పంచెట్టి కామరాజ్ కాలనీకి చెందిన కన్నన్ కుమారుడు రాజా(21), రామలింగం కుమారుడు మదిమారన్(20), అన్బరసన్ కుమారుడు అయ్యంగలై(23) 2021లో తిరుప్పంచెట్టిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి రోడ్డుపై ఆడుకుంటున్న ఐదేళ్ల బాలికను కిడ్నాప్ చేశారు. అక్కడి కమ్యూనిటీ సెంటర్‌లోని అంతస్తులో బాలికను లైంగికంగా వేధించారు. బాలిక బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మానా మదురై మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. శివగంగై పోక్సో ప్రత్యేక కోర్టులో జస్టిస్ శరత్ రాజ్ ముందు కేసు విచారణ జరిగింది. ఈ కేసులో శనివారం తీర్పు వెలువరించిన న్యాయమూర్తి బాలికను కిడ్నాప్ చేసిన ముగ్గురికి ఏడేళ్ల జైలు, ఉమ్మడి లైంగిక వేధింపులకు ఏడేళ్ల జైలు, అత్యాచారానికి పాల్పడిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్షతో మొత్తం 34 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఏకకాలంలో అనుభవించాలని ఆదేశించారు. అలాగే ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారు. బాలికకు తమిళనాడు ప్రభుత్వం తరఫున రూ. 7 లక్షలు పరిహారం అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలికపై లైంగికదాడి

- యువకుడికి 25 ఏళ్ల జైలు శిక్ష

తిరువొత్తియూరు: అరియలూరు జిల్లాలో బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడికి అరియలూరు మహిళా కోర్టు 25 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు.. అరియలూరు జిల్లా తిరుమానూర్, కరైవెట్టి పరనూర్ సౌత్ వీధికి చెందిన అన్బళగన్ కుమారుడు శక్తివేల్ (20). ఇతను గత 2020 జూలై నెలలో తాను ప్రేమిస్తున్న 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక దాడి చేశాడు. దీంతో విద్యార్థిని గర్భిణి అయ్యింది. దీనిపై విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరియలూర్ మహిళా పోలీసులు శక్తివేల్‌ను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో అరియలూరు మహిళా కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం జరిగిన తుది విచారణ తరువాత న్యాయమూర్తి ఆనందన్ నిందితుడు శక్తివేల్‌కు 25 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నకిలీ నోట్లు ముద్రిస్తున్న ముగ్గురి అరెస్టు

అన్నానగర్: ఆర్.ఎస్.మంగళం సమీపంలో నకిలీ నోట్లను ముద్రించి చెలామణి చేస్తున్న ముగ్గురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఓ మిషన్, నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రామనాథపురం జిల్లా ఆర్.ఎస్.మంగళం సమీపంలోని ఎ.మనకుడి ప్రాంతంలో నకిలీ నోట్లతో ఓ వ్యక్తి సంచరిస్తున్నట్లు శనివారం తిరుప్పాలైకుడి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గుర్తించి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకుని అతడి ఇంట్లో తనిఖీలు చేశారు. రూ.లక్ష విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. సహకరించి మరో ఇద్దరిని కూడా అరెస్టు చేశారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

అన్నానగర్: అంబత్తూరులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. విజయలక్ష్మీ పురానికి చెందిన కల్యాణి (30), మొగప్పేర్‌కు చెందిన రాజేష్ (40) కేరళ, కర్ణాటక, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన యువతులను కొరటూరులోని ఓ ఇంట్లో నిర్బంధించి వ్యభిచారం చేయించారు. సమాచారం అందుకున్న ఆవడి పోలీస్ కమిషనర్ దాడి చేశారు. కల్యాణి, రాజేష్‌లను అరెస్టు చేశారు. ఇద్దరు యువతులను రక్షించి ప్రభుత్వ మహిళా ఆశ్రమంలో చేర్పించారు. నిందితులు ఇప్పటికే రెండుసార్లు వ్యభిచారం కేసుల్లో పట్టుబడినట్లు గుర్తించారు. కల్యాణినిపై గూండా చట్టం ప్రయోగించాలని ఆవడి మున్సిపల్ పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ శనివారం ఆదేశించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

తిరువొత్తియూరు: తిరుమంగళంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నై తిరుమంగళం మెట్రో రైలు వెనుక భాగంలో బహుళ అంతస్తుల భవనం ఉంది. ఇక్కడ సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం మేరకు అన్నానగర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో లలిత (65) అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స కోసం కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొని స్కూటరిస్టు మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: బంధువు ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చి తిరిగి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తిరువెన్నైనల్లూరులో జరిగింది. వివరాలు.. కడలూరు జిల్లా బన్‌రుట్టి సమీపంలోని సిరు గ్రామానికి చెందిన వడివేలు కుమారుడు పురుషోత్తమన్ (26), స్నేహితులు పెరుమాల్ (25), విజయ రాజు (25)తో కలిసి బైక్‌పై విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూరులో బంధువు ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అరసూర్ బన్‌రుట్టీ రోడ్డులో వస్తుండగా బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా పురుషోత్తమన్ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. తిరువెన్నైనల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రసవ సమయంలో తల్లీ, బిడ్డ మృతి



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న మల్లిక బంధువులు

అన్నానగర్: కల్వరాయన్‌మలై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవ సమయంలో తల్లీ, బిడ్డ మృతి చెందారు. నర్సులు ప్రసవం చేయడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని శనివారం బంధువులు రోడ్డుపై నిరసనకు దిగారు. వివరాలు.. కళ్లకురిచ్చి జిల్లా కల్వరాయ్ మలై గిరిపిల్లి గ్రామానికి చెందిన భాగ్యరాజ్ (28) కార్మికుడు. ఇతని భార్య మల్లిక (24). వీరికి వివాహమై ఏడాది అయ్యింది. వివాహానంతరం భాగ్యరాజ్ ఆలనూరులోని మామగారి ఇంట్లో ఉంటున్నాడు. ఈ స్థితిలో నిండు గర్భిణి అయిన మల్లికకు శుక్రవారం ప్రసవం నొప్పులు వచ్చాయి. ఆ తర్వాత ప్రసవం కోసం బంధువులు కల్వరాయన్ మలై చేరన్ పట్టి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రాత్రి చేర్పించారు. ఆ సమయంలో అక్కడ వైద్యులు లేరని చెబుతున్నారు. ఆ తర్వాత రాత్రి 10 గంటల ప్రాంతంలో మల్లిక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన కొద్ది నిమిషాలకే పాప మృతి చెందింది. తర్వాత రక్తస్రావం ఎక్కువ కావడంతో మల్లిక కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. దీంతో మల్లిక బంధువులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని తల్లీ బిడ్డల మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. శనివారం రోడ్డుపై బైఠాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో నర్సులు ప్రసవం చేయడం వల్లే తల్లీ, బిడ్డ చనిపోయారని ఆరోపించారు. ఆందోళన కారణంగా అక్కడ ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న కల్వరాయన్‌మలై పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు.

సెంజిలో విషాదం

- వరకట్న వేధింపులు తాళలేక..
- బిడ్డతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య
- భర్త అరెస్టు



తల్లి ఫిర్దోస్, చిన్నారి హయాన (ఫైల్)

అన్నానగర్: వరకట్న వేధింపులు తాళలేక బిడ్డతో కలిసి తల్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన శుక్రవారం సెంజీలో జరిగింది. వివరాలు.. విల్లుపురం జిల్లా సెంజి సమీపంలోని కడకల్ తోపుకు చెందిన లాలూ బాషా కుమార్తె ఫిర్దోస్ (22)కు తిరువణ్ణామలై జిల్లా కిలిపెన్నత్తూరుకు చెందిన అబ్దుల్లా(25)తో గతేడాది ఫిబ్రవరి 14న వివాహం జరిగింది. తిరువణ్ణామలైలోని ఓ దుకాణంలో అబ్దుల్లా పనిచేస్తున్నాడు. ఫిర్దోస్ గర్భం దాల్చడంతో ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. 50 రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాపకు హయాన అని పేరు పెట్టారు. ఈ నెల 2వ తేదీ బిడ్డతో కలిసి ఆవూరులోని భర్త ఇంటికి వెళ్లింది. అనంతరం ఈ నెల 17న తల్లి ఇంటికి తిరిగి వచ్చింది. శుక్రవారం సాయంత్రం ఫిర్దోస్, చిన్నారి కనిపించకుండాపోయారు. తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. రాత్రి 10 గంటలకు వ్యవసాయ బావిలో చిన్నారి శవమై తేలడాన్ని ఆ ప్రాంత వాసులు గుర్తించి ఫిర్దోస్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. సెంజి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రియదర్శిని, ఇన్‌స్పెక్టర్ తంగం, సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర సుబ్రమణ్యం, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అబ్దుల్లా వరకట్నం తేవాలని వేధించేవాడని తెలిసింది. వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి అబ్దుల్లాని అరెస్టు చేశారు.

ఆర్కాడుకుప్పంలో వరుస చోరీలు



చెల్లాచెదురుగా పడివున్న వస్తువులు

తిరుత్తణి: ఆర్కాడుకుప్పంలో శుక్రవారం రాత్రి ఐదు ఇళ్లలో చోరీలు జరిగాయి. కనకమ్మసత్రం సమీపంలోని ఆర్కాడుకుప్పానికి చెందిన బాలకృష్ణారెడ్డి రిటైర్డ్ బ్యాంకు మేనేజర్. అతని చెల్లెలు గీతాలక్ష్మి చెన్నైలో నివాసం ఉంటున్నారు. గ్రామంలోని ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవారు. ఇళ్లు మూసి ఉండడాన్ని పసిగట్టిన దుండగులు శుక్రవారం రాత్రి వారి ఇంట్లో ప్రవేశించి బీరువా పగులగొట్టి రూ. 50 వేల నగదు చోరీ చేశారు. పక్కనే రవి ఇంట్లో రూ. 10 వేలు దోచుకెళ్లారు. రాజేంద్రన్, భూపతి, మరో ఇంట్లో సైతం చోరీకి యత్నించారు. కుక్కలు మొరగడంతో దుండగులు పరారయ్యారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలిముద్ర నిపుణులు ఇళ్లలో ఆధారాలు సేకరించారు. అయితే పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు దుండగులు చేతులకు గ్లౌజులు వేసుకున్నట్లు గుర్తించారు. కనకమ్మసత్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్‌కు తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లా తారాపురంలో ప్రైవేట్ బస్సు కండక్టర్ ఫుట్‌బోర్డుపై నిలబడి టిక్కెట్ ఇస్తున్న సమయంలో అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈరోడ్–పళనికి వెళ్లే ప్రైవేటు బస్సు కండక్టర్‌గా ఈరోడ్‌కు చెందిన యువరాజు, డ్రైవర్‌గా మనోహరన్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఈరోడ్ నుంచి తారాపురం వచ్చిన బస్సులో ప్రయాణికులు ఎక్కారు. తరువాత బస్ పెరియకడై వద్ద వెళుతోంది. కండక్టర్ యువరాజు బస్సు ముందు భాగంలో ఉన్న ఫుడ్ బోర్డుపై నిలబడి ప్రయాణికుల వద్ద టికెట్ తీస్తున్నాడు. అదుపుతప్పి బస్సు నుంచి కింద పడ్డాడు. దీంతో అతనిపై బస్సు చక్రం ఎక్కి దిగింది. ప్రయాణికులు కేకలు వేయడంతో బస్సును నిలిపి తీవ్రంగా గాయపడిన యువరాజును తారాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తారాపురం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గుండాల కోనలో భారతీయుడు-2



సినిమా షూటింగ్‌లో పాల్గొన్న స్థానిక పిల్లలు

రామచంద్రాపురం: మండలంలోని పీవీపురం గుండాల అటవీ ప్రాంతంలో శనివారం కమల్‌హాసన్, కాజల్ అగర్వాల్ నటిస్తున్న భారతీయుడు–2 సినిమా షూటింగ్ చేపట్టారు. దర్శకుడు శంకర్ ఆధ్వర్యంలో పూర్వీకుల జీవనశైలి, కట్టుబాట్ల సన్నివేశాలను చిత్రీకరించారు. ఇందులో స్థానికులు కొండ ప్రాంత ప్రజల్లాగా నటించారు. షూటింగ్‌ను చూడటానికి పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చారు.


ఎన్టీఆర్ జిల్లా తెల్లదేవరపల్లిలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి


అనంతపురం జిల్లా శీగలపల్లిలో ఓ వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

గడప గడపకు మన ప్రభుత్వం


ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్


చిత్తూరు జిల్లా చార్వకాల్వలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి

జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డుల జారీ

సాక్షి, అమరావతి: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ సెషన్-1 పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. ఈనెల 24వ తేదీ నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. తొలిరోజు పరీక్షకు సంబంధించిన అభ్యర్థుల అడ్మిట్‌కార్డులను విడుదల చేసినట్లు ఎన్టీఏ పేర్కొంది. 25వ తేదీనాటి పరీక్షకు సంబంధించిన అభ్యర్థుల అడ్మిట్ కార్డులను ఆదివారం విడుదల చేస్తామని తెలిపింది. ఇదే మాదిరిగా ఆయా తేదీల్లో పరీక్షలు రాయాల్సిన వారి అడ్మిట్‌కార్డులను వరుసగా విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఫొటోలు స్పష్టత లేకుండా బ్లర్‌గా ఉన్న వారి అడ్మిట్‌కార్డులు విడుదల చేయలేదని వివరించింది.

ఏపీ వర్సిటీల నాన్ టీచింగ్ స్టాఫ్ సంఘం అధ్యక్షుడిగా వెంకటప్పారెడ్డి


వై.వెంకటప్పారెడ్డిని అభినందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సాక్షి, అమరావతి/ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటప్పారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు నాగార్జున వర్సిటీలో అసోసియేషన్ నూతన ఎన్నిక శనివారం జరిగింది. రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల నుంచి ఆయా వర్సిటీల అసోసియేషన్, యూనియన్ నాయకులు ప్రతినిధులుగా హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా అగ్రికల్చర్ వర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు వ్యవహరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా యేటిగడ్డ వెంకటప్పారెడ్డి (ఆచార్య నాగార్జున వర్సిటీ), ప్రధాన కార్యదర్శిగా టి.సురేంద్రబాబు (రాయలసీమ వర్సిటీ), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.ఎల్.కుమార్ రెడ్డి, (ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ వర్సిటీ), కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.గౌతమ్ నాయుడు (నన్నయ వర్సిటీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పసిడి పరుగులు

పసిడి ధర పరుగులు తీస్తోంది. సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎగబాకుతోంది. కొన్నాళ్లుగా ధర పెరగడమే తప్ప తగ్గడం లేదు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో నెలన్నర క్రితం డిసెంబర్ 5న 24 కేరెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.55,350 ఉంది. ప్రస్తుతం రూ.58,770కు చేరింది. అంటే 45 రోజుల్లో రూ.మూడున్నర వేలు పెరిగింది. ఇక 22 కేరెట్ల పుత్తడి రూ.54,040కి చేరుకుంది. నగల దుకాణాల్లో ఆభరణాలపై తరుగు, మజూరీ పేరిట 10 నుంచి 23 శాతం వరకు కొనుగోలుదారుడి నుంచి అదనంగా వసూలు చేస్తారు. ఈ లెక్కన సగటున 15 శాతం వీటికి చెల్లిస్తే పది గ్రాముల బంగారు నగకు రూ.68 వేలు అవుతోంది. దీనికి జీఎస్టీ అదనం. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో బంగారాన్ని తులం (11.66 గ్రాములు) లెక్కల్లో కొనుగోలు చేస్తారు. ఆ లెక్కన చూస్తే తులం ముడి బంగారం ధర రూ.68,625 అవుతుంది. అదే తులం ఆభరణాల ధర రూ.79 వేల వరకు ఉంటుంది.

-సాక్షి, విశాఖపట్నం

రికార్డు దిశగా బంగారం ధర



ఇవీ కారణాలు..

బంగారాన్ని ఆభరణాలకే కాకుండా ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీలోనూ వినియోగిస్తారు. ప్రస్తుతం కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కూడా ఊపందుకుంది. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధానికి ఆర్థిక మాంద్యం కూడా తోడైంది. అంతర్జాతీయంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ తగ్గడం, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల ప్రభావం, షేర్ మార్కెట్లో అనిశ్చితి వంటివి పసిడి ధర ఎగబాకడానికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

50 ఏళ్లలో 10 గ్రాముల పసిడి ధర ఇలా

సంవత్సరం	ధర(రూ.లలో)
1970	184
1975	520
1980	1,300
1985	2,000
1990	3,200
1995	4,650
2000	4,400
2005	7,000
2010	18,000
2015	26,343
2020	48,650
2021	48,720
2022	52,670
2023(ప్రస్తుతం)	58,770

ఆల్‌టైం హై దిశగా..

2020 ఆగస్టులో 24 కేరెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.59,300కు చేరుకుంది. పుత్తడి చరిత్రలో అదే ఆల్‌టైం రికార్డు. ఇప్పుడు మళ్లీ ఆ రికార్డును దాటుకొని సరికొత్త రికార్డు దిశగా బంగారం పరుగులు తీస్తోంది. ప్రస్తుతం ధర పెరుగుతున్న వేగం, అంతర్జాతీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని వర్తకులు అంచనా వేస్తున్నారు.

తగ్గుతున్న కొనుగోళ్లు

బంగారం ధర పెరుగుదల ఆభరణాల కొనుగోళ్లపై ప్రభావం చూపుతోంది. కొన్నాళ్లుగా పసిడి ధర పెరుగుతుండడం వల్ల అమ్మకాలు పడిపోయాయని ది బెజవాడ జ్యూయలరీ అండ్ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరి సత్యనారాయణ 'సాక్షి'తో చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ఔన్స్ (30 గ్రాములు) ధర 1910 నుంచి 1931 డాలర్లకు పెరిగిందన్నారు. ఇది 1870 డాలర్లకు దిగివస్తే బంగారం ధర తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్థిక మాంద్యం, డాలరుతో రూపాయి మారకం విలువ తగ్గడం వంటివి బంగారం ధర పెరగడానికి దోహదపడుతున్నాయని విశాఖ గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మారోజు శ్రీనివాసరావు చెప్పారు.

పెళ్లిళ్ల సీజను వేళ పెను భారం..



ఈనెల 25 తర్వాత నుంచి పెళ్లిళ్ల సీజను ప్రారంభమవుతుంది. పెళ్లింట బంగారం కొనుగోలు తప్పనిసరి. పేద, మధ్య తరగతి వారు కనీసం 40 - 50 గ్రాములైనా కొనాలి. ఈ స్వల్ప మొత్తానికే రూ.3 లక్షల వరకు ఖర్చు చేయాలి. ఇలా ఆకాశాన్నంటుతున్న పసిడి ధర తమకు పెనుభారం అవుతుందని మధ్య తరగతి వారు చెబుతున్నారు.

రైతుల ప్రయోజనాల కోసమే
స్మార్ట్ మీటర్లు

- ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి
- గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్
- వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్
- ఇంధన శాఖ జాయింట్ సెక్రటరీ కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: రైతుల ప్రయోజనాల కోసమే వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా, వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించడానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పింది. 2023-24 సంవత్సరానికి డిస్కంలు సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల ప్రతిపాదనపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చేపట్టిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రకటించింది. ఇంధన శాఖ జాయింట్ సెక్రటరీ బీఏవీపీ కుమార్ రెడ్డి ఈ ప్రకటనను చదివి వినిపించారు. విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ప్రధాన వేదికగా ఈ నెల 19న ప్రారంభమైన ప్రజాభిప్రాయ సేకరణ శనివారం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 75 సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుంచి వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 71 మంది అభిప్రాయాలను, అభ్యంతరాలను మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి, సభ్యులు పి.రాజగోపాల్ రెడ్డి, ఠాకూర్ రాంసింగ్‌లకు తెలిపారు. వాటికి డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మజనార్దనరెడ్డిలు సమాధానమిచ్చారు. చివరి రోజు విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనను కుమార్‌రెడ్డి చదివారు. రూ. 84,183 కోట్లకు పైగా స్థిర చార్జీ అప్పులు, రూ.29,928 కోట్లకు పైగా నష్టాలు, ఇతర సవాళ్లతో రాష్ట్ర విద్యుత్ సంస్థలు సతమతమవుతున్నాయని అన్నారు. విద్యుత్ చార్జీలపై ఏపీఈఆర్‌సీ తీసుకునే పారదర్శక నిర్ణయానికి విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి, వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలుపుతుందని వెల్లడించారు.

స్మార్ట్ మీటర్ల ఖర్చు ప్రభుత్వానిదే

వ్యవసాయ వినియోగదారులకు అందించే విద్యుత్ లోడ్‌ను తెలుసుకోవడానికి, 9 గంటలు విద్యుత్ అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి, విద్యుత్ పంపిణీ సంస్థలు రైతులకు జవాబుదారీగా నిలవడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకుందని కుమార్ రెడ్డి తెలిపారు. ఈ పథకాన్ని తొలుత శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించి పూర్తి చేశామని, మిగిలిన జిల్లాల్లోనూ ప్రారంభిస్తామని, దీనికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. విద్యుత్ నష్టాలను తగ్గించి, వ్యవస్థను ఆధునీకీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'రీ వేంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్‌ఎస్)ను సుమారు రూ.13,404.53 కోట్లతో అనుమతించారని వెల్లడించారు. వివిధ రంగాల వినియోగదారులకు సబ్సిడీపై విద్యుత్ అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

గృహ, వ్యవసాయ వినియోగదారులపై భారం ఉండదు: ఏపీఈఆర్‌సీ చైర్మన్

రాష్ట్రంలోని గృహ, వ్యవసాయ వినియోగదారులపై 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారం ఉండబోదని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని అన్నారు. వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్ల ఖర్చును రైతుకు ఎటువంటి భారం లేకుండా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినందుకు అభినందనలు తెలిపారు. వ్యవసాయ మీటర్ల వల్ల విద్యుత్ అనవసర వినియోగం తగ్గుతుందని ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు చెప్పారు. ఆధునిక సాంకేతికత, ప్రమాదాలను నివారణపై దృష్టిసారిస్తున్నట్లు సీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్ధనరెడ్డి చెప్పారు.

డిగ్రీలో కొత్త కోర్సులకు ప్రాధాన్యత

- కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్


మాట్లాడుతున్న పోలా భాస్కర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉద్యోగ అవకాశాలున్న కొత్త కోర్సులకు డిగ్రీ విద్యలో తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని, వచ్చే ఏడాది మరిన్ని కోర్సులను ప్రవేశపెడతామని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ చెప్పారు. విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో శనివారం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ పూర్తయిన వెంటనే ప్రతి విద్యార్థికి ఉద్యోగం, ఉపాధి లభించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత విద్యలో సంస్కరణలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యాప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు, రానున్న పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు అందించేలా కొత్త కోర్సులను ఈ ఏడాది కొన్ని కళాశాలల్లో ప్రవేశపెట్టామని చెప్పారు. వచ్చే ఏడాది మరికొన్ని కాలేజీలకు విస్తరిస్తామని తెలిపారు. డిగ్రీ స్థాయిలో ప్లేస్‌మెంట్ నిర్వహణకు క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. నూతన విద్యా విధానం అమలు నేపథ్యంలో విద్యార్థితో 8 నెలల ఇంటర్న్‌షిప్ చేయించి ప్లేస్‌మెంట్‌కి సిద్ధం చేస్తామన్నారు. కళాశాల ఫీజు చెల్లింపుల్లో అవకతవకలకు తావులేకుండా ఎస్‌బీఐ సహకారంతో ఆన్‌లైన్ చెల్లింపు యాప్‌ను విద్యార్థికి అందజేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 166 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల కొరత లేదన్నారు. గత ఏడాది వరకు 14వేల మంది బోధన సిబ్బంది ఉండేవారని, ఇప్పుడు 24వేల మంది వరకు పెరిగారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌జేడీ డాక్టర్ సీహెచ్ కృష్ణ, అకడమిక్ గైడెన్స్ అధికారిణి డాక్టర్ తులసి మస్తానమ్మ, మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పని ఒత్తిడి మానసిక అనారోగ్యానికి కారణం

- ఓ హెచ్‌ఆర్ సంస్థ సర్వేలో వెల్లడి
- గత సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సర్వే
- 1,380 మంది ఉద్యోగుల అభిప్రాయాల సేకరణ
- 77 శాతం మందిపై పని సంబంధిత ఒత్తిడి
- ఆందోళన, నిరాశను ప్రేరేపిస్తున్నట్లు వెల్లడి



సాక్షి, అమరావతి: పని సంబంధిత ఒత్తిడి ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తోంది. ఒత్తిడి తమలో ఆందోళన, నిరాశను ప్రేరేపిస్తోందని ఉద్యోగులు భావిస్తున్నారు. ఈ విషయం ఇటీవల ఓ సర్వేలో వెల్లడైంది. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంజనీరింగ్, నిర్మాణం, లాజిస్టిక్స్ వంటి వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై జీనియస్ కన్సల్టెంట్స్ అనే హెచ్‌ఆర్ సంస్థ చేపట్టిన ఓ సర్వేలో ఈ అంశం వెలుగు చూసింది. గత ఏడాది సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 15 వరకు దేశంలో వివిధ రంగాలకు చెందిన కంపెనీల్లో పనిచేస్తున్న 1,380 మందిని ఈ సంస్థ సర్వే చేసింది. ఈ క్రమంలో పని ఒత్తిడి మీ మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందా? అని ప్రశ్నించగా 77 శాతం మంది అవుననే సమాధానం ఇచ్చారు. 14 శాతం మంది ఈ అంశంపై తటస్థ వైఖరి ప్రదర్శించారు. తొమ్మిదిశాతం మంది పని ఒత్తిడి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపడంలేదని చెప్పారు. ఇమ్యునో డెఫిషియన్సీ, గ్యాస్ట్రో ఇంటెస్టినల్, మస్క్యులోస్కెలటల్ డిజార్డర్స్ వంటి ఆరోగ్య సమస్యలు నేరుగా పని ఒత్తిడితో ముడిపడి ఉన్నాయని సర్వేలో పాల్గొన్న 82 శాతం మంది అభిప్రాయపడ్డారు.

కునుకు తీస్తే సరి

పని ఒత్తిడిని అధిగమించడానికి పనిమధ్యలో కొద్దిసేపు కునుకు తీస్తే సరిపోతుందని ఉద్యోగులు భావిస్తున్నారు. పని ఒత్తిడి స్థాయిని ఎదుర్కోవడానికి ఎలాంటి పద్ధతులు అవలంబిస్తే బాగుంటుందని సర్వేలో ఆరా తీయగా 73 శాతం మంది పనిమధ్యలో కునుకు తీసే వినూత్న పద్ధతిని తీసుకురావాలని కోరారు. తొమ్మిదిశాతం మంది కునుకు తీసే అంశాన్ని విభేదించగా, 18 శాతం మంది తటస్థంగా ఉన్నారు. రెండో అభిప్రాయం కింద పనిదినాలు కుదిస్తే మంచిదని 68 శాతం మంది పేర్కొన్నారు.

వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుత రోజుల్లో పని ఒత్తిడి అనేది అన్ని రంగాల్లో సర్వసాధారణం అయిపోయింది. ఈ క్రమంలో ఆ ఒత్తిడి అధిగమించడానికి ప్రతి ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. చాలామంది ఒత్తిడిని అధిగమించడం కోసం ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు అలవాటుపడుతున్నారు. ఒత్తిడికి వ్యసనాలు తోడవడంతో చిన్న వయసులోనే బీపీ, షుగర్ వంటి జీవనశైలి జబ్బులబారిన పడుతున్నారు. దీంతో గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురవుతున్నారు. యోగా, వాకింగ్, జాగింగ్ వంటి శారీరక శ్రమను రోజువారీ దినచర్యలో భాగం చేసుకోవాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. ఇష్టమైన వ్యాపకాలు చేయాలి. ఒత్తిడికి కారణాలను, పరిష్కార మార్గాలను అన్వేషించాలి.

– డాక్టర్ బుచ్చిరాజు, న్యూరాలజిస్ట్, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్

అ'ధర'గొడుతున్న అరటి

- టన్ను ధర రూ.30వేలు
- గత ఏడాది రూ.13 వేలు పలికిన ధర
- ఈ స్థాయి ధర పలకడం ఇదే తొలిసారి
- మరింత పెరిగే అవకాశం ఉందంటున్న మార్కెట్ వర్గాలు

అనంతపురం జిల్లా నార్పల మండలం బి.పప్పూరుకు చెందిన ఈ రైతు పేరు వెన్నపూస లక్ష్మయ్య. 1.50 ఎకరాల్లో అరటి పంట వేశారు. ఎకరాకు 30 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. రెండు రోజుల క్రితం తొలి దఫా కోత కోయగా.. 7 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.28,500 చొప్పున విక్రయించగా.. రూ.1.99 లక్షల ఆదాయం వచ్చింది. గతేడాది టన్ను రూ.12 వేలకు అమ్ముకోవాల్సి వచ్చిందని.. ఇప్పుడు రూ.30 వేల వరకు ధర పలుకుతోందని లక్ష్మయ్య చెప్పారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయి ధర చూడలేదని లక్ష్మయ్య సంబరపడిపోతున్నారు.



సాక్షి, అమరావతి: అరటి ధరలు ఊహించని రీతిలో పెరుగుతుండటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గతంలో టన్ను రూ.5 వేల నుంచి రూ.7 వేలు పలకడమే గగనంగా ఉండేది. గత ఏడాది కిలో రూ.10నుంచి రూ.13 పలకగా.. ఈ ఏడాది సీజన్ ప్రారంభం కాకుండానే కిలో రూ.15 పలికింది. క్రమేపీ పెరుగుతూ ప్రస్తుతం కిలో రూ.28 నుంచి రూ.30 పలుకుతోంది. ఇది మరింత పెరిగే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 2.46 లక్షల ఎకరాల్లో అరటి సాగవుతోంది. సగానికి పైగా విస్తీర్ణం వైఎస్సార్, అనంతపురం, అన్నమయ్య, నంద్యాల, ప్రకాశం జిల్లాల పరిధిలోనే ఉంది. ఉభయ గోదావరి, ఏలూరు, కోనసీమ, కృష్ణా జిల్లాల్లో పండే కర్పూరం, చక్కరకేళి రకాలను దేశీయంగా వినియోగిస్తుండగా.. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పండే గ్రాండ్ నైన్ (జీ-9 పొట్టి పచ్చ అరటి), టిష్యూ కల్చర్ రకాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

యూరప్ వైపూ చూపు

గడచిన మూడేళ్లలో 1.25 లక్షల టన్నుల అరటి ఎగుమతులు జరగ్గా.. ఈ ఏడాది 75 వేల టన్నులను ఎగుమతి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటివరకు మధ్య ప్రాచ్య దేశాలైన (మిడిల్ ఈస్ట్) సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్, యూఏఈ వంటి దేశాలకు మాత్రమే అరటి ఎగుమతులు పరిమితం కాగా.. ఈ ఏడాది నుంచి యూరోపియన్ దేశాలతోపాటు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు సైతం ఎగుమతులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కోతలు ఇప్పుడే ప్రారంభం కాగా.. ప్రస్తుతం 10 శాతం పంట మార్కెట్‌కు వచ్చింది. మార్చి-ఏప్రిల్ వరకు మార్కెట్‌కు వస్తుంది. నాందేడ్, గుల్బర్గ్, అర్ధాపూర్ ప్రాంతాల్లో అరటి విస్తీర్ణం తగ్గడం.. ప్రభుత్వ చర్యల ఫలితంగా మన ప్రాంత అరటి దిగుబడుల్లో నాణ్యత పెరగడం ధరల పెరుగుదలకు కారణమని చెబుతున్నారు. కనీసం టన్ను రూ.35వేలకు పైగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

మంచి రోజులొచ్చాయి

అరటి రైతులకు మంచి రోజులొచ్చాయి. నేను 15 ఏళ్లుగా అరటి సాగు చేస్తున్నా. ఏనాడూ ఈ స్థాయి ధర చూడలేదు. 10 ఎకరాల్లో టిష్యూకల్చర్ సాగు చేస్తున్నా. ఎకరాకు 26 టన్నులకు పైగా వస్తుందని అంచనా. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. ప్రస్తుత రేటును బట్టి రూ.15 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని భావిస్తున్నాం.

– పులసాని పెద్దిరెడ్డి, తాడిపత్రి ఎడ్వయిజరీ బోర్డు చైర్మన్, అనంతపురం జిల్లా

తెగులు కనిపించలేదు

2.5 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నా. గతేడాది సిగటోక తెగులు వల్ల ఆశించిన దిగుబడులు రాలేదు. ఈసారి ఆ తెగులు ప్రభావం పెద్దగా లేదు. ఎకరాకు 30 టన్నులు దిగుబడి అంచనా వేస్తున్నా. గతేడాదితో పోలిస్తే ఈసారి రేటు చాలా బాగుంది. మంచి లాభాలొస్తాయని ఆశిస్తున్నా.

– పి.నాగేశ్వరరెడ్డి, సంజీవపురం, అనంతపురం జిల్లా

ప్రభుత్వ కృషి ఫలించింది

ఆర్బీకే స్థాయిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ఫలితంగా సిగటోక తెగులు ప్రభావం తగ్గింది. దిగుబడులతో పాటు నాణ్యత కూడా పెరిగింది. ఎగుమతులు మొదలయ్యాయి. ఈ ఏడాది 75 వేల టన్నులు ఎగుమతికి కార్యాచరణ సిద్ధం చేశాం.

– ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్, ఉద్యాన శాఖ

ఒంటిమిట్టకు కొత్త శోభ!

- సుమారు రూ.100 కోట్లతో ఏకశిలానగరిలో అభివృద్ధి పనులు
- భక్తుల వసతికి ప్రత్యేకంగా సముదాయం
- అద్భుతంగా రూపుదిద్దుకున్న పుష్కరిణి


ఆలయ సమీపంలో ఆహ్లాదకరమైన పార్కు

సాక్షి రాయచోటి: శ్రీరామచంద్రుడు నడియాడిన దివ్య స్థలం ఏకశిలానగరి కొత్త శోభ సంతరించుకుంది. చోళ, విజయనగర, మట్లిరాజుల కాలంలో వైభవంగా అలరారిన రామాలయం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో ఉంది. ఒకే శిలపై జాంబవంతుడు ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు ఇక్కడి విశిష్టత. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఒంటిమిట్ట రామాలయాన్ని అధికారికంగా గుర్తించి ప్రభుత్వ లాంఛనాలతో కల్యాణం నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చింది. అనంతరం 2015 సెప్టెంబర్ 9న టీటీడీలోకి ఏకశిలానగరి ఆలయాన్ని విలీనం చేయడంతోపాటు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. సుమారు రూ.100 కోట్లతో పనులు చేపట్టాలని సంకల్పించి అందుకు అనుగుణంగా బాటలు వేస్తున్నారు. ప్రతి ఏడాది శ్రీరామ నవమి పండుగ తరుణంలో ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు, శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా అధికార లాంఛనాలతో నిర్వహిస్తున్నారు.

కోదండరాముని కల్యాణానికి శాశ్వత మండపం

ఒంటిమిట్ట కోదండ రామాలయం సమీపంలో సుమారు 52 ఎకరాల సువిశాల మైదానంలో శ్రీ సీతారాముల కల్యాణానికి అవసరమైన మండపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సుమారు రూ. 40 కోట్లకు పైగా నిధులు వెచ్చించి శాశ్వత నిర్మాణాలు పూర్తి చేశారు. తొలి నాళ్లలో శాశ్వత కల్యాణ మండపం లేకపోవడంతో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుని కల్యాణం నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో టీటీడీ ప్రత్యేకంగా శాశ్వత కల్యాణ మండపం నిర్మాణాలకు రూపకల్పన చేసి అందుకు అనుగుణంగా నిర్మించారు. స్వామి వారి కల్యాణాన్ని సుమారు 72 వేల మంది భక్తులు వీక్షించేలా మైదానం, శాశ్వత మండపం సిద్ధం చేశారు.

ఆలయం చుట్టూ మాడ వీధులు... ఆహ్లాదకరంగా పార్కు

ఒంటిమిట్ట కోదండ రాముని ఆలయం చుట్టూ మాడ వీధులను తయారు చేశారు. ఆలయం లోపల సుమారు రూ.1.70 కోట్లతో చలువరాతి నిర్మాణాలు చేపట్టారు. మాడ వీధులు, పార్కులు, ఫోకస్ లైట్లు, నీటి వసతి, కల్యాణ మండపం ఆవరణలో తోరణాలు, భక్తులకు వసతి కల్పనకు సముదాయం, సేద తీరేందుకు దక్షిణ గోపురం వైపు భవన నిర్మాణాలకు సుమారు రూ.15 కోట్ల మేర ఖర్చు చేశారు. శ్రీరామ కుటీరం సమీపంలోనే పుష్కరిణితోపాటు ఇతర పనులు కలుపుకుని సుమారు రూ. 5 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేశారు.

నిత్యం భక్తులకు అన్నదానం

ఆలయం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాంబారు, పెరుగన్నం రోజుకు 300-500 మందికి అందజేస్తున్నారు. ప్రతి నెలలో రెండు, నాలుగో శనివారాల్లో టీటీడీ నుంచి లడ్డూ ప్రసాదాన్ని తెప్పించి భక్తులకు ఇస్తున్నారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని 2023 జనవరి 1న ఒంటిమిట్టలో ప్రారంభించారు. మెనూలో మార్పులు చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు

కోదండ రాముని బ్రహ్మోత్సవాలు, కల్యాణం ఈ ఏడాది పెద్ద ఎత్తున జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.2 కోట్ల నుంచి 3 కోట్ల వరకు నిధులను వినియోగించి మౌలిక వసతులు కల్పించేదుకు చర్యలు చేపట్టారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మయ్య ఆలయాన్ని సందర్శించారు. కల్యాణ మండపం ప్రాంతాన్ని పరిశీలించారు. రానున్న కాలంలో అక్కడ ఇప్పటి నుంచే ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

వైరల్

పవర్ ఆఫ్ ఉమెన్

జమ్మూలోని దోడా జిల్లాలో 'ఎలక్ట్రిషియన్' అంటే మగవాళ్లు మాత్రమే గుర్తుకు వస్తారు. 'మహిళా ఎలక్ట్రిషియన్' అనే మాట, దృశ్యం ఊహకు కూడా అందనిది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలక్ట్రిషియన్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన షబ్నమ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోంది...



● ఆత్మవిశ్వాసం, అంకితభావంతో ముందడుగు: షబ్నమ్

జమ్మూ దోడా జిల్లాలోని మారుమూల గ్రామం కహరకు చెందిన షబ్నమ్ పదవ తరగతి పూర్తయిన తరువాత శ్రీనగర్‌లోని పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రిషియన్ కోర్సులో డిప్లొమా చేసింది. తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబానికి కష్టాలు మొదలయ్యాయి. ఆర్థికంగా అండ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ఆమె ఎలక్ట్రిషియన్‌గా పని మొదలు పెట్టింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచింది. కొద్ది కాలంలోనే షబ్నమ్‌కు ఎలక్ట్రీషియన్‌గా మంచి పేరు వచ్చింది.

'తప్పనిసరి పరిస్థితుల్లో ఎలక్ట్రిషియన్ వృత్తిలోకి వచ్చాను. అయితే నా పనితీరును చాలామంది మెచ్చుకోవడంతో ఉత్సాహం వచ్చింది. నాపై నాకు నమ్మకం పెరిగింది. ఈ ఫీల్డ్‌లోనే పనిచేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాను' అంటుంది షబ్నమ్.

నిజానికి దోడా ప్రాంతంలో ఎలక్ట్రిషియన్ అంటే మగవాళ్లు మాత్రమే.

'అమ్మాయిలు ఎలక్ట్రిషియన్‌గా పని చేయడం ఏమిటీ!' అని అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేసేవాళ్లే. ఈ విషయం తెలిసి కూడా ఎలక్ట్రిషియన్‌గా అడుగులు మొదలుపెట్టింది షబ్నం.

'ఇది మగవాళ్లు మాత్రమే పనిచేయాల్సిన రంగం. ఇది ఆడవాళ్లు మాత్రమే పనిచేయాల్సిన రంగం అంటూ ఏదీ లేదు' అంటుంది షబ్నమ్.

ఎంటెక్ చదువుకున్న రషీద్‌ఖాన్ జమ్మూలో నిపుణులైన ఎలక్ట్రిషియన్స్‌తో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాడు. ఒక వెబ్‌సైట్ కూడా లాంచ్ చేయనున్నాడు. ఖాన్ బృందంలో ఉన్న ఒకే ఒక మహిళ షబ్నమ్.

'వీరితో ఎలాంటి భయం లేదు. మేమందరం ఒక కుటుంబం' అంటుంది షబ్నమ్.

చాటుమాటుగానే కాదు... 'అమ్మాయిలు ఎలక్ట్రిషియన్ వర్క్ చేయడం ఏమిటి!' అని ముఖం మీదే అన్నవాళ్లు ఉన్నారు.

అయితే అలాంటి మాటలను షబ్నమ్ ఎప్పుడూ పట్టించుకోలేదు.

'ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ఇది మహిళలు పనిచేసే రంగం కాదు అనే భావన నుంచి బయటికి రావాలి. ప్రతి రంగంలోనూ మంచి, చెడు ఉంటాయి. చెడును మాత్రమే చూస్తే ఉన్నచోటే ఉండిపోతాం. ప్రతి కొత్త అడుగులో కించపరిచే విధంగా మాట్లాడేవాళ్లు, ప్రతికూలంగా మాట్లాడే వాళ్లు ఎంతోమంది ఉంటారు. అలాంటి వారికి మన పనితోనే సమాధానం చెప్పాలి' అంటున్న షబ్నమ్ ఎలక్ట్రిషియన్‌గా పనిచేయాలనుకునే మహిళలకు సహాయం అందించడానికి సిద్ధంగా ఉంది.

స్త్రీలు- పని

నా డబ్బులు తీసుకో అనొద్దు

'ఉద్యోగం ఎందుకు చేయాలనుకుంటున్నావు?'
'ఇప్పుడు ఏం అవసరం వచ్చింది?' 'డబ్బులు కావాలా?'
ఈ ప్రశ్నలు స్త్రీలను పురుషులు అడుగుతారు.
'డబ్బులు కావాలంటే నా డబ్బులు తీసుకో'
అని భార్యతో భర్త, కూతురితో తండ్రి,
తల్లితో కొడుకు, చెల్లితో అన్న అంటారు.
'నేను సంపాదించుకున్న నా డబ్బులు నాకు కావాలి'
అని స్త్రీలు చెప్తే వీరు తెల్లముఖం వేస్తారు.
స్త్రీల ఇంటి పని (కేర్ వర్క్)కి విలువ ఇవ్వక,
స్త్రీలు బయట పని చేస్తామంటే పట్టించుకోక పోవడం వల్ల
ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ, పురుషుల మధ్య ఆర్థిక తారతమ్యాలు
తొలగడానికి ఐక్యరాజ్య సమితి అధ్యయనం ప్రకారం
120 ఏళ్లు పట్టనుందని శనివారం 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో
పాల్గొన్న రచయిత్రులు అన్నారు. భవిష్యత్తులో 'కేర్ వర్క్'
పెద్ద ఉపాధి రంగం కానుందని తెలిపారు.



● శైలి చోప్రా, మిన్ని వైద్



● లక్ష్మీ పురి

'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఒక అధ్యయనం చేసింది. రాబోయే రోజుల్లో ఎటువంటి పనులు గిరాకీ కోల్పోయి ఎటువంటి పనులు గిరాకీలోకి వచ్చి ఉపాధిని ఏర్పరుస్తాయి అనేదే ఆ అధ్యయనం. అందులో దినదిన ప్రవర్థమానమయ్యే పని రంగంగా సంరక్షణా రంగం (కేర్ వర్క్) వచ్చింది. ఇంటి సంరక్షణ, పిల్లల సంరక్షణ, వృద్ధుల సంరక్షణ, ఇంటి శుభ్రత, ఇంటి ఆరోగ్యం... ఇవన్నీ కేర్ వర్క్ కింద వస్తాయి. ఈ కేర్ వర్క్ తరాలుగా స్త్రీలు చేస్తున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న స్త్రీల చేత లెక్కా జమా లేని అతి తక్కువ వేతనాలకు చేయిస్తున్నారు. ఇంటిలో పని చేసే గృహిణుల కేర్ వర్క్‌కు విలువ కట్టడం లేదు. కేర్ వర్క్‌ను ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు ఒక ఉపాధి రంగంగా అభివృద్ధి చేస్తే తప్ప కేర్ ఎకానమీ స్వరూపం, ఉనికి, ఉపయోగం అర్థం కాదు. మగవాడు ఇంటి బయట జీతానికి చేసే పని ఒక్కటే పని కాదు. ఇంటి లోపల జీతం లేకుండా స్త్రీలు చేసే పని కూడా పనే' అని జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో శనివారం జరిగిన 'విమెన్ అండ్ వర్క్' అనే సెషన్‌లో పాల్గొన్న రచయిత్రులు అన్నారు. వీరిలో 'సిస్టర్‌హుడ్ ఎకానమి' పుస్తకం రాసిన శైలి చోప్రా, ఇస్రో మహిళా శాస్త్రవేత్తల మీద 'దోజ్ మేగ్నిఫీషియెంట్ విమెన్ అండ్ దెయిర్ ఫ్లయింగ్ మెషిన్స్' పుస్తకం రాసిన మిన్ని వైద్, ఐక్యరాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ లక్ష్మి పురి ఉన్నారు.

'స్త్రీలు ఉండదగ్గ చోటు ఇల్లు అనడమే పెద్ద అవరోధం. అన్ని చోట్లు స్త్రీలు ఉండదగ్గ చోట్లే. కాని ఇంట్లో ఉండటం వల్ల, బిడ్డను కనే శారీరక ధర్మం ఆమెకే ఉండటం వల్ల ప్రేమ, బాధ్యత అనే మాటల్లో ఆమెను పెట్టి ఇంటి పని చేయిస్తున్నారు. అంతులేని ఈ ఇంటి చాకిరికి విలువ ఉంటుందని స్త్రీ ఎప్పుడూ అనుకోదు. విలువ సంగతి అటుంచితే... అంత పని స్త్రీ నెత్తిన ఉండటం గురించి కూడా మాట్లాడరు. గ్లోబల్‌గా చూస్తే పురుషుల కంటే స్త్రీలు 2.9 శాతం ఎక్కువ పని చేస్తున్నారు. భారతదేశంలో ఇది పది శాతమైనా ఉంటుంది. స్త్రీ, పురుషుల శరీర నిర్మాణంలో భేదం ఉంది. కాని ఈ భేదం భేదభావంగా వివక్షగా మారడం ఏ మాత్రం సరి కాదు' అని లక్ష్మి పురి అన్నారు.

'స్త్రీలు పని చేస్తామంటే పురుషులు అడ్డంకులు వేస్తూనే ఉంటారు. ఎందుకు పని చేయడమంటే అది స్త్రీల లక్ష్యం కావచ్చు. ఎంపిక కావచ్చు. ఇష్టం కావచ్చు. ఆర్థిక స్వావలంబన కోసం కావచ్చు. నా డబ్బు తీసుకో ఉంది కదా అని భర్త, తండ్రి, కొడుకు అంటూ ఉంటారు. ఎందుకు తీసుకోవాలి. తాము సంపాదించుకున్న డబ్బు కావాలి అనుకోవచ్చు స్త్రీలు. భారతదేశంలో స్త్రీల జనాభా జపాన్ దేశపు జనాభాకు ఎనిమిది అంతలు ఉంటుంది. అంతటి జనాభా ఉన్నప్పటికీ మన దేశ స్త్రీల అభిప్రాయాలను, భావాలను పరిగణనలోకి తీసుకోరు. దీనిని ఎలా అర్థం చేసుకోవాలి' అని శైలి చోప్రా అన్నారు. 'మగవారి మధ్య బ్రదర్‌హుడ్ ఉంటుంది. స్త్రీల మధ్య సిస్టర్‌హుడ్ బలపడితే అన్నింటిని మార్చగలం. అందుకే నా పుస్తకానికి సిస్టర్‌హుడ్ ఎకానమీ అని పేరు పెట్టాను' అన్నారామె.

'ఇస్రో మహిళా శాస్త్రవేత్తల మీద నేను పుస్తకం రాశాను. వాళ్ల నుంచి విన్న మొదటి మాట మహిళా అనొద్దు... మేమూ శాస్త్రవేత్తలమే... ప్రత్యేకంగా ఎంచడం వల్ల ఏదో ప్రోత్సహిస్తున్న భావన వస్తుంది అంటారు. చాలా బాగుంది. కాని ఇస్రోలో ఇప్పటికీ 16 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు ఇస్రోకు మహిళా శాస్త్రవేత్త డైరెక్టర్ కాలేదు. ఎప్పటికి అవుతారో తెలియదు. మంగళయాన్ వంటి మిషన్‌ను స్త్రీలు విజయవంతం చేసినా... నా కుటుంబం సపోర్ట్ చేయడం వల్లే చేశాను... నా భర్త సపోర్ట్ చేయడం వల్లే చేశాను... వారు చేయనివ్వడం వల్ల చేశాను అని చెప్పుకోవాల్సి వస్తోంది. 'చేయనివ్వడం' అనేది స్త్రీల విషయంలోనే జరుగుతుంది. ఎంత చదివినా, ఎంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా భర్తో/కుటుంబమో వారిని 'చేయనివ్వాలి'... ఈ స్థితి మహిళలకు ఎలాంటి మానసిక అవస్థను కలిగిస్తుందో మగవాళ్లకు తెలియదు. ఉద్యోగం చేస్తున్న స్త్రీ తారసపడితే ఆఫీసు, ఇల్లు ఎలా బేలెన్స్ చేసుకుంటున్నావు అని అడుగుతారు. మగవాడిని ఎందుకనో ఈ ప్రశ్న అడగరు' అన్నారు మిన్ని వైద్.

'కుటుంబ పరమైన, సామాజిక వొత్తిళ్ల వల్ల పిల్లలు కనే వయసులోని స్త్రీలు తమ వృత్తి, ఉపాధి నుంచి దూరమయ్యి పని చేయడం మానేస్తున్నారు. వారు తమ కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పని చేసే, చేయగలిగే వాతావరణం పూర్తి స్థాయి ఏర్పడాలంటే మగవాళ్లు ఇంకా మారాల్సి ఉంది' అని ఈ వక్తలు అభిప్రాయ పడ్డారు.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి



● గుల్జార్

లతా మంగేష్కర్

నా సినిమా జీవితానికి ఆమె వీసా ఇచ్చింది



● లతా మంగేష్కర్

'మన జీవితంలో పండగ వచ్చినా, నిశ్చితార్థం జరిగినా, పెళ్లి వేడుక, పిల్లాడు పుట్టినా, సుప్రభాత పూజ చేస్తున్నా... ప్రతి సందర్భానికి లతా పాడిన పాట ఉంటుంది. వింటాము. లతా అలా మన జీవితంలో మనకు తెలియకుండానే నిండిపోయింది. అందుకనే ఆమె ఎప్పటికీ వినపడుతూనే ఉంటుంది' అని గీత రచయిత గుల్జార్ అన్నారు.

శనివారం జరిగిన జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో లతా మంగేష్కర్ మీద వెలువడ్డ తాజా పుస్తకం 'లతాజీ- ఏ లైఫ్ ఇన్ మ్యూజిక్' ఆవిష్కరణ సందర్భంగా గుల్జార్ మాట్లాడారు. 'బందినిలో మొర గోర అంగ్ లైలే... నా మొదటి పాట. కాని దానికి మూడేళ్ల ముందు నుంచి లతా దీదీ సంగీత దర్శకుడు ఎస్.డి.బర్మన్‌తో మాట్లాడటం లేదు. ఎస్.డి.బర్మన్ కూడా ఆమెతో మాట్లాడదలుచుకోలేదు. నేనేమో పాట రాశాను. లతా నా పాటను మెచ్చి మొత్తం మీద పాడి నాకు సినిమా రంగంలో ప్రవేశానికి వీసా ఇచ్చింది. ఆ తర్వాత తను ప్రొడ్యూసర్‌గా నా దర్శకత్వంలో 'లేకిన్' నిర్మించింది. నేను ఆమె మీద అభిమానంతో 'నామ్ గుమ్ జాయేగా' (కినారా) పాట రాశాను. ఆ పాటలోని 'మేరీ ఆవాజ్ హీ పెహెచాన్ హై' అనే లైన్‌ను మీరు ఆటోగ్రాఫ్ చేసేప్పుడు మెన్షన్ చేసేందుకు వీలుగా రాశాను అని లతాతో చెప్పాను. ఆ లైనే ఆమె బతికి ఉండగానేగాక మరణించాక ఒక అస్తిత్వంగా మారింది' అన్నాడు.

'లతాజీ- ఏ లైఫ్ ఇన్ మ్యూజిక్' పుస్తక రచయిత యతీంద్ర మిశ్రా మాట్లాడుతూ 'ఇవాళ గాయనీ గాయకులు పొందుతున్న రాయల్టీ సౌకర్యాలకు, అవార్డులకు లతా మొదలెట్టిన పోరాటమే కారణం. ఫిల్మ్‌ఫేర్ అవార్డు కొత్తల్లో గాయనీ గాయకులకు ఇచ్చేవారు కాదు. సంగీత దర్శకులకే ఇచ్చేవారు. 'చోరి చోరి' సినిమాలోని 'రసిక్ బల్మా' పాటకు శంకర్ జైకిషన్‌కు ఫిల్మ్‌ఫేర్ వచ్చింది. ఆ వేడుకలో ఆ పాట పాడమని జైకిషన్ లతాను పిలిచాడు. అవార్డు మీకు వచ్చింది... వెళ్లి ట్యూన్ వాయించండి సరిపోతుంది అందామె. గాయని లేకుండా పాట ఎలా? టైమ్స్ గ్రూప్ అధినేత రంగంలో దిగి ఫోన్ చేసి బతిమిలాడినా పాడలేదు. దాంతో ఇంకో రెండేళ్లకు గాయనీ గాయకులకు ఫిల్మ్‌ఫేర్ ప్రవేశపెట్టారు. రాయల్టీ విషయంలో కూడా లతా పట్టుదల వల్లే గాయనీ గాయకులకు డబ్బులు వచ్చాయి' అని తెలియచేశాడు.

లతా పాడిన పాటల వెనుక కథలు, విశేషాలతో 'లతాజీ- ఏ లైఫ్ ఇన్ మ్యూజిక్' వెలువడింది.

హెల్త్

ఒమిక్రాన్ కొత్త సబ్-వేరియెంట్ ఎక్స్ బిబి 1.5

హెల్త్ టిప్

మెడనొప్పికి టాబ్లెట్ల కంటే

టాపికల్ క్రీములే మేలు..!



ఈ ప్రపంచంలోని ప్రతివారూ ఏదో ఒక సమయంలో మెడనొప్పికి గురవుతూనే ఉంటారు. ఈ మెడనొప్పులకు పూత మందులుగా లభ్యమయ్యే నొప్పినివారణ ఆయింట్‌మెంట్స్ చాలానే అందుబాటులో ఉన్నాయి. పైపూతకు వాడే ఆయింట్‌మెంట్స్‌ను 'టాపికల్ మెడిసిన్స్' అంటారు. నోటిద్వారా తీసుకునే పెయిన్‌కిల్లర్స్ ఇటు కిడ్నీలనూ, అటు కాలేయాన్నీ ప్రభావితం చేయవచ్చు.

కాబట్టి... నోటి ద్వారా తీసుకునే మందుల కంటే టాపికల్ మెడిసిన్స్ వాడటమే మేలు. నొప్పి తీవ్రతను బట్టి... టాపికల్ క్రీమ్స్‌ను రోజుకు ఐదారు సార్లు రాయవచ్చు. దీంతో పాటు వేడి నీళ్లలో మెత్తటి గుడ్డను ముంచి, పిండి మెడ పైన కాపడం పెట్టడం, లేదా ఐస్ ముక్కను ఒక బట్టలో చుట్టి దానితో 'ఐస్ కాపడం' పెట్టడం కూడా మంచి ఫలితాలే ఇస్తాయి.

మరీ చిన్నపిల్లల్లో చుండ్రు కనిపిస్తే?

చిన్నపిల్లల్లో చుండ్రు వచ్చే సమస్యను 'క్రెడిల్ క్రేప్' అంటారు. దీని తీవ్రత తగ్గించేందుకు కొన్ని జాగ్రత్తలివి... ● పిల్లలకు వారానికి 3–4 సార్లు తల స్నానం చేయించడం మంచిది. ● ఆహారంలో జింక్, బీ-కాంప్లెక్స్‌తో పాటు మల్టీ విటమిన్లు ఎక్కువగా ఉండే ఆహారాలు ఇవ్వాలి. ● పిల్లల మాడు పొడి బారకుండా, తలకు తేమనిచ్చే ఆలివ్ ఆయిల్, మాయిశ్చరైజింగ్ లోషన్ వంటివి వాడాలి. ● అప్పటికీ తగ్గకపోతే డాక్టరుకు చూపించాలి.



చైనాలోని ఊహాన్‌లో వెలుగు చూసిన నాటి నుంచీ కరోనాకు చెందిన అనేక వేరియెంట్లు... విడతలు విడతలుగా, తడవలు తడవలుగా వేవ్‌లంటూ వస్తూనే ఉన్నాయి. తొలినాళ్లలో ఆల్ఫా, డెల్టా అంటూ తీవ్రమైన వేరియెంట్ల రూపంలో అనేక మంది ఉసురు తీశాయి. మూడో వేవ్‌గా వచ్చిన ఒమిక్రాన్ తీవ్రత అంతగా లేదుగానీ ఇంతలోనే ఒమిక్రాన్ తాలూకు మరో సబ్-వేరియెంట్ అయిన ఎక్స్‌బీబీ 1.5 వచ్చి అమెరికాను అల్లకల్లోలం చేస్తోంది. భారత్‌లోని ఇంటికొకరు చొప్పున అమెరికాలో నివాసముంటూ... రోజూ కొన్ని లక్షల మంది యూఎస్ నుంచి ఇండియాకీ, ఇక్కణ్నుంచి మళ్లీ యూఎస్‌కు వెళ్తూ వస్తూ, పెద్ద ఎత్తున ప్రయాణాలు సాగిస్తున్న నేపథ్యంలో మన దగ్గర ఈ సబ్ వేరియెంట్ ప్రమేయం (రెలవెన్స్) ఏమిటీ, ఎలా ఉంటుందని తెలుసుకోవడం కోసమే ఈ కథనం.



నిర్ధారణ పరీక్షలు
గతంలో మాదిరిగానే ఆర్టీపీసీఆర్ టెస్టుల్లో గాని రాపిడ్ టెస్టుల్లో గాని ఈ వేరియంట్ కూడా తక్కిన ఒమిక్రాన్ వేరియంట్లలా బయటపడుతుంది.

అమెరికాలో ఒమిక్రాన్ కొత్త సబ్ వేరియెంట్!!
మనమెందుకు పట్టించుకోవాలంటే?

ప్రతి జీవీ తన మనుగడ కోసం కొత్త మ్యూటేషన్స్‌తో ముందుకంటే మరింత సమర్థమైన జీవిగా పరిణామం చెందడానికి ప్రయత్నిస్తుంటుంది. ప్రస్తుత ఒమిక్రాన్ సబ్-వేరియెంట్ కూడా జన్యుపరమైన మార్పులను చేసుకుంటూ 500 కంటే ఎక్కువ రూపాలను సంతరించుకుంది. ఈ ఎక్స్‌బీబీ 1.5 కూడా ఇలాంటి ఓ కొత్త సబ్-వేరియెంటే!

ఎక్స్‌బీబీ 1.5 అనే ఈ తాజా సబ్-వేరియెంట్... రెండు రకాల వేరియంట్స్ కలిసినందువల్ల, మరో కొత్త వేరియంట్ గా మారింది. అంటే... బీజే-1 (బీఏ.2.10.1.1) అనే ఒక వేరియంటూ, అలాగే బీఏ.2.75 (బీఏ.2.75.3.1.1.1) మరో వేరియెంట్ల కలయిక వల్ల 'ఎక్స్‌బీబీ' అనే ఈ సబ్-వేరియంట్ పుట్టుకొచ్చింది. అది మరొక మ్యుటేషన్‌కి గురికావడంతో తాజాగా తన ప్రభావం చూపిస్తున్న ఈ 'ఎక్స్‌బీబీ - 1.5' తయారయింది. ఈ సబ్-వేరియెంట్ పుట్టుకకు కారణమైన మ్యుటేషన్‌ని 'ఎఫ్486 పీ' అని పిలుస్తున్నారు.

ఈ వేరియంట్ లక్షణాలేమిటి?

మిగతా కరోనా వేరియెంట్లు, ఒమిక్రాన్ మాదిరిగానే ఎక్స్‌బిబి 1.5 కూడా... జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్ళు నొప్పులు కలగజేస్తుంది. వృద్ధుల్లోనూ, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారి (ఇమ్యూనో కాంప్రమైజ్‌డ్ పర్సన్స్)లోనూ, ఇప్పటికే ఇతరత్రా తీవ్రమైన ఇతర ఆరోగ్య సమస్యలున్న(కో-మార్బిడిటీ)వారిలో ఈ వేరియెంట్ కాస్తంత ప్రమాదకారిగా మారే అవకాశం ఉండవచ్చు. అంతే తప్ప మిగతా వారందరిలో ఇదో చిన్న చిన్న వైరల్ ఇన్ఫెక్షన్ లాగా వచ్చి తగ్గిపోయే అవకాశాలే చాలా ఎక్కువ.

మందు లేమిటీ/ నివారణ ఏమిటి?

ఈ వేరియెంట్‌కు 'మోనోక్లోనల్ యాంటీబాడీ' ఇంజక్షన్లు పనిచేయవు. ఇప్పటికే భారతదేశంలో అనుమతి పొందిన 'పాక్స్ లోవిడ్' ట్యాబ్లెట్లు ఈ సబ్-వేరియంట్‌కి కాస్తంత సమర్థంగా పనిచేసే అవకాశం కనిపిస్తోంది. అమెరికాలో ఇప్పుడు అందుబాటులో ఉన్న బైవాలెంట్ కరోనా వ్యాక్సిన్లు దీని నుంచి రక్షణ కల్పించే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక గతంలో మాదిరిగానే మాస్కులు ధరించడం, సబ్బుతోగానీ, శ్యానిటైజర్లతోగానీ చేతులు తరచూ శుభ్రపరచుకోవడం, ఇంటినీ, పరిసరాలను డిస్-ఇన్ఫెక్టెంట్లతో తరచూ శుభ్రం చేసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, సమూహాల్లోకి, గుంపుల్లోకి (క్రౌడ్స్‌లోకి) వెళ్లకుండా ఉండటం వంటి జాగ్రత్తలను పాటిస్తే చాలు.

దీనికి ఓ ముద్దుపేరూ ఉంది...

ఎక్స్‌బీబీ 1.5కి ఓ ముద్దు పేరూ ఉంది. 'క్రాకాన్' అన్నది దీని పెట్‌నేమ్. అంటే 'సముద్ర భూతం' అని అర్థం. అయితే... ఈ నిక్-నేమ్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇవ్వలేదు. కొందరు శాస్త్రవేత్తలు, పరిశోధకులు దీనికా పేరు పెట్టారు. ఇందుకో కారణం కూడా ఉంది. అదేమిటంటే... ఒమిక్రాన్‌కు ఉన్న అనేక వేరియంట్ల కంటే కూడా...

ఈ 'ఎక్స్‌బీబీ-1.5' అన్నది మానవ వ్యాధినిరోధక వ్యవస్థను (ఇమ్యూనిటీని) తప్పించుకోవడంలో దిట్ట అని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. ఈ ఎక్స్‌బీబీ 1.5' సబ్-వేరియెంట్... మునుపటి వేరియంట్ల కంటే మరింత తేలిగ్గా, మరింత బలంగా 'ఏసీఈ2 రిసెప్టార్'లతో అనుసంధానితమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తల నమ్మకం. అందుకే వారు ఈ సబ్-వేరియంట్‌కు 'క్రాకన్' అనే నిక్-నేమ్ ఇచ్చారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏం చెబుతోంది?

అమెరికాలోని వ్యాధుల నిపుణురాలు (ఎపిడిమియాలజిస్టు) అయిన మేరియా వాన్ కెర్కోవ్ మాట్లాడుతూ "ఇప్పటివరకూ వచ్చిన అన్ని కరోనా వైరస్‌ల కన్నా ఈ ఎక్స్‌బిబి 1.5 చాలా ఎక్కువ వేగంతో వ్యాప్తి చెందుతోంది. అంతేకాదు ప్రస్తుతం దీని ప్రభావం అమెరికాతో పాటు మరో 29 దేశాలలో కనిపిస్తోంది" అన్నారు. "అందువల్ల అమెరికా మాత్రమే కాకుండా మిగతా అన్ని దేశాల ప్రజలతో పాటు అమెరికా నుంచి రాకపోకలు ఎక్కువగా ఉండే భారత్‌లాంటి దేశాల ప్రజలూ, విమాన ప్రయాణీకులందరూ మునపటిలాగే మాస్కులు ధరించడం వంటి నివారణ చర్యలు చేపట్టడం అవసరం" అంటూ ఆమె (మేరియా) పేర్కొన్నారు. ఇక గతంలో వ్యాక్సిన్ తీసుకున్నవారు సైతం బూస్టరు డోసులు తీసుకోవాలంటూ 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' సూచిస్తోంది.

మనదేశంలో ఎక్స్‌బిబి 1.5 వ్యాప్తికి అవకాశమెంత?

ఇప్పుడు ప్రపంచంలోని ఓ మూల నుంచి మరో మూల వరకు రాకపోకలు మామూలైపోయాయి. ప్రపంచమో పల్లెటూరుగా మారినందుకే ఇప్పుడు భూగోళాన్ని 'గ్లోబల్ విలేజ్' అంటూ అభివర్ణిస్తున్నారు. పెద్ద ఎత్తున పెరిగిన రవాణా, రాకపోకలూ, వలసల వంటి వాటివల్ల ఈ కొత్త వేరియంట్ అమెరికా నుంచి అన్ని ప్రాంతాలకూ, ఆ మాటకొస్తే మన దేశానికి సైతం పాకే అవకాశం ఖచ్చితంగా ఉంది.

అయితే ఒకసారి భారత్‌కు వచ్చాక మన దేశవాసులు ఈ ఎక్స్‌బిబి 1.5 తో ఎలాంటి ఇబ్బందులకు లోనవుతారనే విషయాన్ని అంచనా వేయడానికి మాత్రం ఇప్పుడప్పుడే చెప్పడానికి లేదు. ఒమిక్రాన్ కారణంగా మన దేశవాసుల్లో కరోనా పట్ల ఇమ్యూనిటీ చాలా ఎక్కువగా వచ్చింది. అందువల్ల వేగంగా విస్తరించినప్పటికీ ఈ 'ఎక్స్ బి బి 1.5' మన దేశంలో తీవ్రమైన ప్రభావాన్ని కలగజేస్తుందనడానికి మాత్రం ఎలాంటి ఆధారాలు లేవని చెప్పవచ్చు. అందుకే ఈ వేరియంట్ వల్ల మనదేశవాసులంతా భయాందోళనలకు గురికావలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. కానీ వ్యాధినిరోధక శక్తి కాస్తంత తక్కువగా ఉన్నవారు, ఇతరత్రా వ్యాధులతో ఇప్పటికీ బాధపడుతున్నవారు మాత్రం ఒకింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది.




డా. ఎంఎస్ఎస్ ముఖర్జీ,
సీనియర్ కన్సల్టెంట్
కార్డియాలజిస్ట్

హెడ్ అండ్ నెక్ క్యాన్సర్స్.. పరాకువద్దు

తల భాగంలోని శ్వాస-జీర్ణ సంబంధ వ్యవస్థలో వచ్చే క్యాన్సర్స్‌ను హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ అంటారు. పెదవులు, నోరు, చిగుర్లు, నాలుక, నేసల్ క్యావిటీ (ముక్కు భాగం), ఫ్యారింగ్స్, స్వరపేటిక వంటి భాగాలలో క్యాన్సర్స్ హెడ్ అండ్ నెక్ కిందికి వస్తాయి. ఈ క్యాన్సర్స్‌లో 90 శాతం వరకు స్క్వామస్ సెల్ కార్సినోమా రకానికి చెందినవి. అంటే మ్యుకస్ ఉండి ఎప్పుడూ తడిగా ఉండే లోపలి పెదవులు, చిగుర్లు, కాలుక వంటి భాగాలలో ఈ క్యాన్సర్ వస్తుంటాయి. మెదడు, అన్నవాహిక, థైరాయిడ్ గ్రంథి, తలలోని కండరాలు, చర్మానికి వచ్చే క్యాన్సర్స్‌ను క్యాన్సర్స్‌ను హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లుగా పరిగణించరు.

ఊపిరితిత్తుల క్యాన్సర్స్‌కు లాగానే ఈ క్యాన్సర్స్‌కూ ఆల్కహాల్, పొగాకు, దాని సంబంధిత ఉత్పత్తులే ప్రధాన కారణాలు. తల, మెడకు సంబంధించిన క్యాన్సర్స్‌కు 75% కారణాలుగా పొగాకు, పొగాకు సంబంధిత ఉత్పాదనలు, గుట్కా, పాన్, జర్దా, నస్యం, వక్క, బీడీ, చుట్ట, తమలపాకులు, సిగార్‌లు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆల్కహాల్, పొగాకు... రెండు అలవాట్లూ ఉన్నట్లయితే ముప్పు మరింత ఎక్కువ.



నోటిలో తెలుపు ఎరుపు మిళితమైన మచ్చలు (ప్యాచెస్), గొంతు బొంగురుగా ఉండటం, మింగడంలో ఇబ్బంది, దవడల వాపు, శ్వాస తీసుకోవడం, మాట్లాడటం కష్టం కావడం, తలనొప్పి, వినికిడిశక్తి తగ్గడం, చెవిపోటు... ఇలా క్యాన్సర్ కణితి పెరిగే ప్రదేశాన్ని బట్టి లక్షణాలు అనేక రకాలుగా ఉంటాయి.

లక్షణాలు అనుమానాస్పదంగా ఉంటే బయాప్సీ, ఎమ్మారై, పెట్ స్కాన్ వంటి ఇమేజింగ్ ప్రక్రియలతో క్యాన్సర్ వచ్చిన భాగాన్ని పరీక్షించి స్టేజ్‌నూ, గ్రేడింగ్‌లను నిర్ధారణ చేస్తారు. క్యాన్సర్ వచ్చిన భాగం, స్టేజ్, రోగి వయసు, ఆరోగ్యం వంటి అనేక అంశాల ఆధారంగా చికిత్స ఉంటుంది. సర్జరీ, రేడియేషన్, కీమో, టార్గెటెడ్ థెరపీ లేదా అవసరాన్ని బట్టి కొన్ని కాంబినేషన్ థెరపీలూ నిర్ణయిస్తారు.

హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లు ఓరల్ క్యావిటీ అంటే పెదవులు, నాలుక చిగుర్లు, నోటిలోని కింది భాగం, పైభాగం, జ్ఞానదంతాల వెనుకవైపున ఉండే చిగుర్ల వంటి ప్రాంతాల్లో ప్రధానంగా కనిపిస్తుంటాయి.

ఫ్యారింజియల్ : ముక్కు వెనక కూడా ఆ భాగం 5 అంగుళాల లోతు వరకు ఉంటుంది.

లారింజియల్ : మాట్లాడటానికి సహకరించే స్వరపేటిక, వోకల్ కార్డ్స్, ఆహారాన్ని శ్వాసనాళాల్లోకి పోకుండా అడ్డుకునే ఎపిగ్లాటిస్.

పారానేసల్ సైనసెస్‌తో పాటు నేసల్ క్యావిటీ : తల మధ్యభాగంలో ముక్కుకు ఇరువైపులా బోలుగా ఉండే సైనస్‌లు.

లాలాజల (సెలైవరీ) గ్రంథులు : నోటి లోపల కింది భాగంలో దవడ ఎముకలకు ఇరుపక్కలా ఉండే లాలాజల గ్రంథులు.

మన దేశంలో కనిపించే ప్రతి మూడు క్యాన్సర్లలో ఒకటి ఈ తరహా క్యాన్సర్లకు సంబంధించినదై ఉంటుంది. లేటు దశలో గుర్తించడం వల్ల లేదా ఇతర భాగాలకు (మెటాస్టాసిస్) క్యాన్సర్ పాకడం వల్ల ఈ క్యాన్సర్‌కు గురైన వారిలో మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటోంది. మనదేశంలో ఏడాదికి పది లక్షల మంది వరకు ఈ క్యాన్సర్లకు గురవుతున్నారు. వారిలో దాదాపు రెండు లక్షల మంది వరకు ఈ క్యాన్సర్‌కు సంబంధించినవారే. పొగాకును అనేక రకాలుగా ఉపయోగించడం, సున్నంతో కలిపి ఎక్కువసేపు నోటిలో ఉంచుకోవడం, తమలపాకు, వక్క నమలడం వంటి అలవాట్లే మనదేశంలో ఈ సంఖ్య ఇంతగా పెరగడానికి దోహదం చేస్తున్నాయి.

తొలిదశలో అంటే స్టేజ్ 1, స్టేజ్ 2 లలో కనుగొంటే... కేవలం సర్జరీతోనే ఈ క్యాన్సర్‌కు శాశ్వత పరిష్కారం లభించవచ్చు. సర్జరీ తర్వాత చాలాసార్లు రీ-కన్‌స్ట్రక్టివ్ సర్జరీ అవసరం ఉంటుంది. స్టేజ్ 3, స్టేజ్ 4 లలో కీమో, రేడియేషన్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. 3 డీసీఆర్, వీఎమ్ఏటీ, ఐఎమ్ఆర్‌టీ, ఐజీఆర్‌టీ, బ్రాకీథెరపీ, బీమ్ థెరపీ వంటి ఆధునిక రేడియోథెరపీ పద్ధతులలో చికిత్స విధానాలుంటాయి. సాధారణంగా ఈ క్యాన్సర్‌కు కీమోథెరపీ పాత్ర ఒకింత తక్కువే అని చెప్పుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో కీమోను కంబైన్‌డ్ ట్రీట్‌మెంట్‌గా లేదా కొంతవరకు ఉపశమనంగా ఉపయోగిస్తారు.

ఈ చికిత్స తర్వాత బాధితులు తమకు ఇంతకుముందు ఉన్న అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలి. నోటి పరిశుభ్రతను పాటించాలి. ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, జా–స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్‌ల వంటి వాటిని అనుసరించాలి. డాక్టర్లు సూచించిన మేరకు తప్పనిసరిగా ఫాలో-అప్‌లో ఉండాలి.

మానసిక ఒత్తిడి, విటమిన్ల లోపంతో వచ్చే నోటి పొక్కులు, అల్సర్స్ బాధాకరంగా ఉంటాయి కాబట్టి మనం వాటిని ఎక్కువగా పట్టించుకుంటూ ఉంటాం. నొప్పిలేని వాటిని నిర్లక్ష్యం చేస్తాం. నోటిలో నొప్పి లేకుండా తెలుపు (ల్యూకోప్లేకియా) లేదా ఎరుపు (ఎరిథ్రోప్లేకియా) రంగులో ప్యాచెస్ కనిపించినప్పుడు తప్పక పరీక్షలు చేయించుకోవాలి. చాలా మంది డెంటల్ చెకప్స్ లేదా దంత, చిగుర్ల సంబంధిత సమస్యలతో డెంటిస్టుల దగ్గరికి వెళ్లినప్పుడు ఈ సమస్యలు బయటపడుతూ ఉంటాయి. అందుకే తరచూ దంతవైద్యుడిని కలుస్తూ, నోటి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటూ ఉండటం అవసరం.



డా. సీహెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్,
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్ నంబరు: 9849022121



జీవన్-బాలాజీ ద్వయం సంచలనం

చివరి నిమిషంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఆడే అవకాశం దక్కించుకున్న భారత డబుల్స్ జోడీ జీవన్ నెడుంజెళియన్-శ్రీరామ్ బాలాజీ సంచలనం సృష్టించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో జీవన్-శ్రీరామ్ బాలాజీ ద్వయం 7-6 (8/6), 2-6, 6-4తో ఐదో సీడ్ ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)-ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) జోడీని బోల్తా కొట్టించి రెండో రౌండ్‌కు చేరుకుంది.

'మిక్స్‌డ్' ప్రిక్వార్టర్ ఫైనల్లో సానియా జోడీ




తన కెరీర్‌లో చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన తొలి రౌండ్‌లో సానియా-రోహన్ బోపన్న (భారత్) జోడీ 7-5, 6-3తో జైమీ ఫోర్లిస్-ల్యూక్ సావిల్లె (ఆస్ట్రేలియా) ద్వయంపై నెగ్గింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా-బోపన్న ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

మన బౌలింగ్ భళా...

ఎలాంటి సంచలన ప్రదర్శనలు, ఎలాంటి ప్రతిఘటన, పోరాటాలు లేవు... అంతా ఏకపక్షమే, భారత్ పక్షమే.. తొలి వన్డేలో మన జట్టును వణికించిన న్యూజిలాండ్ రెండో పోరులో పూర్తిగా చేతులెత్తేసింది. భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేక 108 పరుగులకే ఆట కట్టేసి ముందే ఓటమికి సిద్ధమైంది. ఆ తర్వాత ఆడుతూ పాడుతూ ఛేదన పూర్తి చేసిన భారత్ మరో సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది.

- 108 పరుగులకే కుప్పకూలిన కివీస్
- 8 వికెట్లతో భారత్ ఘనవిజయం
- 2-0తో వన్డే సిరీస్ సొంతం
- మంగళవారం ఇండోర్‌లో చివరి వన్డే



షమీ



మ్యాచ్ సమయంలో మైదానంలోకి దూసుకొచ్చి రోహిత్‌ను హత్తుకున్న అభిమాని

రాయ్‌పూర్: తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లో రాయ్‌పూర్ అభిమానులకు తగిన ఆనందం దక్కలేదు. మొత్తం మ్యాచ్ 54.4 ఓవర్లలోనే ముగిసిపోయింది. శనివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 34.3 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. భారత్‌పై ఆ జట్టుకు ఇది మూడో అత్యల్ప స్కోరు. గ్లెన్ ఫిలిప్స్ (52 బంతుల్లో 36; 5 ఫోర్లు) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షమీ (3/18) కివీస్‌ను దెబ్బ తీశాడు. అనంతరం భారత్ 20.1 ఓవర్లలో 2 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (50 బంతుల్లో 51; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (53 బంతుల్లో 40 నాటౌట్; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 72 పరుగులు జోడించి విజయానికి పునాది వేశారు. భారత్‌కు సొంతగడ్డపై ఇది వరుసగా ఏడో వన్డే సిరీస్ విజయం. చివరిదైన మూడో వన్డే మంగళవారం ఇండోర్‌లో జరుగుతుంది.

సమష్టి వైఫల్యం...

ఇన్నింగ్స్ ఐదో బంతికి అలెన్ (0)ను షమీ బౌల్డ్ చేయడంతో కివీస్ పతనం మొదలైంది. ఆ తర్వాత పరుగు తేడాతో నికోల్స్ (2), మిచెల్ (1) వెనుదిరగ్గా... ఆరు బంతుల వ్యవధిలో కాన్వే (7), లాథమ్ (1) అవుటయ్యారు. దాంతో కేవలం 15 పరుగుల స్కోరు వద్దే కివీస్ సగం బ్యాటర్లు పెవిలియన్ చేరారు. ఈ దశలో ఫిలిప్స్‌తో కలిసి గత మ్యాచ్ హీరోలు బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్ పోరాడారు. ఫిలిప్స్... ఆరో వికెట్‌కు బ్రేస్‌వెల్‌తో 41 పరుగులు, ఏడో వికెట్‌కు సాన్‌ట్నర్‌తో 47 పరుగులు జోడించాడు. షమీ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి జోరు పెంచే ప్రయత్నం చేసిన బ్రేస్‌వెల్ తర్వాతి బంతికి అవుట్ కాగా, కుల్దీప్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన సాన్‌ట్నర్‌ను పాండ్యా వెనక్కి పంపించాడు. స్కోరు 100 దాటాక తర్వాతి రెండు వికెట్లు సుందర్ ఖాతాలో చేరగా, కుల్దీప్ చివరి వికెట్ పడగొట్టాడు.

స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. రోహిత్, గిల్ చక్కటి షాట్లతో పరుగులు రాబట్టడంతో 10 ఓవర్లలో స్కోరు 52/0కు చేరింది. 47 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ పూర్తయ్యాక టిక్నర్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. కోహ్లి (11) విఫలంకాగా... అప్పటికే కుదురుకున్న గిల్... ఇషాన్ కిషన్ (8 నాటౌట్)తో కలిసి మ్యాచ్‌ను ముగించాడు.

రోహిత్ మతిమరుపు...



టాస్ సమయంలో అనూహ్య ఘటన జరిగింది. టాస్ గెలిచిన రోహిత్ ఏం ఎంచుకోవాలో చెప్పకుండా కొన్ని క్షణాల పాటు తటపటాయించాడు. టాస్ గెలిస్తే ఏం చేయాలో తాను మరచిపోయానని అంటూ కొంత ఆలోచించి, ఆలోచించి చివరకు ఫీల్డింగ్ అంటూ చెప్పడం నవ్వు తెప్పించింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (బి) షమీ 0; కాన్వే (సి అండ్ బి) పాండ్యా 7; నికోల్స్ (సి) గిల్ (బి) సిరాజ్ 2; మిచెల్ (సి అండ్ బి) షమీ 1; ఫిలిప్స్ (సి) సూర్యకుమార్ (బి) సుందర్ 36; బ్రేస్‌వెల్ (సి) ఇషాన్ (బి) షమీ 22; సాన్‌ట్నర్ (బి) పాండ్యా 27; షిప్లీ (నాటౌట్) 2; ఫెర్గూసన్ (సి) సూర్యకుమార్ (బి) సుందర్ 1; టిక్నర్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (34.3 ఓవర్లలో ఆలౌట్)** 108. **వికెట్ల పతనం:** 1-0, 2-8, 3-9, 4-15, 5-15, 6-56, 7-103, 8-103, 9-105, 10-108. **బౌలింగ్:** షమీ 6-1-18-3, సిరాజ్ 6-1-10-1, శార్దుల్ 6-1-26-1, హార్దిక్ పాండ్యా 6-3-16-2, కుల్దీప్ 7.3-0-29-1, వాషింగ్టన్ సుందర్ 3-1-7-2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) షిప్లీ 51; గిల్ (నాటౌట్) 40; కోహ్లి (స్టంప్డ్) లాథమ్ (బి) సాన్‌ట్నర్ 11; ఇషాన్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20.1 ఓవర్లలో 2 వికెట్లకు) 111. వికెట్ల పతనం:** 1-72, 2-98. **బౌలింగ్:** ఫెర్గూసన్ 5-0-21-0, షిప్లీ 5-0-29-1, టిక్నర్ 4-0-19-0, సాన్‌ట్నర్ 4.1-0-28-1, బ్రేస్‌వెల్ 2-0-13-0.

ముగ్గురు సభ్యులతో కమిటీ

- కేంద్ర క్రీడా శాఖ ప్రకటన
- విచారణ ముగిసేవరకు డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్ష పదవికి బ్రిజ్‌భూషణ్ దూరం
- డబ్ల్యూఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్ సస్పెండ్
- నిరసన విరమించిన రెజ్లర్లు



మీడియా సమావేశంలో కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్, రెజ్లర్లు బజరంగ్, వినేశ్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్‌లో నెలకొన్న తాజా వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్ర క్రీడాశాఖ నడుం బిగించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు, ఇతర సమస్యలపై విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు క్రీడా శాఖ ప్రకటించింది. ఇదే కమిటీ ఇకపై రెజ్లింగ్ రోజువారీ వ్యవహారాలు కూడా పర్యవేక్షిస్తుంది. విచారణ ముగిసే వరకు బ్రిజ్‌భూషణ్ తన పదవి నుంచి దూరంగా ఉంటారు. ఈ వివాదంలో డబ్ల్యూఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కేంద్ర క్రీడా శాఖ సస్పెండ్ చేసింది. శనివారం బ్రిజ్‌భూషణ్ పర్యవేక్షణలో ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో మొదలైన జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ రెజ్లింగ్ టోర్నమెంట్‌ను నిలిపివేయాలని కేంద్ర క్రీడా శాఖ ఆదేశించింది. రెజ్లింగ్ వివాదంపై చర్చించేందుకు అనురాగ్ ఠాకూర్, క్రీడా కార్యదర్శి సుజాత చతుర్వేది, 'సాయ్' డీజీ సందీప్ ప్రధాన్‌లు శనివారం సమావేశమయ్యారు. ఏర్పాటు చేయబోయే కమిటీలో సభ్యుల పేర్లను ఆదివారం ప్రకటించే అవకాశం ఉంది. రెజ్లర్ల నిరసన నేపథ్యంలో ఈ అంశంపై విచారించేందుకు శనివారమే భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) కూడా ఇప్పటికే ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. మేరీకోమ్, యోగేశ్వర్, డోలా బెనర్జీ తదితరులు ఇందులో ఉన్నారు. ఈ కమిటీ ప్రకటన తర్వాత రెజ్లర్లు అర్ధరాత్రి తమ నిరసనను విరమించారు. మరోవైపు తాజా ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ క్రీడా శాఖ ఇచ్చిన ఆదేశాలపై డబ్ల్యూఎఫ్‌ఐ స్పందించింది. రెజ్లర్లు చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలనీ డబ్ల్యూఎఫ్‌ఐ సభ్యులు స్పష్టం చేశారు. ఈ ఏడాది డబ్ల్యూఎఫ్‌ఐలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా తమను దెబ్బ తీసేందుకు వెనక నుంచి ఇదంతా నడిపిస్తున్నారని, ఇప్పటివరకు కూడా ఫెడరేషన్ ఆటగాళ్ల ప్రయోజనాల కోసమే పారదర్శకంగా పని చేసిందని కార్యదర్శి వీఎస్ ప్రసూద్ వివరణ ఇచ్చారు.

ప్రపంచకప్ హాకీ టోర్నీ

నేటి 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లు

మలేసియా x స్పెయిన్
సాయంత్రం గం. 4:30 నుంచి

భారత్ x న్యూజిలాండ్
రాత్రి గం. 7 నుంచి

స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

నోట్: 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌ల్లో గెలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటాయి.

భారత్‌కు తొలి ఓటమి

పోష్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): తొలిసారి నిర్వహిస్తున్న అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన టీమిండియా... శనివారం జరిగిన 'సూపర్ సిక్స్' గ్రూప్-1 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18.5 ఓవర్లలో 87 పరుగులకే ఆలౌటైంది. శ్వేత సెహ్రావత్ (21; 3 ఫోర్లు), హృషిత (14; 1 ఫోర్), టిటాస్ సాధు (14; 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. అనంతరం ఆస్ట్రేలియా 13.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసి గెలిచింది. నేడు జరిగే రెండో మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ ఆడుతుంది.

ఎదురులేని జొకోవిచ్

- ప్రిక్వార్టర్ ఫైనల్లో సెర్బియా స్టార్
- పోరాడి ఓడిన ముర్రే



జొకోవిచ్

మెల్‌బోర్న్: పదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన తొమ్మిదిసార్లు చాంపియన్, సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ఆ దిశగా మరో అడుగు ముందుకేశాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో నాలుగో సీడ్ జొకోవిచ్ 7-6 (9/7), 6-3, 6-4తో 27వ సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలిచి ఈ టోర్నీలో 13వసారి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. 3 గంటల 7 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించాడు. 28 విన్నర్స్ కొట్టిన అతడు 22 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 20 సార్లు దూసుకొచ్చి 15 సార్లు పాయింట్లు గెలిచాడు. ఐదుసార్లు దిమిత్రోవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయాడు.

మరోవైపు ఐదుసార్లు రన్నరప్, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే కథ ముగిసింది. తొలి రెండు రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదు సెట్‌లపాటు పోరాడి గెలిచిన ముర్రే మూడో రౌండ్‌లో మాత్రం పుంజుకోలేకపోయాడు. బాటిస్టా అగుట్ (స్పెయిన్) 6-1, 6-7 (7/9), 6-3, 6-4తో ముర్రేను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా), తొమ్మిదో సీడ్ హోల్గర్ రూన్ (డెన్మార్క్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. 2004 తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అత్యధికంగా నలుగురు అమెరికా ఆటగాళ్లు ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు.

సబలెంకా, గార్సియా ముందంజ

మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్), 12వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టారు. మూడో రౌండ్ మ్యాచ్ ల్లో సబలెంకా 6-2, 6-3తో ఎలీజ్ మెర్‌టెన్స్ (బెల్జియం)పై, గార్సియా 1-6, 6-3, 6-3తో లౌరా సీగెమండ్ (జర్మనీ)పై, బెన్‌చిచ్ 6-2, 7-5తో కామిల్లా జియార్జి (ఇటలీ)పై గెలిచారు.

సినిమా



బిజీ బిజీ

● కథానాయికల క్యాలెండర్

హీరోలు దాదాపు ఒకే భాషకు పరిమితం అవుతారు. అయితే హీరోయిన్లు పలు భాషల్లో నటిస్తుంటారు. అందుకే కొందరు కథానాయికలు కొత్త సినిమాలకు డేట్స్ ఇవ్వడానికి డైరీని ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని అవకాశాలు వస్తాయి. మరి.. ఈ ఏడాది క్యాలెండర్‌లో ఏ హీరోయిన్ డైరీలో ఎన్ని చిత్రాలున్నాయో తెలుసుకుందాం.





అనుష్క: అనుష్క లీడ్ రోల్‌లో రూపొందిన 'నిశ్శబ్దం' సినిమా 2020 అక్టోబర్ 2న రిలీజైంది. ఆ తర్వాత రెండేళ్లు ఆమె తెరపై కనిపించలేదు. దాంతో అనుష్క నెక్ట్స్ ప్రాజెక్ట్ ఏంటి? అనేది ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో యువ హీరో నవీన్ పోలిశెట్టి హీరోగా నటిస్తున్న సినిమాలో నటించేందుకు పచ్చజెండా ఊపి, అందర్నీ ఆశ్చర్యపరిచారు అనుష్క. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రంతో బిజీగా ఉన్నారు అనుష్క.

త్రిష: ప్రస్తుతం త్రిష చేతిలో నాలుగు సినిమాలున్నాయి. వాటిలో 'సదురంగ వేట్టై 2, పొన్నియిన్ సెల్వన్ 2, ది రోడ్' వంటి తమిళ చిత్రాలతో పాటు మోహన్ లాల్ హీరోగా నటిస్తున్న మలయాళ చిత్రం 'రామ్' ఉన్నాయి. ఇక 2016లో విడుదలైన 'నాయకి' తర్వాత త్రిష తెలుగులో నేరుగా ఏ సినిమాలోనూ నటించలేదు.

తమన్నా: ఇండస్ట్రీకి వచ్చి 17 ఏళ్లు అవుతున్నా వరుస ఆఫర్లతో బిజీగా ఉన్నారు మిల్కీ బ్యూటీ తమన్నా. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'భోళా శంకర్', తమిళ్‌లో రజనీకాంత్ సరసన 'జైలర్', మలయాళంలో 'బాంద్రా' అనే సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఆమె నటించిన తాజా హిందీ చిత్రం 'బోలే చూడియా' విడుదలకు సిద్ధంగా ఉంది.

కాజల్ అగర్వాల్: ఈ ఏడాది నాలుగు సినిమాలతో అలరించనున్నారు కాజల్. ఆమె నటించిన తమిళ చిత్రాలు 'కరుంగాప్పియమ్, ఘోస్టీ' విడుదలకు సిద్ధమవుతున్నాయి. హిందీలో చేసిన 'ఉమ' కూడా విడుదల కావాల్సి ఉంది. ఇక కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఇండియన్ 2' (భారతీయుడు 2) చిత్రంలో నటిస్తున్నారు.

నయనతార: గత ఏడాది తెలుగులో 'గాడ్ ఫాదర్' చిత్రంలో నటించిన నయనతార ఈ ఏడాది తెలుగు సినిమాలేవీ కమిట్ కాలేదు. హిందీ చిత్రం 'జవాన్'లో షారుక్ ఖాన్ సరసన నటిస్తున్నారామె. బాలీవుడ్‌లో నయనకి ఇది తొలి చిత్రం. తమిళంలో 'ఇరైవన్' చిత్రంలో నటిస్తున్నారు.

శ్రుతీహాసన్: ఈ ఏడాది సంక్రాంతికి 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' చిత్రాల్లో అలరించారు శ్రుతీహాసన్. ప్రస్తుతం ఆమె ప్రభాస్‌కి జోడీగా 'సలార్'లో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 28న విడుదలకానుంది. మరోవైపు 'ది ఐ' అనే ఇంగ్లిష్ ప్రాజెక్ట్‌లోనూ నటిస్తున్నారు శ్రుతీహాసన్.

కీర్తీ సురేశ్: ప్రస్తుతం అరడజనుకు పైగా సినిమాల్లో నటిస్తున్నారు. కీర్తీ సురేశ్. తెలుగులో చిరంజీవి హీరోగా రూపొందుతోన్న 'భోళా శంకర్'లో చిరంజీవి చెల్లెలి పాత్ర చేస్తున్నారు కీర్తి. నాని హీరోగా తెరకెక్కుతోన్న 'దసరా'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. తమిళ్‌లో 'మామన్నన్, సైరన్, రఘు తాతా, రివాల్వర్ రీటా' వంటి చిత్రాలతో జోరుగా ఉన్నారు కీర్తీ సురేశ్.

పూజా హెగ్డే: గత ఏడాది ఐదు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించిన పూజా హెగ్డే ప్రస్తుతం ఒక తెలుగు, మరో హిందీ సినిమా చేస్తున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో మహేశ్‌బాబుకి జోడీగా నటిస్తున్నారామె. అలాగే 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' అనే హిందీ చిత్రం చేస్తున్నారు.

రష్మికా మందన్న: కన్నడ బ్యూటీ రష్మికా మందన్నా ఈ సంక్రాంతికి 'వారీసు' ('వారసుడు) తో తెరపైకి వచ్చారు. అలాగే హిందీలో నటించిన 'మిషన్ మజ్ను' శుక్రవారం రిలీజైంది. ప్రస్తుతం ఆమె తెలుగులో అల్లు అర్జున్ సరసన 'పుష్ప 2'లో నటిస్తున్నారు. అలాగే రణ్‌బీర్ కపూర్ సరసన హిందీ చిత్రం 'యానిమల్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు.

కృతీ శెట్టి: గత ఏడాది 'బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు కృతి. ప్రస్తుతం ఆమె నటిస్తున్న తెలుగు చిత్రం 'కస్టడీ'. 'బంగార్రాజు' తర్వాత నాగచైతన్య సరసన ఆమె నటిస్తున్న చిత్రం ఇది. అలాగే 'అజయింటే రండం మోషణం' అనే మలయాళ చిత్రంలోనూ నటిస్తున్నారు.

శ్రీలీల: దక్షిణాదిలో దూసుకెళుతున్న యంగ్ హీరోయిన్ల జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్నారు శ్రీలీల. 'పెళ్లిసందడి' సినిమాతో తెలుగుకి పరిచయమైన ఈ బ్యూటీ గత ఏడాది 'ధమాకా'లో కనిపించారు. ప్రస్తుతం మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంతో పాటు బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న మూవీలో నటిస్తున్నారు. అలాగే రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న సినిమాతో పాటు 'అనగనగా ఒకరాజు, జూనియర్ (తెలుగు-కన్నడ) వంటి సినిమాలతో తీరిక లేకుండా ఉన్నారీ బ్యూటీ.

అదేవిధంగా బాలీవుడ్ బ్యూటీలు దీపికా పదుకోన్, కియారా అద్వానీ, కృతీ సనన్ అటు తెలుగు, ఇటు హిందీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ప్రాజెక్ట్ కె'తో దీపికా పదుకోన్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. బాలీవుడ్‌లో ఆమె నటించిన 'పఠాన్' ఈ నెల 25న రిలీజ్ కానుండగా, 'ఫైటర్' అనే సినిమాలో నటిస్తున్నారు దీపిక. ఇక రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'వినయ విధేయ రామ' తర్వాత చరణ్-కియారా జంటగా నటిస్తున్న చిత్రమిది. అలాగే 'సత్యప్రేమ్ కీ కథ' అనే హిందీ చిత్రం చేస్తున్నారు కియారా. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ తెరకెక్కించిన 'ఆది పురుష్'లో హీరోయిన్‌గా నటించారు కృతీ సనన్. జూన్ 16న ఈ సినిమా విడుదల కానుంది. హిందీలో 'షెహజాదా, గణపత్'తో పాటు మరో సినిమా చేస్తున్నారు కృతీ సనన్.



సమంత లీడ్ రోల్ చేసిన 'యశోద' గత ఏడాది రిలీజైన విషయం తెలిసిందే. గుణశేఖర్ దర్శకత్వంలో ఆమె లీడ్ రోల్ చేసిన 'శాకుంతలం' ఫిబ్రవరి 17న విడుదల కానుంది. ప్రస్తుతం శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న 'ఖుషి'లో విజయ్ దేవరకొండకి జోడీగా నటిస్తున్నారు సమంత. మరోవైపు 'సిటాడెల్' అనే వెబ్ సిరీస్ కమిట్ అయ్యారు. అయితే మయోసైటిస్ వ్యాధి చికిత్సలో భాగంగా ఆరు నెలలుగా షూటింగ్స్‌కు దూరంగా ఉంటున్నారామె. ఇప్పుడు కోలుకున్న సమంత ముంబైలో 'సిటాడెల్' షూట్‌లో పాల్గొంటున్నారు. సమంతకు పేరు తెచ్చిన 'ది ఫ్యామిలీమేన్ 2' వెబ్ సిరీస్‌కి దర్శకత్వం వహించిన రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌కి దర్శకులు.





కామెరూన్, రాజమౌళి, కీరవాణి

హాలీవుడ్‌కి వస్తారా.. చర్చించుకుందాం

- రాజమౌళితో కామెరూన్

అమెరికాలో ఇటీవల జరిగిన క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్ ప్రదానోత్సవం వేదికగా హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్, ఇండియన్ డైరెక్టర్ రాజమౌళి కలిసిన సంగతి తెలిసిందే. 'ఆర్ఆర్ఆర్' సినిమాను జేమ్స్ కామెరూన్ రెండుసార్లు చూసి ప్రశంసించారని సోషల్ మీడియా వేదికగా రాజమౌళి పేర్కొన్నారు. కాగా జేమ్స్ కామెరూన్, రాజమౌళిల సంభాషణకు సంబంధించిన ఓ వీడియోను 'ఆర్ఆర్ఆర్' టీమ్ శనివారం షేర్ చేసింది. ''సినిమాలో చూపిన ఫైర్ అండ్ వాటర్ కాన్సెప్ట్, కథలో ఉన్న ట్విస్ట్‌ అండ్ టర్న్స్, రామ్, భీమ్ పాత్రల స్నేహం, ఇద్దరూ ఎందుకు శత్రువులయ్యారు? అనే అంశాలు ఆసక్తికరంగా అనిపించాయి. మీరు (రాజమౌళిని ఉద్దేశించి) ఇక్కడ (హాలీవుడ్‌లో) సినిమా చేయాలనుకుంటే మనం ఓసారి చర్చించుకుందాం. మీరు (కీరవాణిని ఉద్దేశించి) కంపోజ్ చేసిన మ్యూజిక్ చాలా బాగుంది. గోల్డెన్ గ్లోబ్స్ అవార్డ్స్ వేడుకలో మిమ్మల్ని చూశాను'' అంటూ 'ఆర్ఆర్ఆర్'ను ప్రశంసిస్తూ జేమ్స్ కామెరూన్ మాట్లాడిన విషయాలు ఈ వీడియోలో ఉన్నాయి. అదే విధంగా జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో వచ్చిన అన్ని సినిమాలను తాను చూశానని, అద్భుతంగా ఉన్నాయనీ రాజమౌళి ఈ వీడియోలో మాట్లాడారు. ఇక క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్‌లో 'ఆర్ఆర్ఆర్'కు రెండు అవార్డులు (బెస్ట్ ఫారిన్ ఫిల్మ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్) వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో అవార్డు అందుకున్నారు కీరవాణి. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ రేస్‌లో ఉంది. ఈ నెల 24న నామినేషన్లు ప్రకటిస్తారు. మరి.. 'ఆర్ఆర్ఆర్'కి ఆస్కార్ నామినేషన్ దక్కుతుందా? చూడాలి.

ఆ బాధ్యత మాదే

- ఆశిష్ విద్యార్థి



''తోటి నటీనటులతో పాటు యాక్ట్ చేస్తూ, నా పాత్రకు ఎంత వరకు న్యాయం చేస్తున్నాననే విషయంపై మాత్రమే నేను దృష్టి పెడతాను. అంతేకానీ ఇది చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడాలు చూడను'' అన్నారు నటుడు ఆశిష్ విద్యార్థి. సుహాస్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీ రోల్ చేసిన నటుడు ఆశిష్ విద్యార్థి మాట్లాడుతూ– ''మంచి హ్యూమర్, ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది. ఈ చిత్రంలో కొడుకు ఏదో సాధిస్తాడని ఆశపడే ఓ మధ్యతరగతి తండ్రి పాత్రలో నటించాను. కానీ ఈ తండ్రి జీవితంలో ఓ ట్విస్ట్ ఉంటుంది. ఈ సినిమాలో నాకు, రోహిణీగారికి మధ్య వచ్చే సన్నివేశాలు అలరిస్తాయి'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''చేసే ప్రతి పాత్రను నేను డ్రీమ్ రోల్‌గానే భావిస్తాను. మొదట్లో విలన్ రోల్స్ చేశాను. అయితే నాకు కామెడీ అంటే ఇష్టం. కానీ నాకు అన్ని రకాల పాత్రలూ చేయాలని ఉంది. అయితే మనకు ఎటువంటి పాత్రలు ఇవ్వాలనేది దర్శక-రచయితలపై ఆధారపడి ఉంటుంది. అలాగే ఏ పాత్ర ఇచ్చినా ఆ పాత్రకు మేం న్యాయం చేస్తామనే నమ్మకాన్ని వారిలో కలిగించే బాధ్యత మా ఆర్టిస్టులదే'' అని అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech/ C. Govt. Asst. మేనేజర్/పంజాబ్ నేషనల్ బ్యాంక్/ 60,000/-PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10052]

క్రిస్టియన్ మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్/పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్/85,000/-PM/6"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10052]

SC హిందు మాల/B.Tech/Govt. AEE/ ట్రాన్స్‌కో/1 Lakh PM/6" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10052]

క్రిస్టియన్ మాల/28/B.Tech/జాబ్ హైదరాబాద్/వెల్ సెటిల్ ఫ్యామిలీ. కాంటాక్ట్: 6301972030 (క్రిస్టియన్ పెళ్లి సంబంధాలు అన్ని ప్రాంతాల వారికి చూసే నమ్మకమైన Matrimony) [HA-10055]

రెడ్డి/విడోయర్/50yrs/ఓన్ బిజినెస్/15 Lak PM/వెల్ సెటిల్డ్ వరునికి వధువు కావలెను. కుల కట్నం ప్రసక్తి లేదు, పిల్లలున్నా OK, డైరెక్ట్. Ph: 9959994066 [HA-10055]

యాదవ/ M.Tech / C.Govt. Income Tax Inspector/1 LakhPM/5'8" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph : 8008965895 [HA-10056]

మాల హిందూ/M.Tech/C. Govt.Asst. Manager(RBI)/80,000/-PM/5'8" ఎత్తు/ 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10056]

II Match CNB కాపు/45/5'7"/Govt. Job (Two Own Houses), 4C, 18L P/A బాగా స్థిరపడిన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6301621607 [HA-10058]

SC మాదిగ/30/5'9"/ B.Tech, MBA, Govt. Job DRDO, 12L P/A వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [HA-10058]

GOUDs CNB/30/5'9"/B.Tech IIT, SWE Job/ 25L P/A వెల్‌సెటిల్డ్ Family వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [HA-10058]

మాదిగ/M.Tech/ Govt. AE/జెన్‌కో/ 1 Lakh pm/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9642459724 [HA-13188]

గౌడ/B.Tech/ C. Govt. Asst. మేనేజర్/ SBI/ 82,000/-pm/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9052296834 [HA-13188]

కాపు/కుల పట్టింపులేదు/48yrs/ Govt. ఎంప్లాయి, 80,000/-pm, Own House, 5 Cr. ప్రాపర్టీ, పిల్లలులేని వరునికి వధువు కావలెను. Ph: 8978651721 [HA-13188]

నాయుడు/ 40 yrs/5'9"/ 2nd మ్యారేజ్ /B.Ed/ కలర్: Fair/ సాఫ్ట్ వేర్ జాబ్/80k per M,Any Cast అయిన OK వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8500427582 [H-792580]

OC Caste/ 35 yrs/5'9"/ M.A., B.Ed/ కలర్: Fair/Govt Job/75k per M, Any Caste అయిన OK వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8500427582 [H-792580]

రెడ్డి వరుడు(ఇస్కాన్)వెజ్- US MS H1B/5'10"/ 32y/ 120K, 10Cr ప్రాపర్టీ కలిగిన వరుడికి వధువు కావలెను. Ph: 9030315599 [H-792580]

బ్రాహ్మణ/విడోవర్/ 42y/ వరుడికి చిన్న బాబు, దేవాలయ యజమాని నెలకు 2 లక్షల సంపాదన 2 ఇళ్ళు కలిగిన వరుడికి డైవర్సీ, విడో వధువు కావలెను. Ph: 7036298104 [H-792580]

Reddy/రెండవ పెళ్లి–37/5'9"/MBBS. MD & 33/5'7"/B.Tech/SWE/Hyd & 33/ 5'9"/ B.Tech/MS/USA. Contact: 9391198332 [H-792910]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Business/B.Tech/MBA/1993/5'10"/300Cr. *1997/100Cr. * Cont: K.C. Reddy-Mar-Bur-Road No.3-B. Hills-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Business/B.Tech/1988/5'11"/300Cr. *1995/5'9"/250Cr. * Cont: K.C. Reddy -Mar-Bur-Road No.3-B.Hills-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/Job/Hyd/1994/5'8"/200Cr. *1988 Business/Hyd/ 5'8"/200Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/9347807015

Reddy/B.Tech/NIT/MS/MBA/USA/230K/1995/6'/200Cr. *1991/5'11"/130K/200Cr. * Cont:K.C. Reddy-Mar-Bur- Hyd. Ph:9849321309/9347807015

Reddy/Business/B.Tech/MBA/UK/1994/5'11"/250Cr. *1994/5'9"/350Cr. * Cont: K.C. Reddy-Mar-Bur- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Business (Exports)B.Tech/ MBA/1995/6'/100Cr. *1992/5'10"/ 300 Cr. * Cont : K.C. Reddy-Mar-Bur-Hyd. Ph: 9849321309 /9347807015

Reddy/Business/B.Tech/1990/6'/1000 Cr. *1989/5'11"/500Cr. *1993/5'7"/50Cr. *Cont: K.C. Reddy - Mar-Bur-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG/Sup.Spl.*1994/5'10"CARD /75Cr.*(Gastro)/1993/5'10"/50Cr.* Mch/1989/ 5'9"/ 30Cr. *MD/1995 5'10" / 300Cr. * Cont: K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/USA-Citizen BS/MS/MBA/1995/ 5'10"/260K/70Cr. *1991/230K/5'10"/25Cr. *1992/5'11"/250K/30Cr. *Cont: K.C.Reddy -Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/USA/Res.Doc.*1989/ 5'10" *1992/5'11". *1994/5'9". *1990/5'10". * 1991 /5'10". *1990/6'. *1975/6' * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309/ 9347807015 [P-430]

వరుడు కావలెను

Reddy/B.Tech/MS/OwnBusiness/ Hyd /1993/5'3" / 1000Cr. *1994/5'7"/ 1500 Cr. * Cont: K.C. Reddy-Mar-Bur-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG. *1994/5'3"/75Cr. *1993/ 5'3"/50Cr. *1990/100Cr. *1993/5'7"/100Cr. *1994/5'4"/50Cr. *1994/5'10"/50Cr. *1996/ 5'4"/50Cr. Cont: K.C.Reddy. Ph: 9849321309

Reddy/B.Tech/ MS/ USA/1997/5'5"/10Cr. *1996/5'8"/15Cr. 1996/5'7"/50Cr. 1990/ 5'8"/100Cr. 1996/5'5"/15Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/Most Beautiful/1996/5'9"/100Cr. *1990/ 5'8" /160K/100Cr. *1996/5'7"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech / 1994 / 5'6"/ 100Cr * 1995/ 5'8"/ 100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3, B.Hills- Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/BDS-Doc / USA/ 1995 / 5'5" / 8Cr/Needs USA alliance & Well Settled. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/BE/(NIT)/MBA/Most Beautiful /1996/5'9"/10Cr.* Need Good Alliance India or Abroad. *Cont: K.C. Reddy - Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful/Rich. *LLM/1995/5'3"/150Cr.*MS/1996/5'9"/ 100 Cr. *BBA/1997/5'4"/100Cr. *1994/ 5'6"/ 100Cr. *1995/5'8"/100Cr * 9347807015

Reddy/ MS/ INDIA/ 1994/ 5'3"/ 200Cr/ * MBA/ 1988/ 5'3"/ 200Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/1998/5'7"/50Cr. *1996/5'8"/40 Cr. *1999/5'4"/200Cr. *1995 / 5'2"/ 50Cr. * PG/1995 5'7"/20Cr. *1995/5'5"/50Cr. *1997/ 5'3"/25Cr. * Cont: Ph: 9849321309

SC మాల & క్రిస్టియన్/B.Tech(EEE)/ C.Govt.Jr. ఇంజనీర్/ రైల్వే/ 65000/-PM/ 5'9"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-13191]

యాదవ/B.Tech, IIT / M.Tech / NIT/ Govt. AEE/ఇరిగేషన్ Dept/80,000/-PM/ 5'8" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9515755529 [HA-13191]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C. Govt. గెజిటెడ్ ఆఫీసర్/86000/-PM/ 6'ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి అందమైన వధువు కావలెను. Ph: 9618579861 [HA-13191]

SC మాదిగ/M.Tech/Govt.Asst. ఇంజనీర్/జెన్‌కో/1 లక్ష PM/5'10" ఎత్తు/31 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 7032058965 [HA-13191]

రెడ్డి / CNB/ 60Yr/6'0"PV RTD ఫార్మసీ/ 50k (PM)HYD లో సొంత ఇల్లు+కారు డీసెంట్ ఫ్యామిలీకి ఏ బాదర బందీలేని వధువు కావలెను (డైరెక్ట్) సంప్ర: 9347576651, 9346659936. [H-792959]

Reddy-Groom/27/5'10"/ B.Tech/ MS/USA/ 35Cr & 31/5'11"/ B.Tech/MS/USA & 32/5'10"/MD Residency-USA. Ph: 9391198332 [H-792910]

Reddy-Groom/ 31/ 5'10"/ MBA/ SWE/12Lacs P/A & 33/5'10"/ B.Tech /SWE/12Lacs P/A & 27/5'10"/ B.Tech /Govt Job. Contact: 9391198332 [H-792910]

2nd Marriage/Sunni Muslim Boy/ 39/ 5'8"/Andhra (Vijayawada)/ 93K p/m/ Looking for Marriage Proposals. Send Bio-Data & Photos to Marriage_heavan@hotmail.com [H-787482]

Political- Software-Business man, 56, OC wants tall Business Life Partner Lady, 6360474663, Widow Ok. [WB-46751]

Vice President & MD Software Company USA MS $220K Khamma 27 Years. 5'10" Needs Suitable Bride. Cont:9444817468 [NA-21595]

★

మాల హిందూ/33/5'11"/B.E. PR/కెనడా/BM అబ్బాయికి USAలో పనిచేస్తున్న హిందూ తగిన అమ్మాయి కావలెను. సం॥ "శుభమస్తు" DSNR, S. రాములుగౌడ్. Ph: 8790690309 [H-793258]

మాదిగ/గుడ్‌లుకింగ్/వయస్సు: 29/ చదువు: B.Tech, MS/ సాఫ్ట్‌వేర్ జాబ్/ ఎత్తు: 5'8"/ గుడ్‌లుకింగ్/ వెల్‌సెటిల్డ్ గల వరుడికి వధువు కావలెను. కట్నప్రసక్తిలేదు. Ph: 8367619529 [H-793256]

రెడ్డి/గుడ్‌లుకింగ్/వయస్సు: 28/5'9"/ చదువు: B.Tech (IIT)/ సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/ నెలకు 3 లక్షలు/ గుడ్ ఫ్యామిలీ/ వెల్‌సెటిల్డ్ గల వరుడికి వధువు కావలెను. కట్నప్రసక్తిలేదు. Ph: 8367619529 [H-793256]

వైశ్య/కుల పట్టింపులేదు/ గుడ్‌లుకింగ్/వయస్సు: 34/ఎత్తు: 5'8"/ చదువు: M.Com (CA)/ నెలకు లక్ష రూపాయలు/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడికి వధువు కావలెను. కట్నప్రసక్తిలేదు. Ph: 8367619529 [H-793256]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BBA, 25, 5' 10", 200 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 6', SWE, 140 K, 30 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", Consultant, 22 L P/A, 100 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి USA, BE, MS, PhD, 29, 5' 10", Engineer, 120 K, 50 Cr. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MBA, 25, 5' 4", SWE, 50 Crores, Fair & Slim, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5'6", Analyst, H1, 90 K, 5 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 4", Technical Lead, 20 L P/A, Rich, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 26, 5' 4", 150 K, 30 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
D.V. Koti Reddy
98480 11818, 93933 11818

రెడ్డి UK, BE BITS, 28, 5' 10", SWE, 120 K Pounds, 5 Crores Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 6', Analyst, 300 K, H1, 7 Crores,USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DNBSS, 27, 6', Doctor, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 30, 5'9", SWE, 350 K, Rich, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 7", Analyst, 13L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Hyderabad, Slim, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 9", PG Doctor, 50 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MS, 31, 5' 7", Manager, 200 K, 5 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★★

S.C., Mala, 39, 5'8", ఎరుపు, సొంత ఫ్యాక్టరీ, రూ. 20 కోట్లు ప్రాపర్టీ కలిగిన వరునకు వధువు వెంటనే కావలెను. (నో బ్రోకర్స్) నం: 92905 57696 [B-1197483]

M.Sc, B.Ed ఉద్యోగం చేయుచు ఆదర్శ భావం గల సంప్రదాయ కుటుంబం వరునకు కుల మత పట్టింపు లేదు. వధువు కావలెను. డైరెక్ట్ : 8977704570, 9059755776. [C-781294]


డైరెక్ట్/38/5.5/M.com,B.Ed ప్రైవేట్ జాబ్ చేయుచున్న వరుడికి కుల, వయసు, ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. ఇల్లరికం అయినా OK డైరెక్ట్ : 83417 12438 [L-793161]

కాపు: 54సం॥, 5'7" వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ- బిజినెస్-30,000/-P.M. ఆదాయం కలిగిన ఒంటరిగా గల వరునకు వెల్‌సెటిల్డ్ వంటరి మహిళ (వధువు) O.C.B.C కావలెను.సం॥ ✆ 99120 69692-డైరెక్ట్ [O-786901]

కుమ్మరి, Any Caste / కుల, కట్నం ప్రసక్తి లేదు / డైవర్సీ, బ్యాంక్ మేనేజర్, 1 లక్ష PM 30 సం॥ల వరునకు అందమైన వధువు కావలెను. సంప్ర : 80196 34100 [B-786663]

కుల పట్టింపు లేని 33 సంవత్సరముల వరునికి వధువు కావలెను. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ (ఇల్లరికం O.K.) సంప్రదించండి : 73821 32960. [P-1226518]

వరుడు కావలెను



No Caste Bar/1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే. Ph: W: 7794960803 [H-776392]

కుల పట్టింపు లేదు 45Yr/5'2"Govt ఎంప్లాయ్ 80k(PM) /విడో 1పాప మ్యారేజ్ వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకు సెటిల్డ్ అయిన వరుడు కావలెను (పిల్లలు Ok) సంప్ర: 7286031653. [H-792700]

2వపెళ్ళి /35Yr/Govt ఎంప్లాయ్ 2,00,000/- (PM) కుల ప్రసక్తి లేదు/బాగా స్థిరపడిన అందమైన వధువుకి అందమైన వరుడు కావలెను (పిల్లలు ఉన్న Ok) సంప్ర: 9502046384. [H-792700]

విశ్వబ్రాహ్మణ/ఏకైక కుమార్తె/ B.Tech/ Govt.Asst.ఎగ్జి॥ఇంజనీర్/ఇరిగేషన్ Dept/ 50,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10052]

లంబాడి/B.Tech /C.Govt.P.O/ SBI బ్యాంక్/ 45,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-10052]

SC హిందు మాదిగ/B.Tech/Govt. Asst.ఇంజనీర్/ఎలక్ట్రికల్ Dept/ 80,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10052]

యాదవ/M.Tech / Govt.Asst. ఇంజనీర్/ జెన్‌కో/80,000/-PM/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10052]

క్రిస్టియన్ మాల/ఏకైక కుమార్తె/B.Tech / C.Govt.Asst. మేనేజర్/కెనరా బ్యాంక్/7.8 Lakhs P/A/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10052]

కుమ్మరి/50 లక్షల ఆస్తి/CA/ చార్టర్డ్ అకౌంటెంట్/5 Lakhs P/A/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10052]

బెస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/ B.Tech/C.Govt.Asst. మేనేజర్/బ్యాంక్ ఆఫ్ బరోడా/50,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10052]

రెడ్డి/డైవర్సీ/35/5'3"/M.Tech/Central Govt. Officer/6 సం॥ల బాబు కల్గి వెల్ సెటిల్డ్ వధువుకు. Civils/Doctor/SWE.వెల్ సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 9949262231 [HA-10055]

రెడ్డి/2nd మ్యారేజ్/కుల, ఆస్తి ప్రసక్తి లేదు / A:30, Q: డిగ్రీ గల అందమైన వధువుకు మంచి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 9100717575 [HA-10055]

యాదవ/B.Tech/C.Govt.Asst Manager (కెనరా బ్యాంకు)/50,000/-PM/5'4" ఎత్తు /25 సం.ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10056]

మాల హిందూ/B.Tech/C.Govt.ఆఫీసర్ (Income Tax Dept)/55,000/-PM/5'4" ఎత్తు/25 సం.ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10056]

మాల క్రిస్టియన్/B.Tech/C.Govt. P.O (SBI) /60,000/-PM/5'4" ఎత్తు/25 సం.ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10056]

పద్మశాలి/ 25 / 5'4" / B.Tech, MBA / SWE Job/ 15L P/A బాగా స్థిరపడిన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8897091964 [HA-10058]

కులపట్టింపులేదు/విడో/41/ఇరిగేషన్ & CAD Dept./ 1L p/m /25 ఎ॥ భూమి/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. Ph: 8125551246 [H-787482]

రెండవ పెళ్ళి/విడో/52y/Fair/ విజయవాడ/ Govt. ఆఫీసర్/80,000/-p/m/ Own House (Rents)/ ఎలాంటి బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-787482]

కుల ప్రసక్తిలేదు/విడో/45y/District Panchayath Officer, 1.2L p/m/ Own House/ 40 ఎ॥ పొలాలు, కోట్ల ప్రాపర్టీ గల వెల్‌సెటిల్ అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 9121040805 [H-787482]

SC మాదిగ/24/5'5"/Fair/ B.Tech (NIT) GST Officer Customs/ 60,000/-p/m/ అందమైన సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువుకి తగిన Any Govt/SWE వరుడు కావలెను. Ph: 9059470587 [H-787482]

కమ్మ 38Yr/5'5"/కుల పట్టింపు లేదు/2nd మ్యారేజ్, MSE ఫెయిర్ Govt ఎంప్లాయ్ 50k (PM), & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok) సంప్ర: 7075337673. [H-792700]

రెడ్డి 50Yr/5'4"/కుల పట్టింపు లేదు/డిగ్రీ ఫెయిర్/డైవర్స్ పోస్ట్ ఆఫీసు Govt ఎంప్లాయ్ 30k (PM), (ఒక పాప సెటిల్డ్) & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok) సంప్ర: 7075337677. [H-792700]

2వపెళ్ళి /40Yr/Govt ఎంప్లాయ్ 3,00,000/- (PM) కుల ప్రసక్తి లేదు/బాగా స్థిరపడిన అందమైన వధువుకి అందమైన వరుడు కావలెను (పిల్లలు ఉన్న Ok) సంప్ర: 9959815362. [H-792700]

రెడ్డి/విడో/61y/ రిటైర్డ్ పెన్షనర్/ సొంత ఇల్లు/ ఆంధ్రాలో పొలాలు ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబం గల వెల్‌సెటిల్డ్ వధువుకు మంచి స్నేహస్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7995704687 [H-793257]

కమ్మ/52/విడో/5'5"/Fair/ Govt. జాబ్ (H.M)/ సొంత ఇల్లు & రెంట్స్/ 25 ఎ॥ల మాగాణి/2L pm గల ఏ బాదరబందీలేని సాంప్రదాయమైన వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7287079090 [H-793257]

నాయుడు/59y/విడో/పెన్షనర్/Hyd/ సొంత ఇల్లు / ఫంక్షన్‌హాల్/ ఆంధ్రా, తెలంగాణలో ప్రాపర్టీస్ కలిగిన వధువుకు కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 7732008355 [H-793257]

చౌదరి/విడో/60/తక్కువ చదువు/ సొంత బిజినెస్/ సొంత ఇల్లు, వ్యవసాయం గల ఒంటరి వధువుకు మంచి మనసు గల వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 9154778755 [H-793257]

విశ్వబ్రాహ్మణ/ B.Tech / C.Govt. బ్యాంక్ క్యాషియర్/SBI/ 38,000/-pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8886512010 [HA-13188]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తిలేదు/ B.Tech/ SWE/ Hyd/ 2 Lakhs pm/ 5'5" ఎత్తు/ 30 సం॥ల పిల్లలులేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-13188]

వడ్డెర/B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ ఆంధ్రా బ్యాంక్/ 45,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13188]

క్రిస్టియన్ మాల/40 లక్షల ఆస్తి/ ఏకైక కుమార్తె/B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13188]

రెడ్డి/విడో/45/5'6"/ హైదరాబాద్, సొంత ఇల్లు, రెంట్స్, పొలాలు గల కోట్ల ఆస్తి గల అందమైన రెడ్డి ఒంటరి వధువుకి వరుడు కావలెను. వాట్సప్ నెం.9030129988 [HA-13188]

2వ పెళ్లి/35-55y/ Govt., Pvt, సొంత ప్రాపర్టీ గల వధువులు కలరు. తగిన వరులు కావలెను. CNB, ఇల్లరికం Ok. Ph: 8340069430 [HA-13188]

కాపు/ నాయుడు/ విడో/ 56Y/ తక్కువ చదువు/సొంత బిజినెస్/ సొంతఇల్లు/ 5 ఎకరముల వరిపొలము కల సంప్రదాయ వధువుకు/కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9177883844 [H-792580]

కమ్మ / Unmarried / 28Yr / 5'4" / Software in USA/Phyrolysis Industries/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను సంప్ర: 9515117629. [H-792959]

రెడ్డి / 35Yr / కుల పట్టింపు లేదు/ఫెయిర్/Govt. ఎంప్లాయి/1.5 Lac (PM), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, సొంత బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok) సంప్ర: 9490081545. [H-792959]

2వ పెళ్ళి కుల పట్టింపు లేదు 35Yr/M.Sc/C.Govt ఆఫీసర్ 3 లక్షలు (PM) పిల్లలు లేని తెల్లని అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను + (పిల్లలు ఉన్న Ok) సంప్ర: 7396213324. [H-792959]

యాదవ/B.Tech / Govt.Asst.సెక్షన్ ఆఫీసర్/ 50,000/-PM / 5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8897389698 [HA-13191]

బ్రాహ్మణ/30/5'2"B.Com. & 34/5'2"/ ఇంటర్. *35/5'3"B.Tech *36/5'4"/ఇంటర్. *38/ 5'4"/డిగ్రీ వధువులకు జాబ్/బిజినెస్/పురోహితం వరులు కావలెను. వాట్సాప్: 7893005879 [HA-13161]

Reddy Bride- 26/5'6"/V.Fair/50Cr/ B.Tech/MS/USA & 28/5'4"/ B.Tech/ MS/USA & 26/5'4"/ B.Tech/SWE/ 20Lacs P/A/Hyd. Contact : 9391198332 [H-792910]

Reddy Bride- 25/5'5"/V.Fair/MD IIYr. (Radiology)/25Cr & 30/ 5'4"/ MD (PEO) & 32/5'3"/ MBBS/ Govt.Job. Contact : 9391198332 [H-792910]

★

కాపు/చాలా అందమైన/ వయస్సు: 25/ ఎత్తు: 5'6"/ చదువు: B.Tech/సాఫ్ట్‌వేర్ జాబ్/Good ఫ్యామిలీ/ వెల్‌సెటిల్డ్ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-793256]

రెండవ పెళ్ళి/పిల్లలు లేరు/ కుల పట్టింపులేదు/ గుడ్‌లుకింగ్/ వయస్సు: 36 /MBA/ గుడ్ జాబ్/ కోట్లలో ఆస్తి/ గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-793256]

★★

క్రైస్తవ/మాల/ప్రభుత్వ టీచర్/B.Sc.,B.Ed/41/ 5'2"/Fair/ డైవర్సీ వధువుకు క్రైస్తవ వరుడు కావలెను. తూ॥గో॥/ప॥గో॥ వారికి ప్రాముఖ్యత/ వారి బయోడేటా/ఫోటోతో వాట్సాప్ 99897 70090 నకు పంపగలరు. నో ఫోన్ కాల్స్. [R-338]

SC మాల క్రిస్టియన్, వయస్సు 35 సం॥ H.5'5" M.Tech. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెలకు 1.50 వేలు జీతం వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్ కావలెను. డైరెక్ట్ ఫోన్: 77949 11019 [R-389]

వేదికలు



రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155 / 9391265304. [H-792959]

ప్రొఫైల్ లిస్టింగ్‌తో మీరు కోరుకున్న పెళ్లి సంబంధాన్ని పొందండి. ప్రతి ప్రొఫైల్ వెరిఫైడ్ సమాచారం గోప్యత. ఇండియా యొక్క మొదటి Marriage ప్రొఫైల్ లిస్టింగ్ వెబ్‌సైట్ BridesGrooms.in కాల్: 99856 48686 [HA-10055]

II MATCH విడో, డైవర్సీ, CNB, 25 సం॥ నుండి 65 సం॥ వరకు SWE/PVT /Govt/ మెడికోస్ మొదలగు వారికి సంబంధములు చూడబడును. Ph: 9391646037 [HA-10058]

40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్. kaakateeya.com. Ph: 9342939345, 9383 999 999. [HA-10053]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులాల వారికీ 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధృవ మ్యారేజెస్. 9949395407 [H-776729]

కాపు, మున్నూరు కాపు, బలిజ, తూర్పు కాపు ఇంజనీర్స్, డాక్టర్స్, NRI, Govt., Pvt., రిచ్ మ్యాచెస్ అతిత్వరగా మంచి సంబంధాలు కుదిర్చే ఏకైక సంస్థ. Ph: 9247217621 [HA-13188]

అబ్రాడ్&ఇండియాలో ఉన్నవారికి డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్,బిజినెస్,గ్రూప్ 1,2 ఆఫీసర్లు వ్యక్తిగత శ్రద్ధతో తొందరగా పెళ్లి సంబంధాలు కుదర్చబడును. పూర్ణమాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-424]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26-1-23 తేదీ ఉ. 9గం॥లకు 62వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ. 2 గం॥లకు 17వ పునర్వివాహ పరిచయవేదిక విజయవాడ KBN కాలేజ్‌లో జరుగును. వివరాలకు ✆ 99895 00130 [B-1679]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com ✆ 94920 33897, 94904 16355, 94407 85888 W [B-937]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS / IPS / MBBS / MD /MCA/Abroad & Govt Job Holders సంప్ర: శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182 [H-792668]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13168]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/2nd/దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-793251]

క్రైస్తవ వివాహ వేదిక: www.indiachristianmatrimony.com 10,000 మంది ప్రొఫైల్స్ అందుబాటులో కలవు 29.01.2023 2 pm-6 pm మహబూబ్ నగర్- హైదరాబాద్. Ph: 8885073555, 8885410555 [H-793257]

మాల, మాదిగ : IAS, IPS, IRS, IRTS, IES, Group-I, II, Bank P.O, USA, UK, SWE, B.Tech (IIT), MBA (IIM), Govt. Officer, MBBS, MD. Cont. Cell : 73969 15712. [M-8470]

★

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న Bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsp No.) [HA-863]

కేవలం డాక్టర్ వధూవరుల పరిచయ వేదిక అన్ని కులాలకు మరియు కేవలం ఆర్యావైశ్య పరిచయ వేదిక ఫోన్ నెంబర్లు, చిరునామా ఇవ్వబడును. 05-02-23 & 26-02-23, 1116/- భోజనం ఫ్రీ మొదటి 30 మందికి మాత్రమే 9705135074. [Z-0992955]

Free Registration/బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatapp) [HA-830]

మహబూబ్‌నగర్‌లో మాదిగ వివాహ పరిచయ వేదిక. 29/1/23 ఆదివారం 10-6PM ఫీ 1 వేయి ముందుగా మీ ఫోటో బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. Ph: 9347046175 [H-776690]

V.R.Reddy Marriage Bureau U.S.A & Local Matches Proposals For Rich Families Fast settlement. Ph: 9581725589 Email: ramana.Narsingi@gmail.com (Send Bio-data) [H-779943]

★★

మాల (క్రైస్తవ, హిందూ), M.Tech, M.S., MBA, MCA, M.B.B.S. చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్స్ చేస్తున్న వధూవరుల కొరకు kalyanamala.org ✆ 9440 5 45049 [B-1197876]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1800/- for 4 Lines, 485/- Extra Line	Andhra Pradesh: 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
Telangana : 1100/- for 4 Lines (Incl. Hyd) 300/- Extra Line	* Color 25% Extra

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.

3+2 — 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

నిజామాబాద్	:99122 20764	తిరుపతి	:99122 20586	తాడేపల్లిగూడెం	:99122 20558
కరీంనగర్	:9705933396	కడప	:99516 02932	రాజమండ్రి	:99122 20358
వరంగల్	:99516 02872	అనంతపూర్	:99122 20718	విజయవాడ	:9912225442
నల్గొండ	:95055 08382	కర్నూల్	:9010825556	గుంటూరు	:99122 20349
మహబూబ్‌నగర్	:99516 02829	శ్రీకాకుళం	:99122 20343	ఒంగోలు	:99122 25431
ఖమ్మం	:99516 02868	విశాఖపట్నం	:99122 20550	నెల్లూరు	:99516 02861

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, Hyd-34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912225453

ఎగువన గరళం.. దిగువన స్వచ్ఛం

▶ మొదటి పేజీ తరువాయి

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (జాతీయ ప్రమాణాలు) ప్రకారం ఒక్క రాష్ట్ర పరిధిలో మాత్రమే కృష్ణా జలాలు స్వచ్ఛంగా ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం నదీ జలాలు కలుషితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలేనని స్పష్టం చేస్తున్నాయి. గత మూడేళ్లుగా రాష్ట్ర పరిధిలో కృష్ణా బేసిన్‌లో మురుగు నీటిని శుద్ధి చేయడం, పారిశ్రామిక, గనుల వ్యర్థాలు నదిలో కలపకుండా అడ్డుకట్ట వేయడం ద్వారా జలాలు స్వచ్ఛంగా మారాయని సీపీసీబీ వర్గాలు వెల్లడించాయి.



కదిలే కాసారంగా కృష్ణా నది

- ▲ మహారాష్ట్రలో సతారా జిల్లాలోని పశ్చిమకనుమల్లో మహాబలేశ్వర్‌కు సమీపంలోని జోర్ గ్రామం వద్ద మొదలయ్యే కృష్ణమ్మ.. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మీదుగా 1400 కిలోమీటర్లు ప్రవహించి కృష్ణా జిల్లా హంసల దీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు(చెన్నై)లలో సుమారు 16 కోట్ల మందికి తాగు నీరందించడంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల సాగు, పారిశ్రామిక అవసరాలను కూడా కృష్ణా నదే తీరుస్తోంది.
- ▲ కృష్ణమ్మ ప్రారంభమయ్యే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, గనుల వ్యర్థాలను యథేచ్ఛగా నదిలోకి వదిలేస్తున్నారు. మహారాష్ట్రలో షిండి నుంచి కురంద్వాడ్ వరకు కృష్ణా నది జలాల్లో ఒక లీటర్ నీటికి బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ) 14 మిల్లీగ్రాములు ఉంది. ఈ జలాలు తాగడానికి కాదు కదా కనీసం స్నానం చేయడానికి కూడా పనికిరావు. ఆ జలాల్లో స్నానం చేస్తే చర్మ వ్యాధులు వస్తాయి.
- ▲ కర్ణాటక పరిధిలో యదుర్వాడి నుంచి తింతిని వరకు కృష్ణా నది జలాలు కలుషితమయ్యాయి. అక్కడి జలాల్లో ఒక లీటర్‌కు బీవోడీ 13 మిల్లీ గ్రాములు ఉంది. ఈ నీరు స్నానం చేయడానికి కూడా పనికి రాదు.
- ▲ తెలంగాణలో తంగడి నుంచి వాడపల్లి వరకు ఒక లీటర్ కృష్ణా జలాల్లో బీవోడీ 11 మిల్లీ గ్రాముల వరకు ఉంది. ఈ నీరు కూడా తాగడానికి పనికి రాదు.
- ▲ రాష్ట్రంలో 2018 వరకు అమరావతి నుంచి హంసలదీవి వరకు కృష్ణా జలాల్లో ఒక లీటర్ నీటికి 8 మిల్లీ గ్రాముల వరకు బీవోడీ ఉండేది. కాలుష్య కాసారంగా మారిన కృష్ణా నదిని పరిరక్షించాలని 2018 సెప్టెంబరు 28న జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

సత్ఫలితాలు ఇస్తున్న ప్రభుత్వ చర్యలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర పరిధిలో కృష్ణా నదిని పరిరక్షించడానికి చర్యలు చేపట్టారు. కర్నూలు జిల్లా సంగమేశ్వరం నుంచి హంసలదీవి వరకు కృష్ణా నది పరిసర విజయవాడ వంటి నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)లను నిర్మించారు. ఎస్టీపీల్లో మురుగు నీటిని శుద్ధి చేసి, పంటల సాగుకు వినియోగించేలా చర్యలు చేపట్టారు. పారిశ్రామిక, గనుల వ్యర్థాలను శుద్ధి చేయడంతోపాటు నదిలో కలపకుండా చర్యలు చేపట్టారు. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి, ఆ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించడం ద్వారా కృష్ణా నది కాలుష్యం బారిన పడకుండా చేశారు. దాంతో సంగమేశ్వరం నుంచి శ్రీశైలం, వేదాద్రి, అమరావతి, ప్రకాశం బ్యారేజ్, హంసలదీవి వరకూ కృష్ణా జలాలు స్వచ్ఛంగా మారాయి.

- ▲ ఇప్పుడు కృష్ణా నదిలో సంగమేశ్వరం వద్ద లీటర్ నీటిలో పీహెచ్ 6 శాతం, డైల్యూట్ ఆక్సిజన్ (డీవో) 5 మిల్లీ గ్రాములు, బీవోడీ 1.8 మిల్లీ గ్రాములు ఉంది.
- ▲ అమరావతి నుంచి హంసలదీవి వరకు నదిలో లీటర్ నీటిలో పీహెచ్ 6.1 శాతం, డీవో 6 మిల్లీ గ్రాములు, బీవోడీ 2.6 మిల్లీగ్రాములు ఉంది.
- ▲ సీపీసీబీ, జాతీయ ప్రమాణాల ప్రకారం రాష్ట్ర పరిధిలో కృష్ణా జలాలు స్వచ్ఛంగా ఉన్నాయి. ఈ నీటిని మనుషులు నేరుగా తాగొచ్చు.

అంతరిస్తున్న తోడేళ్లు!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా తగ్గిన వన్యప్రాణులు

- ఆవాసాలకు అనువైన ప్రాంతం లేక కనుమరుగు
- తోడేళ్ల జాబితాలోనే గుంట నక్కలు, పునుగు పిల్లులు



సాక్షి ప్రతినిధి అనంతపురం: క్రూర జంతువుగా పేరున్న తోడేళ్లు పొదలు, గుట్టలను ఆవాసాలుగా చేసుకుని జీవిస్తాయి. ఒకప్పుడు అటవీ ప్రాంతంలో ఎక్కడ చూసినా కనిపించేవి. గొర్రెలు, మేకల మంద సంచరించే ప్రాంతాల్లో తిరిగేవి. ముఖ్యంగా జీవాలు ఎక్కువగా ఉండే అనంతపురం జిల్లాలో భారీగా ఉండేవి. కానీ ప్రస్తుతం వాటి జాడ మచ్చుకైనా కనిపించడం లేదు. తాజాగా అటవీశాఖ అధికారులు వీటిని అంతరించిపోతున్న జంతువుల జాబితాలో చేర్చారు. రెండేళ్లుగా ఎక్కడా కనిపించడం లేదని వెల్లడిస్తున్నారు.

వేటలో పటిష్టమైన వ్యూహం

తోడేళ్లు గుంపులుగా సంచరిస్తాయి. వేటలో పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేస్తాయి. ఒకటి ముందుగా డెకాయ్ ఆపరేషన్ చేస్తుంది. ఆ తర్వాత మిగతా వన్నీ వస్తాయి. మేక లేదా గొర్రెను తీసుకెళ్లేటప్పుడు గొంతును నోట కరచుకుని, తన ముళ్ల తోకతో వెనుక కొడుతూ ఉంటుంది. దీంతో ఆ జీవం దానితో పాటు పరిగెడుతుంది. దీని వల్ల ఈ దృక్కోణ శ్రమ వాటికి తగ్గుతుంది. ఒక తోడేలు ఉందంటే రెండు మూడు నక్కలు కూడా దాని సమీపంలోకి పోలేవు. 2 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో 30కి మించి తోడేళ్లు ఉండేవని అంచనా. కాగా, ఒకప్పుడు ప్రతి జిల్లాలోనూ గుంటనక్కలు కనిపించేవి. ఇప్పుడు వాటి జాడ కూడా లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నాలుగేళ్లుగా మచ్చుకు కూడా కనిపించడం లేదు. పునుగుపిల్లి కూడా కనుమరుగైనట్లు అధికారులు చెబుతున్నారు.

అటవీ విస్తీర్ణం తగ్గడం వల్లే..

జనావాసాలు పెరిగాయి. అడవులు వ్యవసాయ భూములుగా మారాయి. దీంతో వన్యప్రాణుల ఆవాసానికి ఇబ్బందిగా మారింది. కొండలు ఎక్కువగా ఉన్న అనంతపురం లాంటి జిల్లాలే తోడేళ్లకు మంచి ఆవాసాలు. ఇక్కడే వీటి జాడ లేదంటే మిగతా చోట్ల అసలే కనిపించవు. వీటిని కాపాడుకునేందుకు సర్వశక్తులా యత్నిస్తున్నాం.

–సందీప్ కృపాకర్, జిల్లా ఫారెస్టు అధికారి, అనంతపురం

హెడ్ కానిస్టేబుల్‌పై టీడీపీ నేతల జులుం!

కణేకల్లు: 'వాళ్లు ఎవరనుకొంటున్నావ్.. టీడీపీ లీడర్లు.. మా వాళ్లు మమ్మల్ని పలుకరించేందుకు వస్తే అడ్డుకొంటావా..? గంట టైమ్ ఇస్తే మా ప్రతాపమేంటో చూపిస్తాం...' అంటూ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు ఉన్నం మారుతిచౌదరి, మాజీ వైస్ ఎంపీపీ గోళ్ల వెంకటేశులు కణేకల్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములుపై జులుం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే.. మంత్రి ఉషశ్రీచరణ్ కనగానపల్లి మండలం భానుకోట వద్ద సుజలాన్ కంపెనీ భూములను ఆక్రమించారని ఇటీవల దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు ఉన్నం మారుతి చౌదరి శనివారం జిల్లా టీడీపీ నేతలతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లాలని యత్నించారు. టీడీపీ నేతలంతా ఒక్కసారిగా అక్కడికి వెళితే శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందని భావించిన పోలీసులు.. అక్కడికి ఎవరూ వెళ్లకూడదని నోటీసుల ద్వారా సూచించారు. పలువురు టీడీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నం మారుతిచౌదరి,గోళ్ల వెంకటేశులు తమ వాహనాల్లో భానుకోటకు బయలుదేరడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి కణేకల్లు పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో కణేకల్లు టీడీపీ నాయకులు వెంటనే అక్కడకు చేరుకుని పోలీసు స్టేషన్‌లోకి దూసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అందరూ కాకుండా ఒక్కొక్కరుగా వెళ్లాలని సూచించారు. అయినప్పటికీ వారంతా ఒకే సారి వెళ్లేందుకు ప్రయత్నించగా లోపల ఉన్న ఉన్నం మారుతి చౌదరి, వెంకటేశు బయటికొచ్చి పోలీసులపై నానా యాగీ చేశారు. అదే సమయంలో పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఏఎస్‌ఐ ఈశ్వరయ్య, సిబ్బందిపైనా దౌర్జన్యానికి దిగారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at MNS Printers Private Limited, Survey No 76/1 Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.





1.0L Turbo Boosterjet Engine with Smart Hybrid



360 View Camera



Head Up Display



NEXTre' Rear Combination Lights



In-Built Suzuki Connect



Wireless Charger

Contact us at
1800-200-[6392]
1800-102-[NEXA]
www.nexaexperience.com
NOW YOU CAN ALSO BOOK ONLINE

CHENNAI: NEXA NANDANAM (POPULAR VEHICLES & SERVICES PH: 9282405816), **NEXA ANNA NAGAR** (RAJALAKSHMI CARS PVT. LTD. PH: 7401839007), **NEXA GUINDY** (ABT LIMITED PH: 6384450061), **NEXA OMR** (PILLAI & SONS PH: 9789045000), **NEXA POONAMALLEE HIGH ROAD** (CRESCO (A UNIT OF NEXGEN VENTURES PVT. LTD.) PH: 7824060800), **NEXA CHROMEPET** (VISHNU CARS PVT. LTD. PH: 7339333703), **NEXA VIRUGAMBAKKAM** (POPULAR VEHICLES & SERVICES PH: 8939014444), **NEXA KATTUPAKKAM** (VISHNU CARS PVT. LTD. PH:, 7339359222), **NEXA AMBATTUR** (KHIVRAJ MOTORS PH: 9789045037), **NEXA GST ROAD CHENGALPATTU** (AIE Cars (A I Enterprises Pvt Ltd) PH: 9344313318).

Accessories and features shown may not be part of standard equipment. Black glass on the vehicle is due to lighting effect. Images used are for illustration purposes only.